Postel No. MBN/08/2016-2018



పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల నొప్పులకు వనమూలికలతో వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :24 సంచిక :154 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు మంగళవారం 23 సెప్టెంబర్ 2025 పేజీలు :12 వెల రూ5 /-


## జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు
# పండుగే..పండుగ..

**హైదరాబాద్ , సెప్టెంబర్ 22:** జీఎస్టీ రేట్ల తగ్గింపుతో సామాన్య ప్రజలు ముఖ్యంగా మహిళలు ఆనంద పడుతున్నారు. సామాన్య ప్రజలకి ఖర్చుల భారం తగ్గించేందుకు ప్రభుత్వం GST రేట్లను తగ్గించింది. అలాగే తగ్గించిన GST రేట్లు సోమవారం నుండి అమలు లోకి వచ్చాయి. %+తూ% కేవలం రెండు శ్లాబ్‌లలో 5% లేదా 18% మాత్రమే ఉంటుంది.

**చౌకగా లభించే వస్తువుల జాబితా...**

పాశ్చురైజెడ్ పాలు, వెన్న, నెయ్యి, వెన్న నూనె, పాల స్ప్రెడ్‌లు, పనీర్ (చీజ్), పనీర్, రోటీ, చపాతీ, పాపడ్, పాస్తా, నూడుల్స్, కౌస్కాస్, పేస్ట్రీలు, కేకులు, బిస్కెట్లు, కార్న్ ఫ్లేక్స్, స్టీల్ గిన్నెలు, నమ్కీన్, భుజియా, మిక్షర్ (ప్యాకేజ్ చేసినవి), సాస్‌లు, మసాలాలు, మసాలా పొడి, టీ, కాఫీ పౌడర్, షికోరి కాఫీ గింజలు, జామ్, జెల్లీ, మార్మాలాడే, కొబ్బరి నీళ్లు (ప్యాక్ చేసినవి), కండెన్స్‌డ్ పాలు, టూత్ బ్రష్, డెంటల్-ప్లేట్ బ్రష్, టూత్‌పేస్ట్, పళ్ళ పొడి, టాయిలెట్ సబ్బు, షాంపూ, హెయిర్ ఆయిల్, షేవింగ్ క్రీమ్, షేవింగ్ లోషన్, ఆఫ్టర్ షేవ్, నేప్కిన్లు, పిజ్జా బ్రెడ్, పరాఠా, పరోటా బ్రెడ్, మట్టి గిన్నెలు, సిరామిక్ టేబుల్‌వేర్, కిచెన్‌వేర్, డ్రై ఫ్రూట్స్ ఖర్జూరాలు, అంజూర పండ్లు, పైనాపిల్, అవకాడో, మామిడి (ఎండినవి), సిట్రస్ పండ్లు (నారింజ, మాండరిన్లు, ద్రాక్షపండు, నిమ్మకాయలు) , ఇతర డ్రై ఫ్రూట్స్, గింజల మిశ్రమాలు (చింతపండు తప్ప), బ్రెజిల్ గింజలు, చక్కెర స్వీట్స్, చాక్లెట్, ఇతర బేకర్ల ఉత్పత్తులు, ఐస్ క్రీం, సూప్‌లు, రసం, టమోటా,



పుట్టగొడుగుల నిల్వలు, వెనిగర్లో నానపెట్టిన కూరగాయలు, ఈస్ట్, బేకింగ్ పౌడర్, టెక్స్చురైజ్డ్ వెజిటబుల్ ప్రోటీన్, ఎక్స్‌ట్రూడెడ్ నమ్‌కీన్, కొబ్బరి వెన్న, కొబ్బరి నూనె,కొబ్బరి పొడి, మాల్ట్-బార్లీ, కూరగాయల రసాలు, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్, టెలివిజన్ సెట్లు (అన్ని సైజులు) , ఎయిర్ కండిషనర్, మైక్రోవేవ్ ఓవెన్, ఇండక్షన్ కుక్కర్, రైస్ కుక్కర్, హీటర్, గ్రైండర్, మిక్సర్, జ్యూసర్, కుట్టు మెషిన్, వాక్యూమ్ క్లీనర్, ఇస్త్రీ పెట్టె, హెయిర్ డ్రైయర్, హెయిర్ స్ట్రెయిట్నర్, ఎలక్ట్రిక్ షేవర్, రూ.2500లోపు ఉన్న చెప్పుల ధర, కార్పెట్, వెదురు, మెటల్ ఫర్నిచర్, చెక్క ఫర్నిచర్, ప్లాస్టిక్ మోల్డెడ్ ఫర్నిచర్, గ్లాస్ గాజులు, కొవ్వొత్తులు, గొడుగులు, హ్యాండ్‌క్రాఫ్ట్ హ్యాండ్‌బ్యాగులు, పౌచ్‌లు, పర్సులు, హ్యాండ్‌బ్యాగులు, షాపింగ్ బ్యాగులు, చేతితో తయారు చేసిన శాలువాలు, టోపీలు, పెన్సిళ్లు, క్రేయాన్లు, పాస్టెల్లు, సుద్ద, రబ్బరు బ్యాండ్లు, ట్రైసైకిళ్లు, స్కూటర్లు, పెడల్ కార్లు, బొమ్మలు, ప్లేయింగ్ కార్డ్స్, చెస్ బోర్డు, క్యారమ్ బోర్డు, ఎడ్యుకేషనల్ టాయ్స్, పేపర్‌బోర్డ్, వ్యక్తిగత ఉపయోగం కోసం అన్ని మందులు, డయాగ్నస్టిక్ కిట్లు, రియాజెంట్లు, ఫీడింగ్ బాటిళ్లు, సర్జికల్ చేతి గ్లవుజులు, కాంటాక్ట్ లెన్సులు, టాల్కమ్ పౌడర్, ఫేస్ పౌడర్, సిమెంట్, జనపనార, వరి పొట్టు, జిప్సం, సిసల్, బాగస్సే, పత్తి కాండాలు, సిరామిక్ బిల్డింగ్ బ్రిక్స్, బ్లాక్స్, టైల్స్, తబలా, మృదంగం, వీణ, సితార్, ఫ్లూట్, షెహనాయ్, ఢోలక్, సైకిల్, డిష్ వాషర్, బైక్స్ (350%ఎఎ% వరకు), స్కూటర్లు, మోపెడ్‌లు, ఆటో, ఈ-రిక్షా,కార్లు (చిన్న ఇంకా మధ్య), విద్యుత్ వాహనాలు, అంబులెన్స్, బస్సులు, ట్రక్కులు, టైర్లు, ట్రాక్టర్ విడి భాగాలు, అగ్గిపుల్లలు ఇంకా కొన్ని ఇతర ఉన్నాయి.

**ఇవి పెరిగాయి వస్తువుల ధరలు**

పాన్ మసాలా, అన్ని ఫ్లేవర్స్ లేదా స్వీట్ వాటర్, ఆల్కహాల్ లేని పానీయాలు, కార్బోనేటేడ్ పండ్ల పానీయాలు, కెఫిన్ ఉన్న పానీయాలు, మొక్కల ఆధారిత పాల పానీయాలు, ముడి పొగాకు, పొగాకు ఉన్న ఉత్పత్తులు, సిగార్లు, సిగరెట్లు పొగాకు/నికోటిన్ ఉత్పత్తులు, బొగ్గు, బ్రికెట్లు, బొగ్గుతో తయారైన ఘన ఇంధనాలు, లిగ్నైట్, మెంథాల్ ఉత్పన్నాలు, బైక్స్ (350%ఎఎ% పైన), %ూఖఎ%లు, లగ్జరీ కార్లు, రివాల్వర్లు ఇంకా పిస్టల్స్, ప్రైవేట్ జెట్‌లు, వ్యాపార విమానాలు, హెలికాప్టర్లు, షిప్స్ ఉన్నాయి.

## హైకోర్టు ఆదేశాలు
# మీకు పట్టవా



**హైదరాబాద్ సెప్టెంబర్ 22:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలపై బుల్డోజర్లతో దాడులు చేస్తోందని, ఇది పూర్తిగా హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. సెలవు దినాల్లో ఎలాంటి కూల్చివేతలు చేపట్టవద్దని ఉన్నత న్యాయస్థానం స్పష్టంగా చెప్పినా, ప్రభుత్వం వాటిని పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఈరోజు జూబ్లీహిల్స్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.గాజులరామారంలో నిన్న పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. "హైకోర్టుకు సెలవు ఉన్న రోజు చూసి మరీ పేదల ఇళ్లను కూల్చివేశారు. ఈ హైడ్రా బుల్డోజర్ కేవలం పేదల ఇళ్లపైకే వెళుతుంది తప్ప, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్న పెద్దల జోలికి వెళ్లదు" అని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి సోదరుడితో పాటు, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి వంటి వారు ప్రభుత్వ భూముల్లో, చెరువు శిఖంలలో నిర్మాణాలు చేసినా వాటిని ఎందుకు కూల్చడం లేదని ఆయన ప్రశ్నించారు.గాజులరామారంలో జరిగిన కూల్చివేతల్లో తమ పార్టీ కార్యకర్త సర్దార్ ఇంటిని కూడా పడగొట్టారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కూల్చివేసిన ఆ ఇంటిని తిరిగి నిర్మించి ఇచ్చే పూర్తి బాధ్యత తాను స్వీకరిస్తున్నానంటూ ఆయన భరోసా ఇచ్చారు. "గాజులరామారంలో ఇళ్లు కూల్చారు, రేపు జూబ్లీహిల్స్‌లోని బోరబండ బస్తీకి కూడా రేవంత్ రెడ్డి హైడ్రాతో వస్తారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడమంటే మన ఇళ్లను కూలగొట్టడానికి లైసెన్స్ ఇచ్చినట్లే" అని ఆయన వ్యాఖ్యానించారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని, ఇక ఆ పార్టీ సినిమా అయిపోయిందని కేటీఆర్ విమర్శించారు.

## సమ్మక్కసాగర్ ప్రాజెక్ట్‌కు
# ఛత్తీస్‌గఢ్ గ్రీన్ సిగ్నల్



**ఇంటర్నెట్ డెస్క్:** తెలంగాణ రాష్ట్రంలోని సమ్మక్కసాగర్ ప్రాజెక్ట్‌కు ఎన్‌ఓసీ ఇచ్చేందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాయ్‌పూర్‌లో సీఎం విష్ణు దేవ్ సాయిని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ కలిశారు. నీట మునిగే భూభాగం పరిహారం భరించేందుకు తెలంగాణ అంగీకారం తెలిపింది. ములుగు జిల్లాలో 6.7 టీఎంసీ సామర్థ్యంతో ఈ సమ్మక్క సాగర్ డ్యామ్ నిర్మాణం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టు వల్ల నల్గొండ, వరంగల్‌లో తాగునీటి సమస్యలకు పరిష్కారం లభించనుంది. రామప్ప%-%పాకాల లింక్ కెనాల్ కింద కొత్తగా 12,146 ఎకరాలకు నీరు అందుతుంది. వరంగల్, సూర్యాపేట, మహబూబాబాద్, జనగాం, ఖమ్మం జిల్లాలకు లబ్ధి చేకూరుతుంది.

## సింగరేణి కార్మికులకు
# రూ 819 కోట్లు బోనస్ కేటాయింపు

**కాంట్రాక్ట్ కార్మికులకు రూ 5,500 బోనస్**

**సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్:** సింగరేణి కార్మికులకు లాభాల వాటా ప్రకటన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.సీఎం రేవంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికుల పోరాటాన్ని చరిత్ర ఎప్పటికీ మరువదు. రాష్ట్ర సాధన ప్రక్రియలో ప్రత్యేక పాత్ర పోషించిన సింగరేణి కార్మికులను మా పార్టీ, ప్రభుత్వం ఎప్పటికీ గుర్తిస్తూనే ఉంటుందని అన్నారు.సింగరేణిని లాభాల బాటలో నడిపించేందుకు కార్మికులు ఎంతో కృషి చేస్తున్నారు. అందుకే సింగరేణి లాభాలలో కార్మికులకు వాటాలు పంచాలని మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కార్పొరేట్ కంపెనీలతో పోటీ పడేలా సింగరేణిని తీర్చిదిద్దుతాం. సింగరేణి మొత్తం ఆదాయం రూ.6394 కోట్లు. ఇందులో



రూ.4034 కోట్లు భవిష్యత్ పెట్టుబడులకు కేటాయించాం. రూ. %శ్రీ%2360 కోట్లు నికర లాభాలు వచ్చాయి. అందులో 34 శాతం రూ.819 కోట్లు పర్మినెంట్ కార్మికులకు బోనస్ కోసం కేటాయించామని అన్నారు. గత ఏడాది కాంట్రాక్టు కార్మికులకు గత ఏడాది రూ.5000 బోనస్ అందించాం. ఈసారి కాంట్రాక్టు కార్మికులకు రూ.5500 బోనస్ అందిస్తున్నాం. ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిన గనులను కూడా సింగరేణికి అప్పగించేలా చూడాలని కార్మికులు కోరారు. ప్రైవేటు భాగస్వామ్యం పెరుగుతూ పోతే భవిష్యత్ లో సింగరేణి మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. ఈ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.. ఆ దిశగా కేంద్రంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. భవిష్యత్ లో కార్మికులకు అండగా ఉంటాం.. సింగరేణి సంస్థను లాభాల బాటలో పయనించేందుకు కృషి చేస్తాం. కార్మికులకు దీపావళికి కూడా బోనస్ ప్రకటిస్తాం. కేంద్రం జీఎస్టీని సవరించడంతో రాష్ట్రానికి దాదాపు రూ.7 వేల కోట్లు ఆదాయం తగ్గింది. తక్షణమే రాష్ట్రానికి జరిగే నష్టాన్ని కేంద్రమే పూడ్చాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

## కవితకు
# కేసీఆర్ పిలుపు..?

**హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా కల్వకుంట్ల కవిత వ్యవహారం హాట్ టాపిక్ అయింది. భారత రాష్ట్ర సమితి అధికారం కోల్పోయిన తర్వాత, చోటు చేసుకున్న పరిణామాలు ఆ పార్టీ అధినేత కేసీఆర్ ను మరింత ఇబ్బంది పెడుతున్నాయి. అధికారంలో ఉన్న సమయంలో విపక్షాలను నానా ఇబ్బందులు పెట్టిన బిఆర్ఎస్, ఇప్పుడు కుటుంబ సమస్యలతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. కవితను శాంతింప చేయాలని కేసిఆర్ ఎన్నిసార్లు ప్రయత్నాలు చేసినా సరే లాభం లేకుండా పోయింది.నేరుగా మాజీ మంత్రి హరీష్ రావు ను లక్ష్యంగా చేసుకుని కవిత విమర్శలు చేశారు. దీనితో కవితను కేసీఆర్ సస్పెండ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక ఇప్పుడు కవిత జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉందంటూ కూడా ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి అప్రమత్తమైంది. కవిత పోటీ చేస్తే ఖచ్చితంగా తమ పార్టీ ఓట్లు చీలుతాయి అనే భావనలో ఆ పార్టీ అధిష్టానం ఉంది.



తెలంగాణ జాగృతి నుంచి కవిత మాజీ ఎమ్మెల్సీ అలీ ఖాన్ ను పోటీలో నిలబెట్టే అవకాశం ఉందంటూ వార్తలు వస్తున్నాయి.దీనితో మాజీ సీఎం కేసీఆర్ కవితను ఎర్రవల్లి ఫామ్ హౌస్ కు పిలిచినట్లు సమాచారం. ఆమెతో చర్చలు జరపాలని పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. కవితను పోటీ నుంచి తప్పిస్తే తమకు ఎటువంటి ఇబ్బంది ఉండదు అనే భావనలో కూడా బీఆర్ఎస్ నాయకత్వం ఉంది. ఒకవేళ కవిత పోటీ చేస్తే పార్టీ ఓట్లు చీలడమే కాకుండా అది అధికార పార్టీకి లాభం చేసే అవకాశం ఉండవచ్చు అంటూ రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓటు కవితకు పడటం సంగతి పక్కనపెడితే, బీఆర్ఎస్ ఓట్లు మాత్రం కవితకు కొంత పడే అవకాశాలు జూబ్లీహిల్స్ లో ఉన్నాయి.రెండు మూడు రోజుల్లో కవితతో కేసీఆర్ చర్చలు జరిపి, ఆమెను శాంతింప చేస్తారంటూ కూడా ప్రచారం జరుగుతోంది. కవితతో కేటీఆర్ మాట్లాడే ప్రయత్నం చేసిన లాభం లేకుండా పోయిందని, అందుకే కేసిఆర్ నేరుగా రంగంలోకి దిగారు అంటున్నాయి ఆ పార్టీ వర్గాలు. ఇక బీహార్ అసెంబ్లీ ఎన్నికల తో పాటుగా ఉప ఎన్నికలు జరిగే అవకాశం కనబడుతోంది. నవంబర్ లేదా డిసెంబర్ లో ఎన్నికలను నిర్వహించనుంది కేంద్ర ఎన్నికల సంఘం.

## తెలంగాణ రైజింగ్ కోర్ అర్బన్ అభివృద్ధిపై
# సీఎం రేవంత్ స్పెషల్ ఫోకస్



**హైదరాబాద్, సెప్టెంబర్ 22 :** తెలంగాణ రైజింగ్ కోర్ అర్బన్ ఏరియా అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇవాళ(సోమవారం) వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు అధికారులు. ఐదు ప్రధాన అంశాల ప్రాతిపదికన అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సీఎంకు వివరించారు అధికారులు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. వీధి వ్యాపారుల కోసం ప్రత్యేక వెండింగ్ జోన్స్‌ను ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. మల్టీ స్టోరేజ్ బిల్డింగ్స్, ఫైర్ సేఫ్టీ అంశాలపై పలు సూచనలు చేశారు ముఖ్యమంత్రి. వీధి దీపాలకు సోలార్ విద్యుత్ వినియోగం, కొత్తగా పునరుద్ధరిస్తున్న చెరువుల వద్ద పైలట్ ప్రాజెక్టుగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. కోర్ అర్బన్ రీజియన్‌లో వీధుల ఆధునీకరణ, సుందరీకరణ చేపట్టాలని మార్గనిర్దేశం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు ముఖ్యమంత్రి. విద్యుత్ సబ్ స్టేషన్ల అప్ గ్రేడేషన్‌తో పాటు, విచ్చలవిడిగా ఉన్న ట్రాన్స్ ఫార్మర్లను స్ట్రీమ్ లైన్ చేసి రీ-లొకేట్ చేయాలని దిశానిర్దేశం చేశారు సీఎం. మంచినీటి, మురుగునీటి వ్యవస్థపై నిర్వహణ వేర్వేరుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతుల విషయంలో వివిధ విభాగాల మధ్య సమన్వయం ఉండేలా చూసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

వార్తాతరంగాలు

మంగళవారం 23 సెప్టెంబర్ 2025

# సంపాదకీయం

## మావోయిస్టుల్లో మార్పు సాధ్యమేనా

ఆపరేషన్ కగార్.. మావోయిస్టులను కంగారెత్తిస్తున్నాయి. అందుకే కాల్పుల విరమణ పాటిద్దాం.. చర్చలకు సిద్ధం అని చెప్పడం సంచలనంగా మారింది. ఇకపై ప్రజా పోరాటాల్లో పాల్గొంటామన్న మావోలు. మావోయిస్టు పార్టీ తీసుకున్న సంచలన నిర్ణయం చుట్టూ పెద్ద కథే నడుస్తోంది. ఆయుధాలను వదిలి సాయుధ పోరాటానికి తాత్కాలిక విరమణ పాటించాలని నిర్ణయించినట్లు ప్రకటించింది. మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో లేటెస్ట్ గా ఒక ప్రకటన రిలీజ్ అయింది. అభయ్ పేరుతో చలామణి అవుతున్న కిషన్ సోదరుడు మల్లోజుల వేణుగోపాల్ ఫోటోను తాజా స్టేట్ మెంట్లో ప్రింట్ చేశారు. అంతే కాదు ప్రజాభిప్రాయాలు పంచుకునేందుకు ఫేస్ బుక్, ఈ మెయిల్ ఐడీలను జత చేశారు. నిజానికి మావోయిస్టులు గతంలో ఎన్నడూ ఇలా చేసిన దాఖలాల్లేవు. కానీ ఇది నిజమే అంటున్నారు. నెల రోజుల తర్వాత బయటికొచ్చిన స్టేట్మెంట్. ఆగస్టు 15వ తేదీతో ఉన్న ఈ స్టేట్ మెంట్ నెల రోజుల తర్వాత అంటే సెప్టెంబర్ 16న రాత్రి వెలుగులోకి వచ్చింది. శాంతి చర్చకు సిద్ధమే అన్న సంకేతాలు పంపారు. ఈఏడాది మార్చి నుంచి మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రభుత్వంతో శాంతిచర్చలకు నిజాయతీగా ప్రయత్నిస్తోందని, మే 10న పార్టీ ప్రధాన కార్యదర్శి స్వయంగా పార్టీ కేంద్ర కమిటీ ప్రతినిధి అభయ్ పేరుతో ప్రకటన విడుదల చేశారు. పార్టీ ఆయుధాలను వదులుకుంటున్నట్లు ప్రస్తావించారు. ప్రభుత్వానికి కాల్పుల విరమణ ప్రతిపాదించారు. అయితే కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా రియాక్ట్ కాలేదు. ఒకవైపు తుపాకులు చేతబట్టి ఇంకోవైపు చర్చలు అంటే ఎలా అని క్వశ్చన్ కూడా చేశారు. వీటికి తోడు 2024 జనవరి నుంచి బలగాలతో కూంబింగ్ ముమ్మరం చేయించి దొరికితే ఎన్ కౌంటర్ అన్నట్లుగా వ్యవహారం నడిపిస్తోంది. చాలా మంది ఎన్ కౌంటర్లలో హతమయ్యారు. ఇందులో పార్టీ అగ్రనేతల నుంచి కామన్ మావోయిస్టుల దాకా ఉన్నారు. మే 21న గుండెకోట్ సమీపంలో జరిగిన భీకర దాడిలో పార్టీ ప్రధానకార్యదర్శి బస్వరాజ్‌తో పాటు 28 మంది చనిపోయారు. ఆపరేషన్ కగార్‌ను స్పీడప్ చేసిన కేంద్రం. పైగా కేంద్రం ఆపరేషన్ కగార్ ను స్పీడప్ చేసింది. 2026 మార్చి నాటికి మావోయిస్టుల అంతమే పంతంగా ముందుకెళ్తోంది. మొన్నటికి మొన్న కర్రెగుట్టల్ని జల్లెడ పట్టి కథ ముగించారు. ఇంకా కూంబింగ్స్ పెద్ద ఎత్తున సాగుతున్నాయి. గ్రౌండ్ నుంచి హెలికాప్టర్లు ఇలా అన్ని చోట్లా గాలింపు పెరగడంతో మావోయిస్టులకు షెల్టర్ కరువైంది. దీంతో బస్వరాజ్ ఆలోచనలకు తగ్గట్లుగా శాంతిచర్చలను ముందుకు తీసుకెళ్లాలని తాము నిర్ణయించుకున్నామంటోంది మావో యిస్టు పార్టీ. ఆయుధాలు విదలి జనజీవన స్రవంతిలో కలవాలన్న ప్రధాని సూచనతో తాము వెపన్స్ వదిలేయాలని డిసైడ్ చేసుకున్నామంటున్నారు. హోంమంత్రి లేదంటే ఆయన ప్రతినిధి ఎవర్ని నియమించినా చర్చలకు సిద్ధమంటున్నారు. అయితే తమ అభిప్రాయం చెప్పడానికి తమ ఇతర సహచరులు, అలాగే జైళ్లలో ఉన్న మావోయిస్టు నేతలను సంప్రదించి నిర్ణయం ప్రకటిస్తామని, ఇందుకోసం నెల రోజుల టైం ఇవ్వాలన్నారు. ఆ లోపు కూంబింగ్ వద్దు.. బలగాల కాల్పులు వద్దు అని కోరుకుంటున్నారు. చర్చల విషయంలో ప్రభుత్వంతో వీడియోకాల్ ద్వారానైనా తమ అభిప్రాయాలను పంచుకోవడానికి రెడీ అంటున్నారు. సో ఇప్పుడు అసలు గేమ్ షురూ కాబోతోంది. 2026 మార్చి నాటికి మావోయిస్టుల్ని నామరూపాల్లేకుండా చేయాలని, పూర్తిగా రెడ్ కారిడార్ అన్నదే లేకుండా చేయాలన్న లక్ష్యంతో కేంద్రం ఉంది. అయితే మావోయిస్టులను లొంగిపోయేలా చేయడం, లేదంటే ఎన్ కౌంటర్లలో హతమార్చడం ఈ రెండే టార్గెట్. మధ్యలో చర్చలకు తావు లేదని కేంద్రం అంటోంది. మరి రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందన్నది కీలకంగా మారింది. మావోయిస్టుల్లో ఇప్పుడు అగ్రనేతలంతా చాలా వరకు ఎన్ కౌంటర్ అయ్యారు. కొందరే మిగిలారు. అందులో చాలా మంది లొంగిపోవడానికి రెడీగా లేరు. చావో రేవో అంటున్నారు. అటు మరికొందరు కగార్ తో ఏ ఒక్కరు కూడా బతికే పరిస్థితి లేదంటున్నారు. అందుకే ఆయుధాలు వదిలి చర్చలకు ప్రయత్నిద్దామని చెప్పి ఇలా లేఖ రిలీజ్ చేశారా? అసలు ఈ లేఖ నిజమా కాదా అన్నది కూడా మరో డౌట్ గా మారింది. మరిప్పుడు గేమ్ ఎలా మారబోతోంది? జనంలోనే ఉండి పోరాటాలు చేస్తారా? కేంద్ర ప్రభుత్వం అస్సలు ఛాన్స్ ఇవ్వట్లేదు. ఈ మొత్తం ఎపిసోడ్ లో సామాన్యులకు ఇబ్బందులు వస్తున్నాయని, కోవర్టులని, మరొకటని సమస్యలు పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదు. దీంతో ఏ ప్రజల కోసమైతే అడవుల బాట పట్టారో ఇప్పుడు జనంలోనే ఉండి ప్రజాపోరాటాలు చేయాలన్న నిర్ణయానికి మావోలు వచ్చారా అన్న చర్చ జరుగుతోంది. ఒకవేళ మావోయిస్టులు నిజంగానే తుపాకులు వదిలి జనజీవన స్రవంతిలోకి వస్తే వెనుకబడిన ప్రాంతాల్లో శాంతి, అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందంటున్నారు. నిజానికి కేంద్రం ప్రభుత్వం మావోయిస్టులతో అసలు చర్చలే లేవంటోంది. అయితే లొంగిపోవడం, లేదంటే ఎన్ కౌంటర్ అవడం రెండే ఆప్షన్లు ఇచ్చింది. సో నెల రోజులు కాల్పుల విరమణ కొనసాగుతుందా లేదా అన్నది కూడా పెద్ద డౌటే. తెలంగాణ, ఏపీ, జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర ఇలా రెడ్ కారిడార్ ఏరియాల్లో అగ్రనేతలంతా ఒక్కొక్కరుగా వచ్చి డీజీపీలు, ఐజీలు ఇలా పోలీస్ ఆఫీసర్ల ముందు లొంగిపోతున్నారు. ఇటీవలే తెలంగాణలో డీజీపీ ముందు సుజాతక్క సరెండర్ అయ్యారు. మావోలకు బలగాలపై తిరగబడే పరిస్థితి ఉందా? సో కేంద్ర ప్రభుత్వం సిగ్నల్స్ ప్రకారం చూస్తే మావోయిస్టులు సాయుధ పోరాటాన్ని వదులుకోవడమే మార్గంగా కనిపిస్తోంది. బలగాలపై తిరగబడే పరిస్థితి అసలే లేదు. సామాజిక సమస్యలపై దృష్టి పెట్టి ప్రజా పోరాటాలే చేయడం మార్గం ఉంది. సో ఫైనల్ గా మావోయిస్టు ఉద్యమంలో బిగ్ ట్విస్ట్ వచ్చినట్లైంది. ఆపరేషన్ కగార్ ఎఫెక్ట్ తో కథ మారిపోతోంది. పెద్ద ఎత్తున సరెండర్లు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 600 మంది వరకు మావోయిస్టులు అరెస్ట్ అవడం లేదంటే లొంగిపోవడం జరిగాయి. గత 16 నెలల్లో 1600 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారు. సిపిఐ మావోయిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీ పూర్తి సరెండర్‌కు రెడీ అని ప్రకటించడం వెనుక పెద్ద కారణాలే ఉన్నాయి. ఈ ఏడాది 192 మంది ఎన్ కౌంటర్ అయ్యారు. గత 9 నెలల్లో 210 మంది, గత 15 నెలల్లో 400 మంది హతమయ్యారు. 2024 జనవరిలో ఆపరేషన్ కగార్ ప్రారంభమైన తర్వాత మావోయిస్టులు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు. ఎందుకంటే సైనిక బలగాలు డ్రోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లక్ష మంది పారా-మిలిటరీ బలగాలతో హైటెక్ ఆపరేషన్లు చేస్తున్నాయి. దీంతో మావోయిస్టులు ఎక్కడా తలదాచుకోలేపోతున్నారు. వారి జాడను ఈజీగా పసిగట్టేస్తున్నాయి. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌లో 31 మంది హతం. 2025 మేలో ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌లో 31 మంది మావోయిస్టులు హతమయ్యారు. సో ఇప్పుడు కాల్పుల విరమణ, అలాగే చర్చలు అంటూ మావోలు ప్రతిపాదన పెట్టడం వెనుక భారీ వ్యూహమే ఉందంటున్నారు. ఒక నెల రోజులు ఆపరేషన్ కగార్ ఆగితే.. రీ గ్రూప్ అవ్వొచ్చని, బలపడేలా రిక్రూట్ చేసుకోవడం, అడవుల్లో కాకుండా జనంలో కలిసి తిరగడం ఇలాంటి నయా స్ట్రాటజీల కోసం వ్యవహారం నడుపుతున్నారా అన్నది కూడా డౌట్ ఫుల్ గా మారుతోంది. ప్రస్తుతం మావోయిస్టుల ప్రభావం 40 వేల చదరపు కిలోమీటర్ల నుంచి 18 జిల్లాలకు తగ్గింది. అగ్రనాయకత్వం ఎన్ కౌంటర్ అయింది. ఉమ్మడి ఏపీ ఉన్నప్పుడు మావోలతో చర్చలు జరిగాయి. అయితే అవి విఫలమయ్యాయి. ఆ టైంలో మావోయిస్టులు అఫీషియల్ గా రీగ్రూప్ అయ్యారు. దీంతో కేంద్రం చర్చలకు నో అన్న పాలసీతో ఉంది. సో రెడ్ కారిడార్ అంటే ఛత్తీస్‌గడ్, జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్రలోని అడవి ప్రాంతాల్లో ఇక వైట్ ఫ్లాగ్ ఎగరేయడం ఖాయంగానే కనిపిస్తోంది. ఎండ్‌గేమ్‌కు టైం చాలా దగ్గర పడింది

# గేమ్ ఛేంజర్ గా జీఎస్టీ సంస్కరణ




పెద్ద నోట్ల రద్దు, కరోనా పీడ దినాలు.. ఇలా అనేక సందర్భాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన అలా ప్రసంగించిన ప్రతి సందర్భంలోనూ సంచలన విషయాలను పంచుకున్నారు. ఆ విషయాలన్నీ జాతిని జాగృతం చేసే దిశగా నడిచాయి. విప్లవాత్మక మార్పులకు నాంది పలికాయి. తాజాగా నరేంద్ర మోడీ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈసారి కూడా సంచలన విషయాలను పంచుకున్నారు. అమెరికా హెచ్ వన్ బీ వీసాల మీద తీసుకున్న నిర్ణయం.. ఓట్ చోరీ.. నేపాల్ దేశంలో ఆందోళనలు.. ఇన్ని పరిణామల మధ్య నరేంద్ర మోడీ ఏదో ఒక కీలక విషయాన్ని వెల్లడిస్తారని.. సంచలన విషయాలను ప్రకటిస్తారని ప్రచారం జరిగింది. దానికి తగ్గట్టుగానే నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. సంచలన విషయాలను వెల్లడించారు.. ఇటీవల కాలంలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భారతదేశంలో కూడా నేపాల్ మాదిరిగానే జెడ్ జనరేషన్ ఉద్యమం వస్తుందని వ్యాఖ్యానించారు . ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని.. ఏ క్షణమైనా సరే మనదేశంలో పెను ప్రకంపనలు చోటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ మాటలు ఏ రాజకీయ నాయకుడు అన్నా పెద్దగా పట్టింపు ఉండేది కాదు. రాహుల్ గాంధీ ఈమాటలు అనడంతో సాధారణంగానే చర్చ మొదలైంది. దీనిపై బీజేపీ కూడా ఘాటుగానే స్పందించినప్పటికీ.. మోడీ మాత్రం ఒక్క మాట కూడా మాట్లాడలేదు. దేశంలో నవరాత్రి ఉత్సవాలు మొదలవుతున్నాయి. దాంతోపాటు జీఎస్టీ బచత్ ఉత్సవం కూడా మొదలవుతుంది. ఐదు శాతం, 18% జిఎస్టి స్లాబులు మాత్రమే అమల్లోకి వస్తాయి. దీంతో ప్రతి ఇంట్లో సంతోషం వెల్లి విరుస్తుంది. ఈ సంస్కరణ భారతదేశ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుంది. ఆత్మనిర్భర్ దిశగా ఇది కీలకమైన ముందడుగు. గతంలో ప్రతి చోట రకరకాల పన్నులు విధించేవారు. ప్రజలను ఇబ్బందులు పెట్టేవారు. ప్రజలను గందరగోళం నుంచి బయటపడడానికి జీఎస్టీ అమల్లోకి వచ్చింది. వన్ నేషన్ వన్ టాక్స్ స్వప్నం సాకారం అయింది. సరికొత్త చరిత్ర సృష్టించేందుకు ఈ సంస్కరణలు తోడ్పడతాయి. ఫలితంగా పెట్టుబడుల ప్రవాహం పెరుగుతుందని నెక్స్ట్ జెన్ జీఎస్టీ ఉత్సవం ప్రారంభమవుతుందని" నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఇటీవల కాలంలో రాహుల్ గాంధీ సమయం దొరికిన ప్రతి సందర్భంలోనూ జనరేషన్ జెడ్ తరాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్నారు. వారిలో నేపాల్ తరహాలో ఉద్రేకాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రధాని మాత్రం అలాంటివి చేయకుండా ఈ జనరేషన్ కు జీఎస్టీ మార్పుల వల్ల లాభం జరుగుతుందని పేర్కొన్నారు. యువత వల్లే దేశం ఈ స్థాయిలో ఉందని.. వారి కోసం ఏమైనా చేస్తామని ప్రకటించారు. తద్వారా రాహుల్ గాంధీ ఆశలపై నీళ్లు చల్లారు నరేంద్ర మోడీ.జీఎస్టీ స్వరూపంలో కేంద్రం కీలక మార్పులు తీసుకొచ్చింది. ఇకపై స్టాండర్డ్ , మెరిట్ పేరుతో జీఎస్టీలో రెండే శ్లాబులు ఉంటాయి. వాటిలో ఒకటి 5% కాగా రెండోది 18%.గుట్కా, పొగాకు, పొగాకు ఉత్పత్తులు, సిగరెట్లపై మినహా మిగిలిన ఉత్పత్తులపై పన్ను మార్పులు అమల్లోకి వచ్చాయి. తలనూనెలు, కార్న్‌ఫ్లేక్స్, టీవీలు, వ్యక్తిగత ఆరోగ్య ఉత్పతులు వంటివాటిపై పన్ను తగ్గనుంది. రోటీ, పరోటాలపై జీఎస్టీ సున్నా. ప్రాణాధార ఔషధాలపై ఎటువంటి పన్ను లేదు. ఖరీదైన కార్లు, పొగాకు ఉత్పత్తులు-సిగరెట్లపై ప్రత్యేకంగా 40 శాతం స్లాబును ప్రతిపాదించారు. దాదాపుగా వ్యక్తిగత వస్తువులన్నింటికీ పన్ను తగ్గించడం ద్వారా దేశీయ వినిమయాన్ని పెంచి.. అమెరికా సుంకాల భారం నుంచి కొంత ఉపశమనం పొందాలని ప్రభుత్వం భావిస్తోంది. దేశీయ వాణిజ్యాన్ని పరుగు పెట్టించేందుకు, వినియోగాన్ని గణనీయంగా ప్రోత్సహించే దిశగా నిర్ణయాలు తీసుకున్న జీఎస్టీ మండలి.. పండగ సీజన్‌ను మరింత ఉత్సాహభరితంగా మార్చింది. వ్యక్తిగత, ఆరోగ్య బీమా పథకాలపై జీఎస్టీ రద్దు చేయడం.. కోట్ల మందికి బీమాను చేరువ చేసేందుకు ఉపయోగపడనుంది. అన్ని నిర్ణయాలనూ ఏకాభిప్రాయంతో తీసుకున్నామని, ఏ ఒక్క రాష్ట్రం వీటిని వ్యతిరేకించలేదని నిర్మలా సీతారామన్ తెలిపారు.సామాన్య ప్రజల జీవితాలను మెరుగుపరచడం, ఆర్థిక రంగాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణపై స్థూలంగా ఒక ప్రతిపాదనను కేంద్రం రూపొందించింది. దీనిపై జీఎస్టీ మండలి ఉమ్మడిగా నిర్ణయం తీసుకుంది. జీఎస్టీ రేట్లలో కొత్త మార్పులతో చిరు వ్యాపారులు, రైతులు, మధ్యతరగతి, మహిళలు, యువతకు మేలు జరుగుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రధానంగా ఇన్సూరెన్స్ రంగానికి జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చారు. అన్ని రకాల హెల్త్, లైఫ్, టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలపై జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఈ క్రమంలో ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గుతుంది బీమా రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ తగ్గింపు పూర్తిస్థాయిలో అమలు కాకపోవచ్చనే అంచనాలూ లేకపోలేదు. రాష్ట్రాల ఆదాయాన్ని 14 శాతం పెంచి, రక్షించాలని జీఎస్టీ విధానాన్ని రూపొందించగా.. గత అయిదేళ్లలో రాష్ట్రాలు రూ.63,265 కోట్లు అదనంగా పొందాయని తెలిపింది. జీఎస్టీ ఆదాయం పెంచుకోవడం ద్వారా ప్రతి రూ.100 జీఎస్టీలో రాష్ట్రాలకు దాదాపు రూ.70.5 వస్తున్నట్లు వివరించింది. జీఎస్టీ ప్రవేశ పెట్టినప్పుడు రాష్ట్రాలకు అయిదేళ్ల వ్యవధిలో 14 శాతం వార్షిక ఆదాయ పెరుగుదలకు హామీ ఇచ్చారు. విలాస వస్తువులు, హానికర ఉత్పత్తులపై సెస్ వసూలు చేసి, ఆదాయ లోటును భర్తీ చేస్తామనీ పేర్కొన్నారు. కానీ, కరోనా మహమ్మారి కారణంగా ఆదాయ లోటు పెరిగింది. కేంద్రం రూ.2.69 లక్షల కోట్ల రుణాలు తీసుకుని, ఆ మొత్తాన్ని రాష్ట్రాలకు అందించింది. మొత్తంగా రాష్ట్రాలు రూ.9.14 లక్షల కోట్ల పరిహారం పొందాయి. ఇది హామీ ఇచ్చిన మొత్తంతో పోలిస్తే రూ.63,265 కోట్లు అధికమని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది.2025-26 ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రాలు జీఎస్టీ పేరంగా నికర ఆదాయంతోనే ఉంటాయని ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా వేసింది. 9.5 శాతం నికర జీఎస్టీ రేటుతో అదనంగా రూ.52,000 కోట్ల ఆదాయం వస్తుందని, దీంట్లో రాష్ట్రాలకు, కేంద్రానికి రూ.26,000 కోట్ల చొప్పున వస్తుందని వివరించింది. రాష్ట్రాల వారీగా అంచనాలు కూడా నివేదికలో పేర్కొంది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ అంచనా ఆదాయం రూ.35,863 కోట్లుగా ఉండగా, జీఎస్టీ సవరణ అనంతరం రూ.52,622 కోట్ల వరకూ ఆదాయం లభిస్తుందని ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా వేసింది. అంటే, రూ.16,759 కోట్ల వరకూ ఆదాయం పెరగనుందని పేర్కొంది. తెలంగాణ విషయానికి వస్తే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ ఆదాయం రూ.42,075 కోట్లు వచ్చే అవకాశం ఉండగా, సవరణ తర్వాత రూ.8,705 కోట్లు అదనంగా మొత్తం రూ.50,779 కోట్లు రావొచ్చని నివేదిక వెల్లడించింది. గతంలో జులై 2018, అక్టోబరు 2019లో రేట్లు తగ్గించినప్పుడు తాత్కాలికంగా 3-4% రాబడి తగ్గినా తర్వాత 5-6% వృద్ధితో రాష్ట్రాలకు మరింత ఆదాయం వచ్చిందని పేర్కొంది. మొత్తంగా రూ.లక్ష కోట్ల అదనపు ఆదాయం వచ్చిందని పేర్కొంది. జీఎస్టీ వ్యవస్థ గిరాకీని పెంచడమే కాకుండా, పన్ను వ్యవస్థను సరళీకరించిందని తెలిపింది.గత ఎనిమిదేళ్ల జీఎస్టీ ఆదాయాన్ని విశ్లేషించినా అంత కంగారు పడాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. దేశంలో జీఎస్టీ ప్రవేశపెట్టినప్పుడు కూడా పలురకాల పన్నులు ఎత్తేసి.. ఒకటే పన్ను అంటే ఆదాయం తగ్గుతుందని భయపడ్డారని గుర్తుచేశాయి. కానీ వాస్తవం వేరేగా ఉందని గణాంకాలు రుజువు చేశాయని తెలిపాయి. జీఎస్టీ ఆదాయ స్థిరీకరణకు కాస్త సమయం పట్టిందని, ఒక్కసారి జీఎస్టీ ఆదాయ స్థిరీకరణ జరిగిన తర్వాత.. పన్ను వసూళ్లు క్రమంగా పెరిగాయని విశ్లేషించాయి. ఇప్పుడు కూడా నష్టాలు, వాటిని పూడ్చుకోవడంపై పక్కా అంచనాలు వేసుకున్నాకే.. కేంద్రం జీఎస్టీ హేతుబద్ధీకరణ నిర్ణయం తీసుకుందని చెబుతున్నాయి.

# వైసీపీలో ఫ్యూచర్ లేదా...


**విశాఖపట్టణం, సెప్టెంబర్ 22:**వైసీపీ ఎమ్మెల్యే పార్టీ మారతారన్న చర్చజరుగుతుంది. గత 2024లో జరిగిన ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా వైసీపీ గెలిచిన పదకొండు స్థానాల్లో అరకు నియోజకవర్గం ఒకటి. అయితే అరకు నియోజకవర్గం ప్రస్తుత ఎమ్మెల్యే మత్స్యలింగం పార్టీని వీడతారన్న ప్రచారం జరుగుతుంది. కానీ ఆ ప్రచారం ఎంత మేరకు నిజం అన్నది మాత్రం తెలియడం లేదు. ఇంకా శాసనసభ ఎన్నికలకు మూడున్నరేళ్ల సమయం ఉంది. అయితే ఇప్పుడు పార్టీ మారితే తన రాజకీయ భవిష్యత్ ఏంటన్న దానిపై కూడా ఆయన సమాచాలోచనలు జరుపుతున్నారని తెలిసింది. అరకు నియోజకవర్గం ట్రాక్ రికార్డు చూస్తే పార్టీ మారి పొలిటికల్ ఫ్యూచర్ ను తనకు తానే ఇబ్బందుల్లోకి నెట్టేసుకోవడం ఎందుకన్న ఊగిసలాటలో కూడా ఉన్నారు.... అరకు నియోజకవర్గం ఏర్పాటయిన తర్వాత తొలిసారి 2009 లో మాత్రమే అక్కడ టీడీపీ గెలిచింది. ఎస్టీ నియోజకవర్గం కావడంతో అక్కడ 2009లో సివేరి సోమ గెలుపొందారు. తర్వాత 2014లో కిడారి సర్వేశ్వరరావు వైసీపీ నుంచి



విజయం సాధించారు. అయితే మావోయిస్టుల దాడిలో మరణించారు. తర్వాత ఆ కుటుంబం నుంచి ఎవరిని అరకు నియోజకవర్గ ప్రజలు ఆదరించలేదు. కిడారి శ్రావణకుమార్ ను మంత్రిని చేసి తర్వాత వారికి రాజకీయ జీవితం లేదు. కిడారి సర్వేశ్వరరావు కూడా వైసీపీ నుంచి టీడీపీలోకి మారారు. ఇప్పటి వరకూ ఆ కుటుంబం రాజకీయంగా ఎదగలేకపోయింది. 2019, 2024 ఎన్నికల్లోనూ వైసీపీ అక్కడ గెలిచింది. 2019లో చెట్టి ఫాల్గుణ, 2024లో రేగం మత్స్యలింగం వైసీపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు ఇప్పుడు వైసీపీ ప్రతిపక్షంలో ఉంటుంది. సహజంగా అధికార పార్టీపై వచ్చే ఎన్నికల్లో వ్యతిరేకత తప్పనిసరిగా ఉంటుంది. ఇప్పుడు పార్టీ మారి రాజకీయ భవిష్యత్ ను తనకు తానుగా సమాధి చేసుకోవడం ఎందుకన్న ఆలోచనలో ఆయన ఉన్నట్లు కనపడుతుంది. అయితే వైసీపీ పిలుపు నిచ్చిన కార్యక్రమాలకు దూరంగా ఉండటం మాత్రం చర్చనీయాంశమైంది. అందుకే ఆయన పార్టీ మారతారన్న ప్రచారం జోరుగా సాగుతుంది. ఈ ప్రచారాన్ని కూడా ఆయన ఖండించకపోవడం మరింత ప్రచారానికి ఊతమిస్తుంది. గిరిజనుల్లో జనసేన నేత దూసుకు వెళుతుండటంతో తనకు ప్లస్ గా మారి వచ్చే ఎన్నికల్లో గెలుపు అవకాశాలుంటాయన్న అంచనాలు కూడా ఆయన వేసుకుంటున్నారు. అయితే ఇప్పటి వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం సన్నిహితులు చెబుతున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# వ్యూహం మారుస్తున్న చంద్రబాబు

**గుంటూరు, సెప్టెంబర్ 22:**శాసనమండలి సభ్యుల విషయంలో టీడీపీ ఇక ఎక్కువ కాలం వెయిట్ చేసే అవకాశం కనిపించడం లేదు. 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పది మందికి పైగానే వైసీపీ ఎమ్మెల్సీలు పార్టీకి రాజీనామా చేశారు. అయితే శాసనమండలి ఛైర్మన్ వారి రాజీనామాలను ఆమోదించలేదు. దీంతో శాసనమండలిలో కూటమి కంటే వైసీపీ బలం ఎక్కువగా ఉండటంతో వాయిస్ రెయిజ్ చేస్తుంది. శాసనమండలిని స్థంభింప చేస్తుంది. శాసనసభకు గైర్హాజరవుతున్న వైసీపీ ఎమ్మెల్యేలు, శాసనమండలి విషయానికి వచ్చే సరికి సభకు హాజరై అధికార పార్టీని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రాజీనామాలు ఆమోదం పొందితే తిరిగి ఎన్నికయ్యేది కూటమి పార్టీలకు చెందిన వారే. దాదాపు పదిహేను నెలల పాటు శాసనమండలి ఛైర్మన్ ఎమ్మెల్సీల రాజీనామాలను ఆమోదిస్తారని కూటమి పార్టీలు భావించాయి. కానీ ఛైర్మన్ నిర్ణయం కావడంతో రాజీనామాలపై ఏం చేయలేని పరిస్థితి. ఇప్పటికి మండలిలో వైసీపీకి సభ్యుల బలం ఎక్కువగా ఉంది. బిల్లుల విషయంలో ఇప్పటి వరకూ ఇబ్బందులు కలగకపోయినా.. వాదనలు, విమర్శల విషయంలో వారిదే పై చేయి అవుతుంది. మండలి సమావేశాలు వాయిదా పడుతున్నాయి. దీంతో కూటమి పార్టీలు ఇక లాభం లేదని ఒక నిర్ణయానికి వచ్చినట్లు కనపడుతుంది. అందుకే పార్టీ మారిన ఎమ్మెల్సీలను అధికారికంగా తమ పార్టీలో చేర్చుకుని మండలిలో కొంత బలం పెంచుకునే ప్రయత్నం మొదలు పెట్టింది.. పోతుల



సునీత, జకియా ఖానమ్ లు బీజేలో చేరారు. తాజాగా మర్రి రాజశేఖర్, కర్రి పద్మశ్రీ, కల్యాణ చక్రవర్తి టీడీపీలో అధికారికంగా చేరారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు స్వయంగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు నేటి నుంచి సభలో టీడీపీ సభ్యులుగానే తమ గళం విప్పనున్నారు. అప్పుడు ఇరుకున పడేది వైసీపీ మాత్రమే. ఇదే వ్యూహాన్ని మిగిలిన రాజీనామాలు చేసిన ఎమ్మెల్సీల విషయంలోనూ అనుసరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఐదుగురు ఎమ్మెల్సీలు కూటమి పార్టీల కండువాలు అధికారికంగా కప్పుకోవడంతో మిగిలిన వారు కూడా త్వరలోనే టీడీపీ, జనసేన, బీజేపీలలో అఫిషియల్ గా చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. మండలి ఛైర్మన్ రాజీనామాలు ఆమోదించకపోవడంతో చంద్రబాబు వ్యూహం మార్చి ఇలా తన బలం పెంచుకుంటున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# సీబీఐకి ఫోన్ ట్యాపింగ్ కేసు..



**హైదరాబాద్ సెప్టెంబర్ 22:**తెలంగాణ రాజకీయాల్లో ఏం జరగబోతోంది? ఫోన్ ట్యాపింగ్ కేసు ఎంతవరకు వచ్చింది? మూడు అడుగులు ముందుకు నాలుగు అడుగులు వెనక్కి అన్నచందంగా మారిందా? ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చెయ్యబోతోంది? ఈ కేసును సీబీఐకి ఇవ్వనుందా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. తెలంగాణ నుంచి సీబీఐకి మరో కేసు బదిలీ కానుందా? ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించే యోచనలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కేసుపై ఇప్పటికే విచారణ చేపట్టి కీలక ఆధారాలు సేకరించింది సిట్. సీబీఐ రంగంలోకి దిగితే వేగంగా దర్యాప్తు జరగడం ఖాయమని అధికారులు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిట్ విచారణ చేయడంతో అధికారులు సహకరించలేదని, అదే సీబీఐ అయితే కచ్చితంగా ఈ కేసు కొలిక్కి వస్తుందని అంటున్నారు. దీనిపై ఈ వారం లేకుంటే వచ్చేవారంలో ప్రభుత్వ నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అదే జరిగితే అప్పటి ప్రభుత్వ పెద్దలకు కష్టాలు తప్పవని అంటున్నారు. ఇందుకు కారణాలు లేకపోలేదు. ఈ వ్యవహారంలో జడ్జిలు, రాజకీయ నేతలు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తల ఫోన్లు ట్యాప్ అయ్యాయి. చాలామంది సిట్ ముందుకు వచ్చి చెప్పాల్సినవన్నీ చెప్పారు. ఇప్పుడు ఏం చేసినా రాష్ట్ర ప్రభుత్వం కావాలని చేస్తోందని బీఆర్ఎస్ నేతలు ఓపెన్ గా చెబుతున్నారు. అదే సీబీఐకి అప్పగిస్తే ఏ సమస్యా ఉందని కొందరు అధికారుల మాట.. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కాళేశ్వరం మాదిరిగానే ఫోన్ ట్యాపింగ్ కేసుని సీబీఐకి అప్పగించవచ్చని అంటున్నారు. అదే జరిగితే తెలంగాణ రాజకీయాల్లో పెను ప్రకంపనలు చోటు చేసుకోవడం ఖాయం. ఫోన్ ట్యాపింగ్ కేసు సీబీఐకి ఇస్తారనే విషయం తెలియగానే బీఆర్ఎస్ నేతలు అలర్ట్ అయ్యారు. దీనిపై నేతలు అంతర్గతంగా చర్చించుకోవడం మొదలైంది. ఈ కేసులో సీబీఐ దిగితే పార్టీ పనైపోయినట్టేనని అంటున్నారు. రానున్నరోజుల్లో ఫోన్ ట్యాపింగ్ కేసుపై ప్రభుత్వం ఎలా అడుగులు వేస్తుందో చూడాలి. తెలంగాణ రాష్ట్రం నుంచి సీబీఐకి మరో కేసు! ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించే యోచనలో తెలంగాణ ప్రభుత్వం. ఈ కేసుపై ఇప్పటికే విచారణ చేపట్టి కీలక ఆధారాలు సేకరించిన సిట్. కేసుకు సంబంధించి పలువురిని విచారించిన సిట్. ఇప్పటికే కాళేశ్వరం కేసుని సీబీఐకి ప్రభుత్వం అప్పగించింది.

### ఈ సారి నవరాత్రి
# మరింత స్పెషల్: మోదీ



భారత ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలకు నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన ఎక్స్ ఖాతాలో 'ఈసారి ఈ పవిత్రమైన నవరాత్రి సందర్భం చాలా ప్రత్యేకమైనది. ఇక నుంచి దేశంలో కొత్త చరిత్ర మొదలు కాబోతుంది. జీఎస్టీ సంస్కరణలో పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగకరంగా ఉండబోతుంది. మోడీ చెప్పారు. రాష్ట్రాలన్ని అభివృద్ధిలో దూసుకుపోతాయి' అంటూ ట్వీట్ చేశారు.

### ఇటలీ పారిశ్రామిక వేత్తలతో
# మంత్రి శ్రీధర్ బాబు భేటీ



**హైదరాబాద్:**సచివాలయంలో ఇటలీ పారిశ్రామికవేత్తలతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ అయ్యారు. దేశంలోనే అతిపెద్ద ఏరోస్పేస్ డిఫెన్స్ హబ్గా తెలంగాణ దూసుకెళ్తుందని మంత్రి వివరించారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో తెలంగాణకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. పెట్టుబడులకు తెలంగాణలో విస్తారమైన అవకాశాలు ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. కాంపోనెంట్ తయారీ, సప్లై చైన్లో పెట్టుబడులకు ఆహ్వానం మెయింటెనెన్స్, రిపేర్ ఓవర్హాల్(ఎంఆర్వో)లో అవకాశాలు ఉన్నాయని అన్నారు.అవియానిక్స్, రాడార్, సెన్సార్ సిస్టమ్స్లో పెట్టుబడులకు పిలుపునిచ్చారు.న్యూ-స్పేస్, చిన్న ఉపగ్రహాల రంగంలో పెట్టుబడులకు తెలంగాణ సిద్ధంగా ఉంది. అధునాతన పదార్థాలు, కంపోజిట్స్ తయారీలో కూడా పెట్టుబడులకు ఆహ్వానం పలికారు.

# నళిని కి మద్దతుగా నిలిచిన బిజెపి బృందం

**ఇప్పటికైనా ఆమె రిటైర్మెంట్ ప్రయోజనాలను విడుదల చేయాలి**

**ఆమెను మానసిక వేదన నుండి బయటకు తీసుకోవాలని డిమాండ్**

**భువనగిరి నళిని స్వగృహానికి వెళ్లి పరామర్శించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు బృందం**



**హైదరాబాద్ సెప్టెంబర్ 22:**బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మాజీ డీఎస్పీ నళినిని ఆమె స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా నళిని గారి ఆరోగ్య పరిస్థితి, ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి , మాజీ ఎంపీ, బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బూర నర్సయ్య గౌడ్ , సీనియర్ నాయకులు గూడూరు నారాయణ రెడ్డి , జిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ , ఇతర సీనియర్ నాయకులు ఉన్నారు.ఈ సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మీడియాతో మాట్లాడుతూనళిని తెలంగాణ ఉద్యమ సమయంలో పోలీస్ ఫోర్స్లో ఉన్నప్పటికీ జై తెలంగాణ నినాదంతో ఉద్యమానికి మద్దతు ఇచ్చి రాజీనామా చేశారన్నరు.నళిని రాజీనామా తర్వాత డిపార్ట్మెంట్ సస్పెండ్ చేసింది, కానీ ఇప్పటివరకు రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయలేదు.గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నళిని గారిని ఇబ్బందులకు గురిచేసింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినప్పటికీ, బెనిఫిట్స్ ఇంకా రిలీజ్ చేయలేదు.నళిని గారు 16 పేజీలలో రిపోర్ట్ సబ్మిట్ చేసి పరిస్థితులను వివరించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఇతర కారణాలు చెబుతూ బెనిఫిట్స్ విడుదల చేయడం లేదు. ఫలితంగా నళిని గారు మానసిక వేదనకు గురయ్యారు. ఆరోగ్యం క్షీణించింది.ఇటువంటి పరిస్థితుల్లో నళిని కి మద్దతుగా నిలుస్తూ... బిజెపి బృందం ఆమెను పరామర్శించడం జరిగింది. నళిని గారు రిటైర్మెంట్ వేతనం, ఇతర అధికారిక ప్రయోజనాలను సమాజ సేవ కోసం వినియోగిస్తానని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా రిటైర్మెంట్ ప్రయోజనాలను విడుదల చేసి, ఆమెను మానసిక వేదన నుండి బయటకు తీసుకోవాలి.ఒకవేళ ప్రధాని నరేంద్ర మోదీ అపాయింట్మెంట్ కోరితే, ప్రోటోకాల్ నిబంధనల ప్రకారం కలిసేలా ప్రయత్నిస్తా నన్నారు.

# పామాయిల్ ఫ్యాక్టరీ రైతుల జీవితాలకు గేమ్ ఛేంజర్ : హరీశ్‌రావు



నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ మనకు ఎమోషన్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో హరీశ్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులోని పామాయిల్ ఫ్యాక్టరీలో ఉత్పత్తిని ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు వంటేరు యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్‌తో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ మనకు ఎమోషన్ అని.. ఈ ఫ్యాక్టరీ వేలాది మంది రైతుల జీవితాల్లో గుణాత్మక మార్పును తీసుకువస్తుందన్నారు. మనం చాలా ఫాక్టరీలు చూస్తుంటామని.. కానీ, ఇది భిన్నమైందన్నారు. ఈ ప్రాంత రైతుల నవశకానికి ఈ ఫ్యాక్టరీ నాంది అని తెలిపారు. గాలిలో తేమ ఎక్కువ ఉన్న చోటనే పామాయిల్ పండుతుందని.. కేసీఆర్ కృషితో రాష్ట్రమంతా పామాయిల్‌కు అనుకూలంగా మారిందన్నారు. ఒక్కసారి పంట వేస్తే 30 సంవత్సరాల వరకు రైతుకు ఆదాయం వస్తుందన్న ఆయన.. ఉద్యోగులకు నెల రోజుకు జీతం వస్తే.. పామాయిల్ రైతులకు 20 రోజులకే డబ్బులు చేతికి అందుతాయన్నారు.

**కేసీఆర్ ప్రభుత్వం ఏం చేయకుండానే ఇదంతా సాధ్యమా?**

పామాయిల్ ఫ్యాక్టరీ రైతుల జీవితాలకు గేమ్ ఛేంజర్‌లాంటిదని తెలిపారు. 2018లో తేమ తక్కుందని ఆయిల్ పామ్ సాగుకు ఐఐఓపీఆర్ అనుమతి ఇవ్వలేదని, కాళేశ్వరం నీటితో ఎండల్లోనూ చెరువులు, చెక్ డ్యాములు మత్తళ్లు దుంకినయ్ అని.. భూముల్లో తేమశాతం పెరగడంతో ఆయిల్ పామ్‌కు అనుమతులు ఇచ్చారని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఏం చేయకుండానే ఇదంతా సాధ్యమైందా? అని హరీశ్ ప్రశ్నించారు. ఇక్కడికి నీళ్లొచ్చినా.. ఆయిల్‌పామ్ సాగవుతున్నా అంతా కాళేశ్వరం పుణ్యమేనన్నారు. 2022 జూన్ 5న రామచంద్రాపూర్‌లోని మడుపు ఎల్లారెడ్డి పొలంలో మొదటి మొక్కతో నాంది పలికామని.. అందరినీ బ్రతిమాలి నాదే బాధ్యత అని భరోసా ఇస్తే పామాయిల్ సాగు చేశారని హరీశ్‌రావుకు గుర్తు చేశారు. చుట్టుపక్కల ఐదు జిల్లాల రైతులకు ఈ ఫ్యాక్టరీతో ప్రయోజనం ఉంటుందన్నారు. మొక్కలు నాటి ఆయిల్‌పామ్ సాగు చేసి ఫ్యాక్టరీ పెట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. అత్యాధునిక టెక్నాలజీతో ఈ ఫ్యాక్టరీని నిర్మించామన్నారు.

**కాంగ్రెసోళ్లు జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నరు..**

ఆ ఫ్యాక్టరీ ప్రారంభించేందుకు కాంగ్రెసోళ్లు జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నారని సెటైర్లు వేశారు. మన ప్రభుత్వం ఉంటే ఏడాది ముందే ఫ్యాక్టరీ ప్రారంభమయ్యేదన్నారు. వంద టన్నుల ఆయిల్ పామ్ గెలలకు 19 టన్నుల పామాయిల్ వస్తుందని హరీశ్‌రావు తెలిపారు. గోద్రెజ్, పతంజలి సహా అనేక కంపెనీల ప్రతినిధులు ఈ ఫ్యాక్టరీని చూసిపోతున్నారన్నారు. రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ పెట్టాలన్నది కేసీఆర్ సంకల్పమని.. రైతును రాజును చేసే పంట ఆయిల్ పామ్ సాగు అని తెలిపారు. ఎకరానికి లక్షన్నర రూపాయలు వచ్చే బంగారం లాంటి పంట ఆయిల్ పామ్ అని.. ఇందులో ఇంతర పంటగా కోకో సాగు చేస్తే మరో లక్ష ఆదాయం వస్తుందన్నారు. ఈ పంటలతో ఎకరానికి ఏడాదికి రూ.2.50లక్షల ఆదాయం వస్తుందని వివరించారు.

# 15 వేల కోట్ల స్థలాలు రక్షించాం....


**హైదరాబాద్, సెప్టెంబర్ 22:**ఐటీ కారిడార్‌కు 10 కిలోమీటర్ల దూరంలో ఉండే గాజులరామారం ప్రాంతంలో ప్రభుత్వ భూములు భారీ స్థాయిలో ఆక్రమణలకు గురయ్యాయని హైడ్రా గుర్తించింది. మొత్తం 300 ఎకరాల ప్రభుత్వ భూములు ఉండగా..అందులో 100 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు హైడ్రా అధికారులు తెలిపారు. ఆ ఆక్రమించిన భూమిలో కొందరు 60 నుంచి 70 గజాలు, 80 గజాల పరిమాణంలో ఇళ్లు నిర్మించి, రూ.10 లక్షలకు విక్రయిస్తున్నట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. ఆదివారం ఉదయం నుంచి అక్రమ నిర్మాల తొలగింపు పనులు చేపట్టిన హైడ్రా అధికారులు నివాసాల జోలికి వెళ్లకుండా ఆక్రమణల తొలగిస్తున్నట్లు చెప్పారు.గాజుల రామారంలో అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా రంగంలోకి దిగింది. సర్వే నంబర్ 307లో అక్రమంగా నిర్మించిన ఇళ్లను కూల్చివేసింది. ఆక్రమణదారుల చేతుల్లో దాదాపు రూ.4,500 నుంచి 5000 కోట్ల విలువైన ప్రభుత్వ భూములు ఉన్నట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. రంగంలోకి దిగిన హైడ్రా సిబ్బంది, జీహెచ్ఎంసీ అధికారులు, పోలీసుల సహకారంతో గాజులరామారంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది. హైడ్రా అధికారుల చర్యలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. తాము లక్షల్లో డబ్బులు చెల్లించి ఇంటిని కొనుక్కున్నామని, అమ్మినవారిపై చర్యలు తీసుకోవడానికి బదులుగా తమ నివాసాలను కూల్చడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. హైడ్రా చర్యలను నిరసిస్తూ చిన్న పిల్లలతో కలిసి జేసీబీ వాహనాలకు అడ్డుగా నిలబడి వారిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం గాజులరామారంలో మొత్తం 300 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉండగా, ఇందులో 100 ఎకరాలు ఇప్పటికే ఆక్రమణకు గురైనట్లు హైడ్రా స్పష్టం చేసింది. వంద ఎకరాల్లో అక్రమ కట్టడాల కూల్చివేత అనంతరం మిగిలిన 200 ఎకరాల భూమిని సైతం కాపాడేందుకు హైడ్రా రూ.15 వేల కోట్ల విలువ గల 300 ఎకరాల భూమికి కంచె వేయాలని యోచిస్తోంది. గాజులరామారం, ఐటీ కారిడార్‌కు కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. గతంలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, **TGISC,** హెచ్ఎండీయే, హౌసింగ్ బోర్డు వంటి సంస్థలకు గత ప్రభుత్వాలు భూములు కేటాయించినా, వాటిని అభివృద్ధి చేయకపోవడంతో కొందరు కబ్జాదారులు గ్రూపులుగా ఏర్పడి ఆ భూములను ఆక్రమించారు. కొందరు నేరుగా ప్లాట్లు విక్రయించగా, కొందరు చిన్న ఇండ్లు కట్టి బడ్జెట్ ధరలలో అమ్మేస్తున్నారు. కేవలం 4 ఏళ్లలోనే 100 ఎకరాల భూమి కబ్జా కేవలం 3, 4 ఏళ్లలోనే 103 ఎకరాల భూమిని ఆక్రమించారని హైడ్రా అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో ఎకరా మార్కెట్ విలువ రూ.40 నుండి రూ.50 కోట్లు ఉంది. దాంతో ఆక్రమణలో ఉన్న భూముల విలువ రూ.4,500 నుంచి 5000 కోట్ల మధ్య ఉంటుందని తెలిపారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం, చింతల్ పరిసరాల్లో ఉండే వారిని తక్కువ ధర అని ఆకర్షించి సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి అమ్ముతున్నారు. తమకు రెవెన్యూ, విద్యుత్ శాఖలకు చెందిన అధికారుల నుంచి పర్మిషన్ వచ్చిందని, బిల్లులు ఉన్నాయని బాధితులు చెబుతున్నారు. తక్కువ ధరలకే ఇంటిని సొంతం చేసుకోవాలని కొంతమంది అప్పులు చేసి మరీ ఇళ్లు కొనుగోలు చేస్తున్నారు.

### పైలెట్లను నిందించడం
# బాధ్యతా రాహిత్యం : సుప్రీంకోర్టు



అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఏఏఐబీ ప్రాథమిక నివేదిక ఆధారంగా పైలట్లను నిందించడం బాధ్యతా రాహిత్యం, దురదృష్టకరమని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. విమాన ప్రమాదంపై స్వతంత్ర, కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు కోరుతూ సేఫ్టీ మ్యాటర్స్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా జూలై 12న విడుదలైన ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదికలోని కొన్ని అంశాలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది.స్వచ్ఛంద సంస్థ తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై ఏఏఐబీ ప్రాథమిక నివేదిక విడుదల చేసిందని.. ఇందులో పైలట్ల తప్పిదం వల్లే ప్రమాదం జరిగిందని ఏఏఐబీ స్పష్టం చేసిందని ఆయన కోర్టు దృష్టికి తీసుకువచ్చారన్నారు. అయితే, నివేదికలోని పలు అంశాలపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. విమానం ఫ్లైట్ డేటా రికార్డర్ నుంచి సమాచారాన్ని విడుదల చేయాలని, ఇది ప్రమాదానికి కారణాన్ని గుర్తించడంలో సహాయపడుతుందన్నారు. అయితే, ప్రాథమిక విచారణ ఆధారంగా పైలట్లను నిందించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. పైలట్లలో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారని సూచించే మీడియా నివేదికలు అత్యంత బాధ్యతారహితమైనవి ధర్మాసనం పేర్కొంది. నివేదిక ఆధారంగా పైలట్లను నిందిస్తే.. తుది విచారణలో వారి తప్పు లేదని తేలితే ఏం చేస్తారని అంటూ కోర్టు ప్రశ్నించింది. ఈ విషయంపై స్వతంత్ర, నిష్పాక్షికమైన, వేగవంతమైన దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కోర్టు కేంద్రానికి, పౌర విమానయాన డైరెక్టర్ జనరల్‌కు నోటీసు జారీ చేసింది. ఈ అంశం గోప్యత, గౌరవానికి సంబంధించినదని సుప్రీంకోర్టు పేర్కొంది. ప్రత్యర్థి విమానయాన సంస్థలు కొంత సమాచారాన్ని విడుదల చేయడం వల్ల దుర్వినియోగం జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తూ.. ప్రమాదంపై స్వేచ్ఛగా, న్యాయంగా, నిష్పాక్షికంగా, త్వరితగతిన దర్యాప్తు జరపడం అనే పరిమిత అంశంపై మాత్రమే నోటీసు జారీ చేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది.

### రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం
# వేగవంతం చేయాలి



**: సీఎం రేవంత్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇవాళ(సోమవారం) మాట్లాడారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర, దక్షిణ భాగాలతో పాటు రేడియల్ రోడ్ల నిర్మాణంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇందుకు అవసరమైన పెండింగ్ భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ నుంచి బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం అంశంపై సమీక్షలో చర్చించారు ముఖ్యమంత్రి. వీలైనంత త్వరగా రూట్ మ్యాప్‌పై తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్- శ్రీశైలం హైవేలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రప్రభుత్వం నుంచి వీలైనంత త్వరగా అనుమతులు తీసుకోవాలని మార్గనిర్దేశం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని దిశానిర్దేశం చేశారు. అక్టోబరు నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కోర్టు పరిధిలో ఉన్న భూ సమస్యల వివరాలను ఉన్నతాధికారులకు అందించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

వార్తాతరంగాలు

మంగళవారం 23 సెప్టెంబర్ 2025

# మున్నూరు కాపులు ఐక్యంగా ముందుకు సాగాలి

**గంగుల కమలకర్ మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు**



**కరీంనగర్:**తెలంగాణలో మున్నూరు కాపులు ఐక్యంగా ముందుకు సాగి గ్రామ స్థాయి నుండి మున్నూరు కాపులను సంఘటితం చేసి ఏకతాటిపై నడిపించేందుకు కృషి చేయాలని మాజీ మంత్రివర్యులు స్థానిక శాసనసభ్యులు గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం కరీంనగర్ లోని క్యాంపు కార్యాలయంలో మున్నూరు కాపు సంఘ%శీ% తెలంగాణ రాష్ట సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గంగుల కమలాకర్ సభ్యత్వం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక శాసనసభ్యులు గంగుల కమలకర్ మాట్లాడుతూ తెలంగాణలో మున్నూరు కాపు లు ఐక్యంగా ముందుకు సాగి రాజకీయాలకతీతంగా సదస్సులు సమావేశాలు నిర్వహించి మున్నూరు కాపులను చైతన్య పరచాలని అన్నారు. మారుమూల గ్రామంలో కూడా మున్నూరు కాపు సంఘాలను ఏర్పాటు చేసి మున్నూరు కాపు కులాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుక వెళ్లే దిశగా ముందుకు సాగ లన్నారు. మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరి శంకర్ మాట్లాడుతూ మున్నూరు కాపుల అందరిని సంఘటిత పరిచే ఒక తాటిపైకి తీసుకువెళ్లేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని మున్నూరు కాపు లందరు సభ్యత్వ నమోదును వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రంలోనే కరీంనగర్ జిల్లా మున్నూరు కాపు సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కనకం అమర్ బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బొల్లం లింగమూర్తి, రాష్ట్ర కార్యదర్శి మరియు కరీంనగర్ అసెంబ్లీ మెంబర్షిప్ ఇంచార్జి పూదరి తిరుపతి, సంయుక్త కార్యదర్శి వాసాల హరీష్, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి సత్తినేని శ్రీనివాస్, మీడి దొడ్డి నవీన్ కుల బాంధవులు పాల్గొన్నారు.

# హాట్ టాపిక్ గా కవిత వ్యాఖ్యలు

**హైదరాబాద్ సెప్టెంబర్ 22:**తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు.. మళ్లీ హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్ రావు గురించి ఆమె చేసిన ఆరోపణలు, అలాగే తన భవిష్యత్ రాజకీయ ప్రణాళికలపై వెల్లడించిన అంశాలు చర్చనీయాంశమయ్యాయి. హరీష్ రావుపై ఆరోపణలు. శనివారం మీడియాతో మాట్లాడిన కవిత, హరీష్ రావుపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు భారీ అవినీతి చోటుచేసుకుందని ఆమె నేరుగా ఆరోపించారు. ఇదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు విషయాన్ని ప్రస్తావిస్తూ.. 2016లోనే నేను కేటీఆర్‌ను ఈ విషయంలో అలర్ట్ చేశాను, అని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తాను అప్పుడే సమస్యలను చూపించినా, నిర్ణయాలు మాత్రం పూర్తిగా కేసీఆర్ పరిధిలోనే జరిగాయని అన్నారు. ప్రతి నిర్ణయం కేసీఆర్ దేనని హరీష్ రావు పీసీ ఘోష్ కమిషన్‌కు చెప్పారనే విషయాన్ని కూడా గుర్తుచేశారు. హరీష్ రావుపై వ్యక్తిగతంగా తనకు ఎలాంటి విభేదాలు లేవని. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తప్ప మరే విషయంలోనూ నాకు ఆయనపై కోపం లేదు అని చెప్పి, తన విమర్శలు పూర్తిగా పరిపాలనా విధానాలకే సంబంధించినవని వివరించారు. కొత్త పార్టీపై కవిత వ్యాఖ్యలు. ఇటీవలి కాలంలో కవిత కొత్త పార్టీ స్థాపనపై చర్చలు ఎక్కువయ్యాయి. దీనిపై ఆమె క్లారిటీ ఇస్తూ కొత్త పార్టీ పెట్టాలా లేదా అనే అంశంపై నేను ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు అని



చెప్పారు. రాజకీయంగా తన తదుపరి అడుగులపై అన్ని వర్గాల వారితో చర్చలు జరుపుతున్నానని వివరించారు. ఒక వర్గం కోసం కాదు.. ప్రజలందరి కోసం పని చేయాలనుకుంటున్నాను.. బీసీ సమస్య నా మనసుకు దగ్గరైంది.. ప్రస్తుతం ఫ్రీ బర్డ్?ని.. నా ద్వారాలు తెరిచే ఉన్నాయి.. చాలా మంది వచ్చి నన్ను కలుస్తున్నారు.. నాతో టచ్?లో ఉన్న బీఆర్ఎస్ నేతల లిస్ట్ చాలా పెద్దిది అని అన్నారు. ఈ సందర్భంగా ఆమె తన తండ్రి కేసీఆర్ విధానాన్ని గుర్తు చేశారు. పార్టీ పెట్టేముందు కేసీఆర్ వందల మందితో చర్చలు జరిపారు. ప్రస్తుతం నేనూ అదే చేస్తున్నాను అని చెప్పారు. అంటే త్వరితగతిన నిర్ణయం తీసుకోవడం కంటే, పరిస్థితులను సమీక్షించి తర్వాతే నిర్ణయం తీసుకుంటానని ఆమె అర్థం చేశారు. కాంగ్రెస్‌లో చేరే ఆలోచనలేదని స్పష్టం. కవిత మరోసారి కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాన్ని పూర్తిగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీలో చేరే ఆలోచన నాకు అస్సలు లేదు. కాంగ్రెస్ పెద్దలు ఎవరూ నాకు ఫోన్ చేయలేదు. నేనూ కాంగ్రెస్‌లో ఎవరినీ అప్రోచ్ కాలేదు అని ఆమె స్పష్టంగా చెప్పారు. సస్పెన్షన్ అంశంపై వ్యాఖ్య. తండ్రి పార్టీ నుండి సస్పెండ్ అయిన తన పరిస్థితిని గుర్తుచేసుకుంటూ, తండ్రి పార్టీ నుంచి సస్పెండ్ అయిన మొదటి కూతుర్ని నేనే అని అన్నారు. ఈ వ్యాఖ్య ద్వారా కుటుంబ రాజకీయ పరిణామాల్లో తనకు ఎదురైన కష్టాలను గుర్తు చేస్తూనే, ఆ అనుభవం తనను మరింత బలపరిచిందని సూచించారు. రాజకీయ పరిశీలన. కవిత తాజా వ్యాఖ్యలు రాజకీయ రంగంలో.. అనేక ప్రశ్నలను తెచ్చాయి. హరీష్ రావుపై అవినీతి ఆరోపణలు చేయడం ఒకవైపు బీఆర్ఎస్‌లో ఉన్న పాత విభేదాలను మళ్లీ తెరమీదకు తెచ్చింది. మరోవైపు కొత్త పార్టీ అంశంపై స్పష్టత ఇవ్వకుండా ఉంచడం, ప్రజలతో, మీడియాతో చర్చల్లో తన ప్రాధాన్యతను నిలుపుకోవడానికి ఒక వ్యూహంగా కనిపిస్తోంది. మొత్తానికి, కవిత వ్యాఖ్యలు ఒక వైపు బీఆర్ఎస్‌లోని అంతర్గత రాజకీయాలను కదిలిస్తే, మరోవైపు తెలంగాణ రాజకీయాల్లో తన స్వంత స్థానం ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తున్న సంకేతాలుగా విశ్లేషకులు చెబుతున్నారు. వచ్చే నెలల్లో ఆమె తీసుకునే నిర్ణయాలు రాజకీయ సమీకరణాలను గణనీయంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది.

# ఓటుకు నోటు కేసు.. సుప్రీంలో వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వ్

**హైదరాబాద్/న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:** ఓటుకు నోటు కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. ఈకేసుకు సంబంధించి సుప్రీంలో వాదనలు జరుగగా తీర్పును న్యాయస్థానం రిజర్వ్ చేసింది. ఓటుకు నోటు వ్యవహారంలో జెరూసలెం మత్తయ్యపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను హైకోర్టు కొట్టివేయడంపై సుప్రీం ధర్మాసనంలో రాష్ట్ర ప్రభుత్వం సవాల్ చేసింది. దీనిపై ఈరోజు (సోమవారం) వాదనలు జరుగగా.. తీర్పును సుప్రీం రిజర్వ్ చేసింది. ఛార్జిషీట్‌లో, ఎఫ్ఐఆర్‌లో ఏ4గా ఉన్న నిందితుడిపై ఎలాంటి చర్యలు వద్దని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది మేనకా గురుస్వామి కోర్టుకు తెలిపారు. హైకోర్టే ట్రయల్ నిర్వహించి తీర్పు ఇచ్చేసిందని ప్రభుత్వం పేర్కొంది. కేసు ప్రాథమిక దశలోనే... నిందితుడిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ని కొట్టివేసిందని



ప్రభుత్వం తరపు న్యాయవాది వాదించారు. మొత్తం కేసులో కీలక నిందితుడిగా ఉన్న వ్యక్తిపై ఎఫ్ఐఆర్ కొట్టివేయడం దర్యాప్తుపై ప్రభావం చూపుతోంది కాబట్టి... దర్యాప్తు కొనసాగించేందుకు అవకాశం ఇవ్వాలని కోర్టును సర్కార్ కోరింది. అయితే ఈ కేసులో హైకోర్టు అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే ఆదేశాలు ఇచ్చిందని మత్తయ్య తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. ఇరువురి వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పును వాయిదా వేసింది. విచారణ సందర్భంగా సీజేఐ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో సీఎం ఉన్నా... నిందితుడిపై నమోదైన ఎఫ్ఐఆర్ కొట్టివేయడాన్ని సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇక్కడికి రావడాన్ని అభినందిచాలని సీజేఐ వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది మేనకా గురుస్వామి 'అది రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత' అని పేర్కొన్నారు.

# గాజులరామారంలో హైడ్రా కూల్చివేతలపై కేటీఆర్ ఫైర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 22:** పేదల ఇళ్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం నాడే ఎందుకు కూల్చివేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ కార్యకర్తలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో హైకోర్టు సెలవు దినాల్లో కూల్చివేతలు చేయవద్దని స్పష్టంగా చెప్పిందని గుర్తుచేశారు. అయినప్పటికీ గాజులరామారంలో కోర్టు సెలవు రోజు చూసుకొని మరీ పేదల ఇళ్లను కూల్చివేశారని ఫైర్ అయ్యారు. గాజులరామారంలో ఇళ్లు కూల్చివేశారని... రేపు జూబ్లీహిల్స్‌లోని బోరబండ బస్తీకీ రేవంత్ రెడ్డి హైడ్రాతో వస్తారన్నారు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే, మన ఇళ్లు కూలగొట్టమని కాంగ్రెస్ బుల్డోజర్ రాజ్యానికి లైసెన్స్ ఇచ్చినట్లే అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త సర్దార్ ఇంటిని కూల్చివేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ కూలగొట్టిన ఆ ఇంటిని మళ్లీ కట్టించి ఇచ్చే బాధ్యత తనది అంటూ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ సినిమా అయిపోయిందని.. రెండు సంవత్సరాల్లో చేసిందేమీ లేదని విమర్శించారు. హైడ్రా బుల్డోజర్ పేదల ఇళ్లపైకే వెళ్తుందని.. పెద్దల ఇళ్లకు వెళ్లదంటూ మండిపడ్డారు. ముఖ్యమంత్రి సోదరుడితోపాటు మంత్రులు పొంగులేటి, వివేక్ వంటి వారు ప్రభుత్వ స్థలాల్లో, చెరువులపై ఇళ్లు కట్టినా వాటిని కూల్చివేయలేదంటూ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# వారి జోలికొస్తే మాడి మసైపోతావ్..

**రేవంత్ ప్రభత్వానికి ఈటల రాజేందర్ మాస్ వార్నింగ్**

**మేడ్చల్ , సెప్టెంబర్ 22 :** హైడ్రా అధికారులకు దమ్ముంటే ప్రభుత్వ స్థలంలో బిల్డర్లు, నాయకుల ఆక్రమణలు తొలగించాలని మల్కాజిగిరి బీజేపీ పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. హైడ్రా అధికారులు పేదల ఇల్లు కూలగొట్టి వారి జీవితాలతో చెలగాటమాడవద్దని హితవు పలికారు. కూడు, గూడు గుడ్డ ఇవ్వాలని రాజ్యాంగం చెప్పిందని.. కానీ సీఎం రేవంత్ రెడ్డి పేదల జోలికి రావడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న డబుల్ బెడ్ రూం ఏమోకానీ.. 40 ఏళ్లుగా ఇక్కడే బతుకుతున్న పేదల ఇళ్లు కూల్చారని ధ్వజమెత్తారు ఎంపీ ఈటల రాజేందర్.కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారంలోని ఐదు బస్తీల్లో ఉన్న పేదల ఇళ్లను కూలగొట్టింది హైడ్రా. కూలిన ఇళ్లను పరిశీలించి బాధితులను ఇవాళ(సోమవారం) పరామర్శించారు. బస్తీలన్నీ కలియ తిరిగి బాధితులతో మాట్లాడి ధైర్య చెప్పారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే బాధితులకు కరెంటు నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు. 300 ఎకరాల ప్రభుత్వ భూమిలో తాతలు తండ్రులు ఇప్పుడు పిల్లలు ఉంటున్నారని చెప్పుకొచ్చారు. గుట్టలు, పుట్టలు ఉండి మనిషి ఉండే దిక్కులేనప్పుడు రూ. 5 వేలకు ఎకరం ఉన్న దగ్గరి నుంచి వీరు ఇక్కడ ఉంటున్నారని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా కంకర మిషన్ ఫ్యాక్టరీల్లో పనిచేయడానికి వడ్డెరలు వచ్చారని చెప్పుకొచ్చారు ఎంపీ ఈటల రాజేందర్.కంకర మిషన్ ఫ్యాక్టరీల్లో పనిచేసి కాళ్లు, చేతులు పొగొట్టుకొని మరీ పేదలు ఇక్కడ బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 60 గజాల గుడిసెల్లో ఉండే వారి మీదనా హైడ్రా ప్రతాపమని హెచ్చరించారు. దేశం ఇంకో దేశం మీద దాడి చేసినట్లుగా.. దొంగ దెబ్బ తీసినట్లు.. పదుల సంఖ్యలో జేసీబీలు పెట్టి ఆదివారం వచ్చి పేదల ఇళ్లను కూలగొట్టారని ఫైర్ అయ్యారు. ఇళ్లను కూలగొట్టడంతో రాత్రి అంత ఆ పిల్లలతో వర్షంలోనే తడుస్తూ ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు స్తంభాలు కూలగొట్టి కరెంటు లేకుండా, తాగడానికి నీళ్లు లేకుండా చేశారని మండిపడ్డారు. ఇక్కడి పేదల దీనాస్థితి చూసైనా కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించాలని హితవు పలికారు. బ్రోకర్లను ఉరి తీయండి, అరెస్ట్ చేయండి కానీ 40 ఏళ్ల నుంచి ఇక్కడ ఉంటున్న పేదల ఇళ్లను కూలగొట్టి ఆడబిడ్డలకు బతుకమ్మ సంబరాలు లేకుండా చేసి వారి కన్నీటిని చూశారని ధ్వజమెత్తారు ఎంపీ ఈటల రాజేందర్.రూ. 15 వేల కోట్ల స్థలాలు కాపాడామని హైడ్రా అధికారులు అంటున్నారని.. కానీ ఇక్కడ ఉంది 300 గుడిసెలు, పేదల ఇళ్లని చెప్పుకొచ్చారు. పేదల ఇళ్లని కూలగొట్టి రూ.15 వేల కోట్లు కాపాడామని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడానికి సిగ్గు ఉందా అని



ఫైర్ అయ్యారు. ఇప్పటికైనా బస్తీ వాళ్లతో ప్రభుత్వం మాట్లాడాలని సూచించారు. నరసింహ బస్తీ, బాలయ్య బస్తీ, గాలిపోచమ్మ బస్తీలో ఉన్నవారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పిల్లల పుస్తకాలు, ఇంట్లో సామాన్లను సైతం తొక్కించారని.. కన్నీరు మున్నీరవుతున్నాహైడ్రా అధికారులు కనీసం కనికరించలేదని మండిపడ్డారు. నిజాంలు, రాజుల కూడా ఇంత మూర?ంగా హైడ్రా అధికారుల మాదిరిగా ప్రవర్తించలేదని ఫైర్ అయ్యారు ఎంపీ ఈటల రాజేందర్. శంకర్ హిల్స్ లాంటివి, వంద కోట్ల ఎకరాల ఉన్న భూములను కబ్జా చేస్తే హైడ్రా అధికారులు ఎందుకు పట్టించుకోరని ప్రశ్నల వర్షం కురిపించారు. నోరు లేని వారిని, దిక్కు లేని వారిని, పేదరికంలో మగ్గుతున్న వారికి కన్నీళ్లు పెట్టిస్తే హైడ్రా అధికారులకు మంచి జరగదని హితవు పలికారు. గాజులరామారంలోని పేదలు పరాయి వారు కాదని... పాకిస్తాన్ బంగ్లాదేశ్ వాళ్లా.. ? భారత మాత బిడ్డలు కాదా..? అని నిలదీశారు. రేవంత్ ఇప్పటికైనా పేదల ఇళ్లను కూలగొట్టడం ఆపాలని సూచించారు ఎంపీ ఈటల రాజేందర్. బ్రోకర్ల ఉంటే అరెస్ట్ చేయండి.. డబ్బులు రికవరీ చేయండి... కానీ పెదల జీవితాలతో ఆడుకోవద్దని చెప్పుకొచ్చారు. పేదల మీద కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతాపం చూపొద్దని కోరారు. ఇందిరమ్మ రాజ్యాం అంటే పేదల జోలికెళ్లడమేనా అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్నా రూ.2500, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదు కానీ పేదల గూడును మాత్రం చెదరగొడుతున్నారని మండిపడ్డారు. పేదల జోలికి వస్తే మాడి మసి అవుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరి మీద కోపంతోనో పేదల ఇళ్లను కూల్చవద్దని హితవు పలికారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే కూలగొట్టిన వారికి ఇళ్లు కట్టించి ఇవ్వాలని ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

# హెచ్1బి వీసా ఫీజు ఎఫెక్ట్.. ఐటీ షేర్లపై అమ్మకాల ఒత్తిడి.. నష్టాల్లో స్టాక్ మార్కెట్‌లు




**న్యూ డిల్లీ సెప్టెంబర్ 22:**నూతన హెచ్1బీ వీసా దరఖాస్తులపై లక్ష డాలర్ల (సుమారు రూ.88 లక్షలు) ను ఐటీ కంపెనీలు చెల్లించాలని అమెరికా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో.. ఐటీ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి.ఇవాళ (సోమవారం) మధ్యాహ్నం 12.25 గంటల సమయంలో సెన్సెక్స్ 184 పాయింట్ల నష్టంతో 82,441 వద్ద.. నిఫ్టీ 31 పాయింట్లు క్షీణించి 25,295 వద్ద ట్రేడవుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ కూడా కాస్తపడిపోయి 88.20కి చేరింది. ఇక నిఫ్టీ సూచీలో హీరో మోటోకార్ప్ లిమిటెడ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ట్రెంట్, ఆసియన్ పెయింట్స్, టాటా మోటార్స్ షేర్లు లాభాల్లో ఉన్నాయి.టెక్ మహీంద్రా, టీసీఎస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, అపోలో హాస్పిటల్స్, లార్సెన్ స్టాక్స్ నష్టాల్లో కొనసాగుతున్నాయి. టెక్ మహీంద్రా షేర్లు ఆరు శాతం పడిపోగా.. ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు కూడా అదే బాటలో ఉన్నాయి. హెచ్1బీ వీసా కొత్త నిబంధన భారతదేశపు ఐటీ రంగాన్ని కలవరపెడుతున్నది.

# విద్యార్థుల ర్యాగింగ్ ఒక విద్యార్థి ఆత్మహత్య



**మేడ్చల్:**మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ లో ర్యాగింగ్ భూతానికి ఇంజనీరింగ్ విద్యార్థి జాదవ్ సాయి తేజ బలి అయ్యాడు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ కు చెందిన సాయి తేజ పోచారం మున్సిపాలిటీ పరిధి లో ఉన్నా సిద్దార్థ ఇంజనీరింగ్ కాలేజీ లో మొదటి సంవత్సరం చదువుతున్నడు కాలేజీ లో సీనియర్స్ ఆయన తో గొడవ పడి కొట్టారు. స్థానిక యువకులతో కలిసి మళ్ళీ కొట్టి, మీకు ఫైన్ వేయాలి అంటూ బార్ కు తీసుకొని వెళ్లి 15 వేలు బిల్ చేసి ఇంకా కావాలి అంటూ టార్చర్ పెట్టారు. మేము పేద వాళ్ళం మా దగ్గర డబ్బులు లేవన్న వినకుండా టార్చర్ చేసారని ఆరోపణ. దాంతో సాయి హాస్టల్ కు వచ్చి వాళ్ల నాన్న కు వీడియో పంపి ఉరి వేసుకొని చనిపోయాడు

# పెద్ద చెరువులో వ్యక్తి ఆత్మహత్య..

**సంగారెడ్డి:**అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోనీ పెద్ద చెరువులో నిన్న గల్లంతైన వ్యక్తి మృతి దేహం లభ్యం అయింది. చెప్పులు, మొబైల్ ఫోన్, తన ఆత్మహత్యకు కారణాలు లెటర్ వ్రాసి చెరువు మెట్ల పై వదిలిన వ్యక్తిఆత్మహత్య చేసుకున్నాడు. చెరువులో ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి హాఫీజ్ పేట్ – ఆదిత్యనగర్ కాలనీ కి చెందిన భశరతుల్లా ఖాన్ ( 28) గా పోలీసులు గుర్తించారు. తన భార్య (కలకత్తా కు చెందిన మహిళా) పై అనుమానం తో పలు సార్లు గొడవ పడినట్లు మాధాపూర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యాయి. భార్య, భర్తల మధ్య కొన్ని రోజులుగా గొడవలతో భార్యను చితక బాదిన కేసు లో జైలు శిక్ష అనుభవించి భశరతుల్లా ఖాన్ విడుదల అయ్యాడు. మృతదేహం కోసం చెరువులో గాలిస్తుండగా ఈరోజు ఉదయం 9 గంటలకు మృతదేహం లభ్యమైనది.మృతి దేహాన్ని ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందాలు వెలికి తీశారు.అమీన్ పూర్ ఎస్ఐ దుర్గయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

**కూల్చివేతలకు అడ్డుపడతా:ఎమ్మెల్సీ కవిత**



**కుత్బుల్లాపూర్:**గాజుల రామారం లో పేదల ఇల్లు కూల్చివేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనీ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆదివారం గాజులరామారంలో ఇండ్లు కోల్పోయిన బాధితులను కవిత పరామర్శించారు.తరువాత ఆమె మాట్లాడుతూ కోర్టు ఉత్తర్వులు అమలు చేయకుండా శని ఆది వారాల్లో కూల్చివేతలు ఏంటని ప్రశ్నించారు. పండగ పూట పేదల జీవితాల్లో చీకట్లు నింపడం ఈ ప్రభుత్వానికి అలవాటు అయింది. మీకు దమ్ముంటే అరికెపూడి గాంధీ కబ్జా చేసిన 12 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోండి. కనీసం వారికి ముందస్తు సూచనలు చేయకుండా,చిన్న పిల్లలని చూడకుండా బైటకు పంపి రూములు కూల్చడం హేయమైన చర్య. ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్న%ా%వారికి వసతి ఏర్పాటు చేసిన తర్వాత ఆక్రమణలు తొలగించాలని అన్నారు.ఆరో తారీకు అల్టిమేటం పెట్టారని స్థానికులు చెబుతున్నారు,వారిని రోడ్డున పడేసి కూల్చివేత పనులు చేస్తే ముందు జేసీబీ కి నేనే అడ్డం పడతా. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చాక పేదల రూములు స్వాదీనం చేసుకోవాలి. లేదంటే పేదల పక్షాన జాగృతి తరపున ఉద్యమిస్తాం.అని హెచ్చరించారు..

# సినిమా




## ‘ఓజీ’లో ఈ రెండు పాత్రలు హైలైట్ కానున్నాయా?

పవన్ కల్యాణ్ హీరోగా రూపొందిన ‘ఓజీ’

ఈ నెల 25వ తేదీన భారీ రిలీజ్

ఆసక్తిని రేకెత్తిస్తున్న అర్జున్ దాస్ - శ్రియా రెడ్డి రోల్స్

ఆడియన్స్ లో పెరుగుతున్న అంచనాలు




ఇప్పుడు అందరి దృష్టి పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటించిన ‘ఓజీ’పైనే ఉన్నాయి. డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమాకి సుజీత్ దర్శకత్వం వహించాడు. ప్రియాంక మోహన్ కథానాయికగా నటించిన ఈ సినిమా, ఈ నెల 25వ తేదీన థియేటర్లకు రానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్నా కొద్దీ ఈ సినిమాపై అంచనాలు పెరుగుతూ పోతున్నాయి. తన సినిమాలలో ‘ఖుషీ’ తరువాత అభిమానుల్లో ఆ స్థాయి ఉత్సాహాన్ని చూస్తున్నాని పవన్ కల్యాణ్ అనడం ఇప్పుడు ప్రాముఖ్యతను సంతరించుకుంది.

ఈ సినిమాలో కీలకమైన పాత్రలలో ప్రకాశ్ రాజ్ .. ఇమ్రాన్ హష్మీ .. అర్జున్ దాస్ .. శ్రియా రెడ్డి కనిపించనున్నారు. ఈ నాలుగు పాత్రలు ఈ సినిమాలో బలమైనవిగా కనిపించే అవకాశాలు ఉన్నాయి. అయితే అర్జున్ దాస్ .. శ్రియా రెడ్డి పాత్రలపై ఆడియన్స్ ఎక్కువ ఆసక్తిని కనబరుస్తూ ఉండటం విశేషం. అర్జున్ దాస్ బేస్ వాయిస్ కీ .. ఆయన యాక్టింగ్ కి తెలుగులో అభిమానులు ఉన్నారు. ఖైదీ .. బుట్టబొమ్మ వంటి సినిమాలు, తెలుగు ప్రేక్షకులకు ఆయనను మరింత చేరువ చేశాయి. అందువలన ఆయన పాత్ర చాలా డిఫరెంట్ గా ఉండొచ్చని అంతా భావిస్తున్నారు.



ఇక శ్రియా రెడ్డికి తెలుగు సినిమాలేం కొత్త కాదు. 2003లోనే తెలుగులో ఆమె ఎంట్రీ ఇచ్చింది. ఆ తరువాత కూడా కొన్ని తెలుగు సినిమాలు చేసింది. అయితే ఈ మధ్య కాలంలో ఆమె పవర్ ఫుల్ విలనిజాన్ని చూపించిన సినిమా ‘సలార్’ అనే చెప్పాలి. ఒక సినిమా కోసం ఆమెను తీసుకున్నారనగానే, ఆమె పాత్ర ఎలా ఉంటుందనేది ఆడియన్స్ గెస్ చేస్తారు. అందువలన అలాంటి ఒక టిపికల్ రోల్ ను ఆమె ‘ఓజీ’లో చేసి ఉంటుందనేది కుతూహలాన్ని రేకెత్తిస్తోంది. అటు అర్జున్ దాస్ .. ఇటు శ్రియా రెడ్డి ఈ సినిమాను ఏ స్థాయికి తీసుకుని వెళతారనేది చూడాలి.

## ప్రియాంక కెరియర్ ఇక్కడ మలుపు తిరగాలి మరి!


తెలుగులోను ప్రియాంకకి క్రేజ్

తమిళంలో ఉన్న సక్సెస్ లు

ఈ నెల 25న విడుదల కానున్న ‘OG’

ప్రియాంకకి కలిసొచ్చినట్టేనే టాక్

బ్లాక్ బస్టర్ ఖాయమంటున్న ఫ్యాన్స్



ప్రియాంక మోహన్ .. నాజూకు సౌందర్యానికి నచ్చిన పేరు. చక్కని కనుముక్కు తీరుతో .. పొందికైన రూపంతో ఆకట్టునే ఆకర్షణకు ఆనవాలు ప్రియాంక మోహన్. అలాంటి ఈ సుందరి కన్నడ సినిమాతో ఎంట్రీ ఇచ్చినప్పటికీ, తమిళ .. తెలుగు సినిమాలతోనే తన కెరియర్ ను కొనసాగిస్తూ వెళుతోంది. నిదానంగానే అయినా స్టార్ హీరోలతోనే సినిమాలను ప్లాన్ చేసుకుంటూ ముందుకు వెళుతోంది. విశాలమైన కళ్లతో ఈ బ్యూటీ చేసే విన్యాసాలకు అభిమానులుగా మారిపోయిన కుర్రాళ్లు పెద్దసంఖ్యలోనే ఉన్నారు.

తెలుగులో నాని సరసన ప్రియాంక చేసిన ‘నానీస్ గ్యాంగ్ లీడర్’ .. ‘సరిపోదా శనివారం’ ఫరవాలేదనిపించాయి. అలాగే తమిళంలో శివకార్తికేయన్ తో చేసిన సినిమాలు ఆమె క్రేజ్ ను పెంచాయి. అలాంటి ప్రియాంక ఊహించని విధంగా పవన్ కల్యాణ్ ‘%ూ+%’ సినిమాలో ఛాన్స్ కొట్టేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. టాలీవుడ్ వైపు నుంచి ఆమెకి దక్కిన పెద్ద ఛాన్స్ ఇదేనని చెప్పాలి. 250 కోట్లకి పైగా బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమా, బ్లాక్ బస్టర్ కావడం ఖాయమనేది ఫ్యాన్స్ మాట.

డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమా, ఈ నెల 25వ తేదీన భారీ స్థాయిలో విడుదల కానుంది. తమన్ సంగీతాన్ని అందించిన ఈ సినిమాపై అంచనాలు ఒక రేంజ్ లో ఉన్నాయి. నిన్న జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంటులో పవన్ మాటలు ఈ సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. ఈ స్టేజ్ పై ప్రియాంక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టాలీవుడ్ వైపు నుంచి ఆమె కెరియర్ మలుపు తిరిగితే ఇప్పుడే తిరగాలనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ అవకాశం .. అదృష్టం ఎంతవరకూ ఆమెకి కలిసొస్తాయనేది చూడాలి మరి.

## విజయ్‌కి కమల్ హాసన్ పాఠం: సభలకు వచ్చిన జనమంతా ఓట్లు వేయరు!

సభలకు వస్తున్న జనాలను చూసి మురిసిపోవద్దన్న కమల్

ఈ సూత్రం విజయ్‌తో పాటు తనకూ వర్తిస్తుందన్న కమల్

ధైర్యంగా ప్రజలకు సేవ చేయాలంటూ విజయ్‌కు సలహా




రాజకీయాల్లోకి కొత్తగా ప్రవేశించిన నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్‌కు మక్కళ్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధినేత కమల్ హాసన్ ఆసక్తికరమైన సూచన చేశారు. బహిరంగ సభలకు పోటెత్తే జనమంతా ఓట్లు వేస్తారనుకోవద్దని, ఈ వాస్తవాన్ని ప్రతీ నాయకుడు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఈ సూత్రం విజయ్‌కు మాత్రమే కాదని, తనతో సహా దేశంలోని నాయకులందరికీ వర్తిస్తుందని స్పష్టం చేశారు.

వచ్చే ఏడాది తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో విజయ్ రాష్ట్రవ్యాప్తంగా సభలు నిర్వహిస్తున్నారు. ఈ సభలకు భారీగా జనం తరలివస్తున్నారు. ఈ విషయంపై చెన్నైలో విలేకరులు అడిగిన ప్రశ్నకు కమల్ హాసన్ బదులిచ్చారు. “సభలకు వచ్చే జనాన్ని చూసి భ్రమ పడకూడదు. ఆ జనమంతా ఓట్లు వేస్తారనే గ్యారెంటీ లేదు. ఇది విజయ్‌కు మినహాయింపు కాదు. నాతో సహా అందరి విషయంలోనూ ఇది నిజం” అని ఆయన వ్యాఖ్యానించారు.

రాజకీయాల్లోకి కొత్తగా అడుగుపెట్టిన విజయ్‌కు ఎలాంటి సలహా ఇస్తారని అడగ్గా, “ధైర్యంగా మంచి మార్గంలో నడుస్తూ ప్రజలకు సేవ చేయాలని కోరుతున్నాను. ఈ విజ్ఞప్తి అందరు నాయకులకూ వర్తిస్తుంది” అని కమల్ తెలిపారు. రాజకీయాల్లోకి వచ్చాక విమర్శలు సహజమని, వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన పరోక్షంగా సూచించారు.

కాగా, రెండు రోజుల క్రితం తిరువారూర్‌లో జరిగిన ఓ సభలో విజయ్ ఇదే అంశాన్ని ప్రస్తావించడం గమనార్హం. “సభకు ఇంతమంది వస్తున్నారు కానీ, వీళ్లంతా ఓట్లు వేయరని అంటున్నారు. అది నిజమేనా?” అని ఆయన ప్రజలను ప్రశ్నించారు. దీనికి అక్కడున్న జనం ‘విజయ్.. విజయ్’ అని పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ తమ మద్దతు ఆయనకేనని సంకేతాలిచ్చారు. ఈ నేపథ్యంలో కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు తమిళ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## ఒళ్లు గగుర్పొడిచేలా ‘కాంతార’ ప్రీక్వెల్.. అంచనాలు పెంచిన ‘కాంతార చాప్టర్-1’ ట్రైలర్

కాంతారకు ప్రీక్వెల్‌గా రాబోతున్న ‘చాప్టర్ 1’

ట్రైలర్‌ను విడుదల చేసిన పాన్ ఇండియా స్టార్ ప్రభాస్

ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్న ‘పంజుర్లి’ సన్నివేశాలు

రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో చిత్రం

అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానున్న సినిమా




2022లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ‘కాంతార’ సినిమా పరంపరలో తదుపరి రాబోతున్న చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆ ఉత్కంఠను మరింత పెంచుతూ, ‘కాంతార చాప్టర్ 1’ పేరుతో తెరకెక్కుతున్న ప్రీక్వెల్ ట్రైలర్‌ను పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ విడుదల చేశారు.

తాజాగా విడుదలైన ఈ ట్రైలర్ లో ‘పంజుర్లి’కి సంబంధించిన సన్నివేశాలు ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయి. ఈ సన్నివేశాలు ప్రేక్షకులకు థియేటర్లలో ఒక ప్రత్యేకమైన అనుభూతిని పంచుతున్నాయనడంలో సందేహం లేదు. రుక్మిణి వసంత్ మహారాణి పాత్రలో చాలా అందంగా కనిపించారు. రిషబ్ శెట్టి నటన, దర్శకత్వ ప్రతిభ మరోసారి కళ్లకు కట్టినట్టు కనిపిస్తోంది. పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం విజువల్స్ పరంగా మరో స్థాయిలో ఉండబోతోందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. అలాగే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది.

2022లో వచ్చిన ‘కాంతార’ కథకు ముందు ఏం జరిగిందనే అంశంతో ఈ ప్రీక్వెల్‌ను రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే భారీ అంచనాలతో సిద్ధమవుతున్న ఈ సినిమాను అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ‘కాంతార’ సాధించిన అపూర్వ విజయం నేపథ్యంలో, ఇప్పుడు ‘చాప్టర్ 1’పై కూడా అదే స్థాయిలో అంచనాలు నెలకొన్నాయి.



# క్రీడలు



## జట్టులో కెప్టెనే వీక్.. సెలక్షన్ మొత్తం తప్పు: షోయబ్ అక్తర్

భారత్ చేతిలో పాక్ ఓటమిపై మాజీ పేసర్ షోయబ్ అక్తర్ ఫైర్
కెప్టెన్ సల్మాన్ ఆఘాకు ఏమీ తెలియదంటూ ఘాటు విమర్శలు
జట్టులో అత్యంత బలహీనమైన ఆటగాడు కెప్టెనేనని వ్యాఖ్య
కోచ్ మైక్ హెస్సన్, మేనేజ్‌మెంట్ ఎంపిక ప్రక్రియను తప్పుబట్టిన షోయబ్
బ్యాటింగ్, బౌలింగ్ వ్యూహాలు పూర్తిగా విఫలమయ్యాయని విశ్లేషణ

ఆసియా కప్ 2025లో టీమిండియా చేతిలో పాకిస్థాన్ ఓటమి పాలైన నేపథ్యంలో ఆ జట్టు మాజీ ఫాస్ట్ బౌలర్ షోయబ్ అక్తర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాడు. ఈ ఓటమికి పూర్తి బాధ్యత కెప్టెన్ సల్మాన్ అలీ అఘా, కోచ్ మైక్ హెస్సన్‌లదేనని ఆరోపించాడు. సల్మాన్ అఘాకు జట్టులో ఆడే అర్హతే లేదని, అతనే జట్టులో అత్యంత బలహీనమైన ఆటగాడని అక్తర్ ఘాటుగా విమర్శించాడు.
పీటీవీ స్పోర్ట్స్‌తో మాట్లాడుతూ... "కోచ్ మైక్ హెస్సన్




నిర్ణయాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. ఇక కెప్టెన్ గురించి చెప్పాలంటే, అతనికి అసలు ఏమీ తెలియదు. అతను జట్టులో ఏం చేస్తున్నాడో, ఎందుకు ఆడుతున్నాడో అర్థం కావడం లేదు. జట్టులో అతనే వీక్ లింక్. ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడు. అదే స్థానంలో భారత్‌కు హార్దిక్ పాండ్యా వంటి ఆటగాళు ఉన్నారు. వాళ్లతో పోల్చిచూడండి. మంచివాడు అయితే సరిపోదు, ప్రతిభతో జట్టుకు ఏం అందిస్తున్నాడన్నదే ముఖ్యం" అని అక్తర్ పేర్కొన్నాడు.
జట్టు ఎంపిక కూడా పూర్తిగా తప్పని అక్తర్ అభిప్రాయపడ్డాడు. "హసన్ నవాజ్ లాంటి మ్యాచ్ విన్నర్‌ను కాదని, అనుభవం లేని ఆటగాళ్లను ఎందుకు తీసుకున్నారు? అసలు జట్టు ఎంపిక వెనుక ఉన్న ఆలోచన ఏంటో నాకు అర్థం కావడం లేదు. బ్యాటింగ్‌లో 10 ఓవర్లలో 91 పరుగులు చేసిన జట్టు, సులభంగా 200 పరుగులు చేయాల్సింది. కానీ, కీలక సమయంలో వికెట్లు పడ్డాక బ్యాటింగ్ నెమ్మదించింది" అని ఆయన విశ్లేషించాడు.
భారత ఓపెనర్ అభిషేక్ శర్మపై పాక్ బౌలర్లు సరైన వ్యూహాన్ని అమలు చేయలేకపోయారని అక్తర్ విమర్శించాడు. "అభిషేక్‌కు పదేపదే షార్ట్ బంతులు వేయాల్సింది. అతడిని ఒత్తిడిలోకి నెట్టడంలో షహీన్ అఫ్రిది విఫలమయ్యాడు. సల్మాన్ అఘా కెప్టెన్ తన స్థానాన్ని నిలబెట్టుకోలేకపోతున్నాడు. తప్పుడు సెలక్షన్ నిర్ణయాలు తీసుకుంటున్నాడు. ఈ ఓటమికి పూర్తి బాధ్యత కెప్టెన్, కోచ్, మేనేజ్‌మెంట్‌దే" అని అక్తర్ స్పష్టం చేశాడు.

## పాకిస్థాన్‌పై చెలరేగిన యువ ఓపెనర్ అభిషేక్ శర్మకు సెహ్వాగ్ కీలక సూచన

పాక్‌పై 39 బంతుల్లోనే 74 పరుగులు చేసిన అభిషేక్
అభిషేక్‌పై ప్రశంసలు కురిపించిన వీరేంద్ర సెహ్వాగ్
70, 80 పరుగులను సెంచరీలుగా మార్చాలని సెహ్వాగ్ సూచన




భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఒకప్పుడు తనకు చెప్పిన మాటలనే, ఇప్పుడు యువ సంచలనం అభిషేక్ శర్మకు గుర్తుచేశాడు మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్. పాకిస్థాన్‌పై అభిషేక్ ఆడిన అద్భుతమైన ఇన్నింగ్స్ అనంతరం, అతనికి సెంచరీలు చేయడంపై ఓ విలువైన సలహా ఇచ్చారు.
పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ కేవలం 39 బంతుల్లోనే 74 పరుగులు చేసి విధ్వంసం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ అద్భుత ప్రదర్శనపై స్పందించిన సెహ్వాగ్, మ్యాచ్ అనంతరం అభిషేక్‌తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా, తనను సెహ్వాగ్‌తో పోల్చడంపై అభిషేక్ వినమ్రంగా స్పందించాడు. మీ కాలంలోని పాకిస్థాన్ బౌలర్లు చాలా కఠినమైన వారని, అలాంటి బౌలింగ్‌ను కూడా మీరు ఉతికి ఆరేశారని ప్రశంసించాడు. ప్రస్తుత పాక్ బౌలింగ్‌లో అంత పస లేదని అభిప్రాయపడ్డాడు.
అభిషేక్ ప్రశంసలకు సంతోషం వ్యక్తం చేసిన సెహ్వాగ్, అతనికి ఒక ముఖ్యమైన సూచన చేశాడు. "నువ్వు 70 లేదా 80 పరుగుల వద్దకు చేరుకున్నప్పుడు, సెంచరీ చేసే సువర్ణావకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోవద్దు. ఇదే మాట నాకు సునీల్ గవాస్కర్ చెప్పారు. రిటైర్ అయ్యాక, ఇలా చేజారిన ఇన్నింగ్స్‌లు గుర్తుకొచ్చి బాధపడతాం. అరె, అప్పుడు సెంచరీ చేసి ఉంటే బాగుండేది కదా అనిపిస్తుంది. అందుకే, నీదైన రోజున నాటౌట్‌గా నిలిచి, భారీ స్కోరు సాధించాలి" అని సెహ్వాగ్ హితవు పలికాడు.

## ఫఖర్ జమాన్ క్యాచ్ ఔట్ వివాదం..

బంతిని నేలను తాకిందని వాదిస్తున్న పాక్ ఆటగాళ్లు
అంపైరింగ్ వ్యవస్థ భారత్ కు అనుకూలంగా ఉందని ఆరోపణ
బంతి కింద కీపర్ గ్లోవ్ ఉన్నట్లు తాజా వీడియోలో స్పష్టత




ఆసియా కప్ టోర్నీలో భాగంగా జరిగిన సూపర్ 4 మ్యాచ్ లో పాకిస్థాన్ జట్టును టీమిండియా చిత్తుగా ఓడించిన విషయం తెలిసిందే. అయితే, ఈ మ్యాచ్ లో పాక్ ఓపెనర్ ఫఖర్ జమాన్ క్యాచ్ ఔట్ పై వివాదం రేగుతోంది. జమాన్ నాటౌట్ అని, థర్డ్ అంపైర్ నిర్ణయం సరికాదని పాక్ ఆటగాళ్లు ఆరోపిస్తున్నారు. పాక్ జట్టు మాజీ ఆటగాళ్లు కూడా అందుకు వంతపాడుతున్నారు. అంపైరింగ్ వ్యవస్థ భారత్‌కు అనుకూలంగా ఉందని విమర్శలు చేస్తున్నారు. అయితే, ఈ వివాదానికి కారణమైన క్యాచ్ ఔట్ కు సంబంధించి తాజాగా ఓ వీడియోలో పూర్తి స్పష్టత వచ్చింది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఈ వీడియోలో క్యాచ్ ఔట్ సరైందేనని తేలింది.

అసలు ఏంజరిగిందంటే..

ఇన్నింగ్స్ మూడో ఓవర్ లో హార్దిక్ పాండ్యా వేసిన బంతిని ఆడబోయిన ఫఖర్ జమాన్ కీపర్ సంజు శాంసన్ కు క్యాచ్ ఇచ్చాడు. ఈ క్యాచ్ పై స్పష్టత కొరవడడంతో ఫీల్డ్ అంపైర్లు థర్డ్ అంపైర్ ను ఆశ్రయించారు. వివిధ కోణాల్లో పరిశీలించిన థర్డ్ అంపైర్ చివరికి ఔట్‌గా ప్రకటించాడు. దీనిపై పాక్ ఆటగాళు అసంతృప్తి వ్యక్తం చేశారు. బంతి ముందుగా నేలను తాకిందని, ఆ తర్వాత కీపర్ చేతుల్లోకి వెళ్లిందని వాదిస్తున్నారు. అయితే, తాజాగా బయటకు వచ్చిన వీడియోలో బంతి నేలను తాకలేదని, శాంసన్ గ్లోవ్ ను తాకిందని స్పష్టమైంది.

## కొట్టడం వేరు, చితక్కొట్టడం వేరు.. భారత ఓపెనర్లది రెండో రకం: డానిశ్ కనేరియా

ఆసియా కప్ సూపర్ ఫోర్ లో పాకిస్థాన్ పై భారత్ ఘన విజయం
సొంత జట్టుపైనే తీవ్రస్థాయిలో విరుచుకుపడిన మాజీ స్పిన్నర్ దానిష్ కనేరియా
భారత ఓపెనర్లది బ్రహ్మాస్త్ర దాడి అని, పాక్ బౌలర్లకు చుక్కలు చూపించారని వ్యాఖ్య
ఓటమికి ఫఖర్ జమాన్ ను బలిపశువును చేస్తున్నారంటూ ఆరోపణ
సంజూ శాంసన్ పట్టింది క్లీన్ క్యాచ్ అని, దానిపై ఏడవద్దని హితవు





ఆసియా కప్ సూపర్ ఫోర్ మ్యాచ్ లో టీమిండియా చేతిలో పాకిస్థాన్ ఓటమిపాలైన తీరుపై ఆ దేశ మాజీ స్పిన్నర్ డానిశ్ కనేరియా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాడు. భారత ఓపెనర్లు శుభ్ మన్ గిల్, అభిషేక్ శర్మ తమ విధ్వంసకర బ్యాటింగ్ తో పాక్ బౌలర్లను బెంబేలెత్తించారని, వారి దాడికి పాక్ ఆటగాళ్లకు దిమ్మతిరిగిపోయిందని ఘాటుగా వ్యాఖ్యానించాడు.
ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్, సాహిబ్జాదా ఫర్హాన్ (58) అర్ధశతకంతో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 171 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో భారత ఓపెనర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. అభిషేక్ శర్మ (39 బంతుల్లో 74), శుభ్ మన్ గిల్ (28 బంతుల్లో 47) తొలి 10 ఓవర్లలోనే 105 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి పాకిస్థాన్ ఓటమిని ఖాయం చేశారు. దీంతో భారత్ 6 వికెట్ల తేడాతో సునాయాసంగా గెలిచింది.
ఈ నేపథ్యంలో సోమవారం ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడిన కనేరియా, పాక్ ఆటతీరును తీవ్రంగా విమర్శించాడు. "సాహిబ్జాదా ఫర్హాన్ ఏకే-47 సంకేతం చూపిస్తే.. శుభ్ మన్ గిల్, అభిషేక్ శర్మ తమ బ్యాట్లతో ఏకంగా బ్రహ్మాస్త్ర నే ప్రయోగించారు. భారత ఓపెనర్ల ఎదురుదాడికి పాక్ బౌలర్లు నిస్సహాయులయ్యారు. కొట్టడం వేరు, చితక్కొట్టడం వేరు. ఇది రెండో రకం. దాన్ని మామూలు ఉతకడం (ధులాయి) అనరు, మహా ఉతుకుడు అంటారు" అని ఆయన అన్నాడు. అభిషేక్, గిల్ వంటి క్లాస్ ఓపెనర్లు ఉన్నప్పుడు ఇలాంటి పిచ్ పై 200 పరుగుల లక్ష్యం కూడా చిన్నదేనని కనేరియా అభిప్రాయపడ్డాడు.
అంతేకాకుండా, ఓటమికి సాకులు వెతకడం పాకిస్థాన్ కు అలవాటేనని కనేరియా విమర్శించాడు. "ఇప్పుడు వారు ఫఖర్ జమాన్ ఔట్ ను బలిపశువును చేస్తున్నారు. తాను ఔట్ కాలేదని అతడు ఇప్పుడు ఏడుస్తాడు. కానీ సంజూ శాంసన్ పట్టింది స్పష్టమైన క్యాచ్. గ్లోవ్స్ బంతి కింద ఉన్నాయి. అయినా 'బెనిఫిట్ ఆఫ్ డౌట్' అంటూ పాకిస్థాన్ ఈ అంశంపై రాద్ధాంతం చేస్తుంది" అని ఆయన ఆరోపించాడు.




# ఆరోగ్యం



## ప్రాణాంతకంగా మారిన అమీబా



అదో సూక్ష్మజీవి. కంటికి కనిపించదు. చెవికి వినిపించదు. అసలు దాని ఉనికే మనిషికి తెలియదు. కానీ మనకు తెలియకుండానే మన శరీరంలోకి దూరి, మన మెదడులోకి ప్రవేశించి..కొంచెం కొంచెంగా మన బ్రెయిన్‌ను తినేస్తుంది. కొన్నిరోజుల్లోనే మనల్ని చంపేస్తుంది. అదో సూక్ష్మజీవి. కంటికి కనిపించదు. చెవికి వినిపించదు. అసలు దాని ఉనికే మనిషికి తెలియదు. కానీ మనకు తెలియకుండానే మన శరీరంలోకి దూరి, మన మెదడులోకి ప్రవేశించి..కొంచెం కొంచెంగా మన బ్రెయిన్‌ను తినేస్తుంది. కొన్నిరోజుల్లోనే మనల్ని చంపేస్తుంది. అంతటి డేంజర్ క్రిమి..ఇప్పుడు మన దేశాన్ని భయపెడుతోంది. అదే అమీబా. ఇప్పుడది కేరళను వణికిస్తోంది. మెదడును తినే పరాన్నజీవి అమీబా ఇన్ఫెక్షన్ అయిన అమీబిక్ మెనింగోఎన్సెఫాలిటిస్ అరుదైన వ్యాధి. మూడు నెలల శిశువు నుంచి 52 ఏళ్ల వ్యక్తి దాకా ఇలా 70 మంది ప్రాణాలను బలిగొంది. ఆగస్టు నెల కోజికోడ్ జిల్లాకు చెందిన ఓ బాలిక చికిత్స పొందుతూ చనిపోయింది. బ్రెయిన్? ఈటింగ్ అమీబాతోనే బాలిక చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. ఒక్కరితో మొదలైన వ్యాధి..70దాకా చేరింది. తాజాగా త్రిస్సూర్‌లోని చావక్కాడ్‌కు చెందిన రహీం (59). కోజికోడ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. ప్రాథమిక అమీబిక్ మెనింగోఎన్సెఫాలిటిస్ చాలా అరుదైన వ్యాధి. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 500 కంటే తక్కువ కేసులు నమోదయ్యాయి. అయితే, ఒక్క కేరళలోనే 120 కంటే ఎక్కువ కేసులు నమోదయ్యాయి. వాటిలో ఈ సంవత్సరం 70 కేసులు నమోదయ్యాయి. కలుషితమైన మంచినీటిని పీల్చినప్పుడు ఇన్ఫెక్షన్ సంభవిస్తుంది. దీనివల్ల అమీబా సైనస్‌ల ద్వారా మెదడుకు ప్రయాణించి కణజాలాన్ని నాశనం చేస్తుందంటున్నారు వైద్య నిపుణులు. అంటే నిద్రాణ దశ. వెచ్చని కొలనులు, స్విమ్మింగ్ పూల్‌లాంటి వాటిల్లో వృద్ధి చెందుతుంది. ఈ దశలో తిత్తి రూపంలో అంటే ఓసంచిగా ఉంటుంది. సిస్ట్ దశలో అమీబా గట్టి రక్షణ గోడను ఏర్పరచుకుని నిద్రాణ స్థితిలో ఉంటుంది.

ఇది అమీబా సంక్రమణ దశ అంటారు. అంటే ఆహారం తీసుకునే దశ. వెచ్చని తాజా నీటి వాతావరణంలో సరస్సులు, నదులు, కొలనుల్లో అమీబా స్వేచ్ఛగా అమీబా కదులుతూ ఉంటుంది. బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, ఇతర సూక్ష్మజీవులను తిని జీవిస్తుంది. మానవులలో సంక్రమణకు కారణమయ్యే దశ ఇదే. ఈ దశలో అమీబా విభజన ద్వారా పునరుత్పత్తి చేస్తుంది. పర్యావరణంలో పోషకాలు తక్కువగా ఉన్నప్పుడు లేదా నీటి పరిస్థితులు మారినప్పుడు అమీబా ఈ దశకు రూపాంతరం చెందుతుంది. ఈ దశలో అమీబాకు రెండు ఫ్లాజెల్లా.. చలనానికి సహాయపడే తోకలాంటి నిర్మాణాలు) ఏర్పడతాయి, దీనితో నీటిలో స్వేచ్ఛగా ఈత కొడుతుంటుంది. ఈ దశ తాత్కాలికమైనది, అనుకూల పరిస్థితులు తిరిగి లభిస్తే ట్రోఫోజోయిట్ దశకు తిరిగి మారుతుంది. మనిషి మెదడులోకి అమీబా ప్రవేశించే ప్రక్రియ అంటే. చెరువులు, ఈతకొలనులు, అమీబా ఉన్న ప్లేసులో మనిషి ఈతకొట్టడం, నీటిలో మునిగితే ముక్కులో నుంచి అమీబా మన మెదడులోకి వెళ్తుంది. మనిషి మెదడులోకి ప్రవేశించి మన నాడీ వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఇది సోకిన కొన్ని రోజుల్లోనే మనిషి చనిపోతాడు. ఇంతటి డేంజర్ ఫంగస్ మనలోకి వెళ్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనదే. శుభ్రంగా లేని ఈతకొలనుల్లో అస్సలు దిగకూడదు. ఒక వేళ దిగినా తల మాత్రం


## నయా ట్రెండ్.. స్లీప్ టూరిజంకు పోతారా.. !



ఒంటరిగా ప్రపంచాన్ని చుట్టి రావాలనే కల ఎంతో మందిలో ఉంటుంది. అనేక సమస్యలు, మానసిక ప్రశాంతత కోసం ఇలా చాలా మంది పర్యటనలకు వెళ్తుంటారు. బాస్ ఇప్పుడు ట్రెండ్ మారింది తెలుసా.. ఏందా ట్రెండ్ అనుకుంటున్నారా.. ఒళ్లు మర్చిపోయి నిద్రపోవడం. నిజంగా ఈ జనరేషన్‌లో చాలా మందికి పని ఒత్తిడి, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లతో కాలక్షేపం చేస్తూ సరైన నిద్ర పోవడం లేదు. మనిషికి మంచి నిద్ర లేకపోతే తలెత్తే అనారోగ్య సమస్యలు తెలిసినా కూడా ఎలక్ట్రానిక్ పరికరాల మోజులో పడి నిద్రను త్యాగం చేస్తున్నారు. ఇగో వీటిని దృష్టిలో పెట్టుకొని వచ్చేందే..'స్లీప్ టూరిజం'. ప్రస్తుతం దీనికి ప్రాధాన్యం పెరుగుతోంది. టూరిజం అంటే సాధారణంగా కొత్త ప్రదేశాలు వెళ్లడం, చూడటంగా భావిస్తాం. కానీ స్లీప్ టూరిజం మాత్రం ప్రత్యేకం. ఈ టూరిజంలో శరీరానికి, మనసుకీ ప్రశాంతమైన నిద్రను అందించడమే దీన్ని ముఖ్య ఉద్దేశం. తాజా ఈ టూరిజం ప్రపంచ వ్యాప్తంగా సరికొత్త పరిశ్రమగా ఎదుగుతోంది. భవిష్యత్తులో ఈ టూరిజం బిలియన్ డాలర్ల వ్యాపారంగా మారుతుందంటున్నారు నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

స్లీప్ టూరిజం అంటే నిద్ర కోసం ప్రత్యేకంగా పర్యటనలకు వెళ్లడం. పనిలో ఒత్తిడి, అలసట బాధపడుతున్న వారు కొత్త ప్రాంతాలకు వెళ్లి విశ్రాంతి తీసుకోవడంతో పాటు మనసారా నిద్ర పోవడమే ఈ పర్యటకం ప్రత్యేకత. దీన్ని 'నాప్?కేషన్స్' లేదా 'డ్రీమ్ టూరిజం' అని కూడా అంటున్నారు. ఇప్పటికే అమెరికా, జపాన్, దుబాయ్, యూరప్ లాంటి ప్రాంతాల్లో ప్రత్యేకమైన 'స్లీప్ హోటల్స్' ఉన్నాయి. ఇప్పుడు మన దేశంలోనూ ఈ పద్ధతి క్రమంగా వ్యాప్తి చెందుతోంది. ముఖ్యంగా ఈ ట్రెండ్‌ను హిమాలయ ప్రాంతాలు, కేరళలోని ఆయుర్వేద రిసార్ట్‌లు, గోవా బీచ్ రిసార్ట్‌లలో అనుసరిస్తున్నారు. ఈ క్రమంలో ప్రత్యేకమైన ఆయుర్వేద మసాజ్‌లు, హెర్బల్ థెరపీ, యోగా, ధ్యానం ద్వారా సహజ నిద్రను కలిగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇండియన్ జర్నల్ ఆఫ్ స్లీప్ మెడికన్ నివేదికలో పలు సంచలన నివేదికలు వెలుగుచూశాయి.. మన దేశంలో 61 శాతం మంది రోజుకు ఏడు గంటల కంటే తక్కువ సమయం నిద్రపోతున్నారని ఈ నివేదిక పేర్కొంది. పలు అధ్యయనాల్లో.. ప్రతి 10 మందిలో ముగ్గురు కంటే తక్కువ మంది మాత్రమే సాధారణ నిద్రపోతున్నారని వెల్లడైంది. చాలా మంది రోజులో ఆరు గంటలు కూడా నిద్ర పోవడం లేదని పేర్కొంటున్నాయి. ఈసందర్భంగా పలువురు నిపుణులు మాట్లాడుతూ.. రోజువారీ కార్యకలాపాలు, పనిలో ఒత్తిడితో పోరాటం, కుటుంబం ఆర్థిక భారం వల్ల కలిగే మానసిక ఒత్తిడిని నివారించుకోవడానికి ఈ స్లీప్ టూరిజం దోహదం చేస్తుందంటున్నారు. కొత్త ప్రాంతాల పర్యటనకు వెళ్లి, అక్కడ విశ్రాంతితో పాటు హాయిగా నిద్రపోయేందుకు ప్రాధాన్యం ఇవ్వాలంటున్నారు. మన దేశంలో స్లీప్ టూరిజంకు ఉత్తరాఖండ్?లోని రుషికేష్, బ్యాక్ వాటర్.. హౌజ్?బోటులకు ప్రసిద్ధి చెందిన కేరళలోని అలెప్పీ, పచ్చని కాఫీ తోటలు, పొగమంచు కొండలు, ప్రశాంత వాతావరణాన్ని కలిగిన కర్ణాటక లోని కూర్గ్, గోవా, కర్ణాటకలోని గోకర్ణలో ప్రశాంతంగా ఉండే బీచ్‌లు అనువైనవి. అలాగే హిమాచల్‌ప్రదేశ్‌లోని స్పితిలోయ, తీర్థన్ వ్యాలీ, గ్రేటర్ హిమాలయన్ నేషనల్ పార్కు మొదలైనవి స్లీప్?టూరిజంకు అనువుగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో హాయిగా నిద్రపోయేందుకు ప్రత్యేకంగా తయారు చేసిన సౌకర్యవంతమైన మంచాలు, నిద్ర నాణ్యతను మెరుగుపరిచే లైటింగ్ సిస్టమ్, నిద్ర నిపుణుల ద్వారా శిక్షణ, ప్రత్యేక సౌండ్ ప్రూఫ్ గదులను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## బిచ్చగాడిని కోటీశ్వరుడిగా మార్చే రత్నం..!



మత విశ్వాసం ప్రకారం, రత్నాలు ధరించడం వల్ల ఒక వ్యక్తి జాతకంలో గ్రహాల ప్రతికూల ప్రభావాలు తగ్గుతాయని నమ్ముతారు. ఈ రత్నాలు కెరీర్, వైవాహిక, ఆర్థిక, ఆరోగ్య సంబంధిత సమస్యలను అధిగమించడంలో సహాయపడతాయని విశ్వసిస్తారు. జీవితంలోని ప్రతి అంశంలో విజయాన్ని అందిస్తాయని చాలా మంది నమ్మకం. రత్నశాస్త్రం ప్రకారం, ఒకరి రాశి మేరకు రత్నం ధరించడం వల్ల జీవితంపై అనేక సానుకూల ప్రభావాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. కొన్నిసార్లు, రత్నాలు కూడా హానికరం. అశుభ గ్రహాలతో సంబంధం ఉన్న రత్నాలను ధరించడం ఎల్లప్పుడూ హానికరం అని జ్యోతిష్యా, రత్నశాస్త్ర నిపుణులు చెబుతున్నారు. ఒక జ్యోతిష్కుడు వైద్యుడు అయితే, రత్నాలు వారికి ఔషధం. సరైన రత్నాలను ఎంచుకుంటే రత్నాలను ధరించడం వల్ల ఆ వ్యక్తి విధిని మార్చగలదు అంటారు. సరైన, అనుకూలమైన రత్నాలను ధరించడం అమృతం వలె ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే తప్పుడు రత్నాలు ధరించడం విషం లాంటిదని చెబుతున్నారు. అందుకే, రత్నాన్ని ధరించే ముందు తప్పనిసరిగా దాని నిపుణులను సంప్రదించాలని సూచిస్తున్నారు. మేష రాశి వారు వజ్రం ధరించాలి. ఈ రత్నం నాయకత్వ లక్షణాలను, ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని పెంచుతుంది. ఇది బలం, స్పష్టతకు చిహ్నంగా పరిగణించబడుతుంది. వృషభ రాశి: వృషభ రాశిలో జన్మించిన వ్యక్తులు పచ్చను ధరించాలి. ఈ రత్నం జీవితంలో ఆనందాన్ని, పురోగతికి అనేక అవకాశాలను తెస్తుంది. ఈ రత్నాన్ని ధరించడం వల్ల ప్రేమ, స్థిరత్వం మరియు సహనం పెరుగుతాయి.మిథున రాశి: మిథున రాశి వారు అగేట్ రత్నం ధరించడం వల్ల ప్రయోజనం పొందుతారు. ఇది కమ్యూనికేషన్, అనుకూలత, తెలివితేటలను పెంచుతుంది. కర్కాటక రాశి వారికి చంద్రకాంతి చాలా అదృష్ట రత్నం. ఈ రత్నం వ్యక్తిని మానసికంగా బలపరుస్తుంది. వారి కరుణా స్వభావానికి మద్దతు ఇస్తుంది. సింహం: సింహ రాశి వారు రూబీ ధరించాలి. దీనిని ధైర్యం, ఉత్సాహం, అభిరుచికి చిహ్నంగా భావిస్తారు. రూబీ ఒక వ్యక్తి నాయకత్వ లక్షణాలను పెంచుతుంది. వారిని విజయానికి నడిపిస్తుంది. కన్య: కన్య రాశి వారు నీలమణిని ధరించాలి. ఈ రత్నం జ్ఞానం, మానసిక స్పష్టతకు చిహ్నంగా పరిగణించబడుతుంది. తుల: తుల రాశి వారు ఒపల్ రత్నాన్ని ధరించాలి. దీనిని ప్రేమ, ఆప్యాయత, సృజనాత్మకతకు చిహ్నంగా భావిస్తారు. ఇది తుల రాశి వారి దౌత్య లక్షణాలను పెంచుతుంది. సంబంధాలలో సమతుల్యత కోసం కృషి చేయడానికి వారికి సహాయపడుతుంది. వృశ్చిక రాశి: వృశ్చిక రాశి వారు గోమేదికం రత్నాన్ని ధరించడం ద్వారా శుభ ఫలితాలను పొందుతారు. దీనిని బలం, అభిరుచి, పరివర్తనకు చిహ్నంగా భావిస్తారు. ధనుస్సు: ధనుస్సు రాశి వారు నీలమణిని ధరించాలి. ఇది ఒక వ్యక్తిలో సత్యం, జ్ఞానం, నిజాయితీ లక్షణాలను పెంచుతుంది. ఇది వారిని ఆశావాదంగా మారుస్తుంది. అన్వేషించడానికి ధైర్యాన్ని ఇస్తుంది. మకరం: మకర రాశి వారు జామునియా రత్నాన్ని ధరించడం వల్ల ఎంతో ప్రయోజనం పొందుతారు. ఈ రత్నం దృష్టి, స్పష్టత, వృద్ధిని సూచిస్తుంది.కుంభ రాశి: కుంభ రాశి వారు నీలమణి రత్నాన్ని ధరించాలి. ఈ రత్నం కమ్యూనికేషన్, ఆవిష్కరణలను సూచిస్తుంది. ఇది ఒకరి ఆలోచనను మెరుగుపరుస్తుంది. మీనం : మీన రాశి వారు పచ్చ రాయిని ధరించాలి. ఇది జీవితంలో ఆనందం, శాంతి, భద్రతకు చిహ్నంగా పరిగణించబడుతుంది. పచ్చ రాయిని ధరించడం వల్ల మనశ్శాంతి లభిస్తుంది. మీరు మానసికంగా బలంగా ఉంటారు.

## పిల్లలతో మొబైల్ వాడకం తగ్గించే టిప్స్

ఇప్పుడు మన రోజువారీ జీవితం పూర్తిగా మారిపోయింది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి వయసులో మొబైల్ ఫోన్లను ఉపయోగిస్తున్నారు. మొబైల్ ఫోన్లు ఒక వైపు సౌకర్యం, వినోదం, విద్యా సాధనంగా మారినప్పటికీ, చిన్న వయసులో పిల్లలు ఎక్కువ సేపు వాటిని ఉపయోగించడం పెద్ద సమస్యలకు కారణం అవుతోంది. నిద్రలో అంతరాయం, కళ్ళు బలహీనపడటం, దృష్టి సమస్యలు, శారీరక వ్యాయామం లోపం, సామాజిక పరస్పర సంబంధాలు తగ్గడం వంటి సమస్యలు పిల్లలపై నేరుగా ప్రభావం చూపుతున్నాయి. తల్లిదండ్రులు, పెంపకంలో భాగంగా పిల్లల డిజిటల్ వినియోగాన్ని సమతుల్యం చేయడం ఎంతో అవసరం. కానీ ఇది సులభం కాదు, ఎందుకంటే పిల్లలు మొబైల్ ఫోన్ లో గేమ్స్, యూట్యూబ్ వీడియోలు, సోషల్ మీడియా వంటి విషయాలతో వెంటనే ఆకర్షితులు అవుతారు. ఇలాంటి సందర్భాల్లో, సరైన మార్గదర్శకత, క్రమమైన షెడ్యూలింగ్, సరైన ప్రేరణ వంటివి తీసుకుంటే పిల్లలు మొబైల్ వాడకాన్ని తగ్గించడంలో సక్సెస్ సాధించవచ్చు.

1. ఆటలతో ఆకట్టుకోండి: పిల్లలు సహజంగా ఎగురుతూ, కదులుతూ, ఆటలలో నిమగ్నమవడం ఇష్టపడతారు. కాబట్టి మొబైల్ ఫోన్లను వదలిపెట్టి, వారిని క్రికెట్, ఫుట్‌బాల్, సైక్లింగ్, వాలీబాల్ వంటి ఆటలలో పాల్గొనమని ప్రోత్సాహించండి. ఆటలు కేవలం వినోదం మాత్రమే కాదు, పిల్లల శారీరక దృఢత్వం, దృష్టి సామర్థ్యం, సమన్వయ కౌశల్యం ను కూడా పెంపొందిస్తాయి. పిల్లలని ఆటల్లో పాల్గొనమని ప్రోత్సహించడం ద్వారా, వారి మనసు మొబైల్ నుండి దూరమవుతుంది. ఉదాహరణకు, రోజు స్కూల్ తర్వాత 30-45 నిమిషాలు సైక్లింగ్ లేదా ఇంటి ప్రాంగణంలో బాస్కెట్‌బాల్ ఆడటానికి ప్రోత్సహిస్తే, వారి శారీరక వ్యాయామం కూడా పూర్తవుతుంది మరియు ఆరోగ్యకరమైన అలవాట్లు ఏర్పడతాయి.ఇలా చిన్న వయసులోనే ఆరోగ్యకరమైన, క్రియాశీలమైన జీవనశైలి కు వారిని అలవర్చించడం, వృద్ధాప్యం వరకు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మేలు చేస్తుంది.

2. పరిష్కార ఆధారిత రివార్డ్స్: పిల్లలు మొబైల్ వాడకం కోసం సహజంగా ఎక్కువ ఉత్సాహం చూపుతారు. కాబట్టి మొబైల్‌ను ఒక రివార్డ్ గా మార్చడం చాలా ప్రభావవంతమైన పద్ధతి. ఉదాహరణకు, హోంవర్క్, పాఠాలు, లేదా ఏదైనా బాధ్యతా పనిని పూర్తిగా చేసిన తర్వాతే మొబైల్ వాడడానికి అనుమతించండి. ఇది పిల్లలకు ప్రతిదానికి ఒక ప్రతిఫలాన్ని పొందడం అనే భావనను నేర్పిస్తుంది. అలా చేస్తే, మొబైల్ ఉపయోగం అలవాటుగా కాకుండా, ఒక ప్రోత్సాహకం గా మారుతుంది. పిల్లలు పని పూర్తి చేయడంలో ఉత్సాహం చూపిస్తారు, సమయపాలన మరియు దయార్ధత కూడా పెరుగుతుంది. అలాగే, ఈ విధానం వల్ల వెర్సెస్ వ్యసనపు ఉపయోగం తగ్గుతుంది. కేవలం సరదాగా లేదా అనవసరంగా ఫోన్లో గడపడం కాకుండా, మొబైల్ ఉపయోగం ఒక సాధనమని భావిస్తారు. ఈ సరళమైన నియమాన్ని పిల్లల వయసుకు అనుగుణంగా అమలు చేస్తే, వారి ఆత్మ నిబంధన అభివృద్ధి అవుతుంది.

3. కుటుంబంతో సమయం: పిల్లల మొబైల్ వాడకాన్ని తగ్గించడంలో కుటుంబంతో సమయం గడపడం అత్యంత ప్రభావవంతమైన మార్గం. ప్రతి రోజు కొంత సమయాన్ని పిల్లలతో ఆటలు ఆడడం, నేరుగా మాట్లాడటం, లేదా సృజనాత్మక యాక్టివిటీల్లో పాల్గొనడం కోసం వెచ్చించండి. ఈ విధంగా, పిల్లలు మొబైల్‌కు బదులుగా కుటుంబంతో గడిపే సమయాన్ని ఆస్వాదించగలరు. ఇది వారి సామాజిక మరియు భావోద్వేగపరమైన అభివృద్ధికి కూడా సహాయపడుతుంది. చిన్నవయసులోనే, తల్లిదండ్రుల తో నేరుగా ఇంటరాక్షన్ అనుభవించడం వల్ల, పిల్లలలో మానసిక సంతులనం, కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయి. అలాగే, ఈ సమయాలు పిల్లల దృష్టిని ఫోన్ నుండి దూరంగా మార్చడంలో సహాయపడతాయి. అంటే, మొబైల్ వాడకాన్ని అవసరమైన సందర్భాలకు పరిమితం చేయడం సులభం అవుతుంది. చిన్న చిన్న ఆటలు, వర్క్‌షాప్‌లు, లేదా కవితా, కథల సమయం ఇవి అందరికి ఒక పాజిటివ్ అలవాటు గా మారతాయి.


4. ఫోన్ల నష్టాల గురించి అవగాహన: మొబైల్ ఎక్కువ సమయం ఉపయోగించడం వల్ల కళ్ళు బలహీనపడడం, నిద్ర లోపం, మెదడు కార్యకలాపాలపై ప్రభావం వంటి సమస్యలు తలెత్తగలవు. తల్లిదండ్రులు ఈ ప్రతికూల పరిణామాలను పిల్లలకు సరళమైన, అర్థమయ్యే విధంగా వివరించాలి. ఉదాహరణకు: ఎక్కువ స్క్రీన్ టైమ్ కళ్ళపై ఒత్తిడి పెంచి దృష్టి సమస్యలు తేవొచ్చు. ఫోన్ల వాడకం వల్ల తగిన విశ్రాంతి లేమి ఏర్పడుతుంది, ఇది ఆరోగ్యానికి హానికరంగా ఉంటుంది. ముఖ్యంగా మెదడుపై ప్రభావం వల్ల సృజనాత్మకత, సమస్య పరిష్కార సామర్థ్యం తగ్గే అవకాశం ఉంటుంది. కనుక పిల్లలు ఈ కారణాలను అర్థం చేసుకుంటే, మొబైల్ వాడకాన్ని స్వయంగా నియంత్రించేందుకు ప్రేరణ పొందుతారు.



# వ్యాపారం



## మార్కెట్‌కు హెచ్-1బీ సెగ!.. ఐటీ, స్థిరాస్తి రంగాల్లో అమ్మకాల ఒత్తిడి!





ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్లను హెచ్-1బీ వీసాల ఫీజు పెంపు నిర్ణయం గట్టిగానే ప్రభావితం చేయవచ్చనిపిస్తున్నది. ముఖ్యంగా భారతీయ ఐటీ రంగ సంస్థల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కోవచ్చని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో లాభాల స్వీకరణకు ఆస్కారం ఉందనే చెప్పవచ్చు. నిజానికి సూచీల అప్‌ట్రెండ్‌కు గతవారం చివరి రోజునే బ్రేకులుపడ్డాయి. మదుపరులు అమ్మకాలకే పెద్దపీట వేశారు. అయినప్పటికీ అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారంలోనూ సూచీలు పుంజుకున్నాయి.

ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 721.53 పాయింట్లు పెరిగి 82,626.23 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 218.05 పాయింట్లు కోలుకుని 25,327.05 దగ్గర నిలిచింది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వీసాల నిర్ణయంతో ఈ వారం మార్కెట్లపై సెల్లింగ్ ప్రెషర్ ఉండవచ్చన్న అంచనాలైతే వినిపిస్తున్నాయి. ఇక ఎప్పట్లాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలు ముఖ్యమే.

కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 25,000 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,800 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,600-25,800 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు. జీఎస్టీ ఉత్సాహం కనిపిస్తే ఎఫ్ఎంసీజీ, క్యాపిటల్ గూడ్స్, ఆటో రంగ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించవచ్చు.

గమనిక: స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

## మదుపరి మేలుకో.. పరిస్థితులకు తగ్గట్టు మారకపోతే ఉనికే ప్రశ్నార్థకం!




మన దేశంలో మధ్యతరగతి ప్రజానీకమే ఎక్కువ. ప్రతి విషయంలో సర్దుకుపోయే వైఖరి.. అరకొర సదుపాయాలతో సహజీవనం.. కోరికల్ని చంపుకుంటూ ఆశల పల్లకిలో విహరించే మనస్తత్వం.. ఇవీ ఓ భారతీయ సగటు మధ్యతరగతి మనిషి గురించి చెప్పాలంటే గుర్తొచ్చే మాటలు. అయితే మారుతున్న పరిస్థితులకు తగ్గట్టు మనమూ మారకపోతే మన ఉనికే ప్రశ్నార్థకమయ్యే ప్రమాదమున్నది. అందుకే మిడిల్ క్లాస్ ఇన్వెస్టర్లు మేల్కోవాల్సిన సమయం ఆసన్నమైం దని అంటున్నారు ఆర్థిక నిపుణులు.

### సేఫ్ గేమ్ వద్దు..

మధ్యతరగతి మదుపరులు ఎప్పుడూ సేఫ్ గేమ్‌కే మొగ్గుచూపుతారు. అయితే దీనివల్ల రాబడులకున్న మార్గాలు పరిమితమవుతాయని ఎక్స్‌పర్ట్స్ హెచ్చరిస్తున్నారు. రక్షణాత్మక పెట్టుబడులు, వృద్ధిలేని ఆస్తులతో ఒరిగేదేమీ లేదని హెడ్జ్ ఫండ్ మేనేజర్, ఫిన్‌ఫ్లుయెన్సర్ అక్షత్ శ్రీవాత్సవ మాట. ఈ రకమైన ధోరణితో సంపద నెమ్మదిగా, మనకు తెలియకుండానే కరిగిపోతుందని చెప్తున్నారు. నిజానికి చాలామంది తమ ఆదాయం పెరగగానే సురక్షిత పెట్టుబడి సాధనాలను ఎంచుకుని బ్యాడ్ ఇన్వెస్టింగ్‌కు బీజం వేస్తున్నారన్నది శ్రీవాత్సవ అభిప్రాయం.

### ఈక్విటీల్లోకి రావాలి

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు తీవ్ర ఆటుపోట్లకు లోబడి ఉన్నప్పటికీ.. దీర్ఘకాలంలో మెరుగైన రాబడులనే అందిస్తాయని మెజారిటీ మార్కెట్ విశ్లేషకులు చెప్తున్నారు. కాబట్టి ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల్లో అత్యధిక భాగం పీఎఫ్‌లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఒకటికి మించి ఇండ్ల కొనుగోళ్లు ఇతరత్రా సంప్రదాయ మదుపు మార్గాలకే కేటాయించవద్దని సూచిస్తున్నారు. మార్కెట్‌లో ఇప్పుడున్న పరిస్థితులనుబట్టి 80 శాతందాకా స్మార్ట్, రిస్క్ ఆధారిత పెట్టుబడులకు ధైర్యం చేయవచ్చని అంటున్నారు. అయితే అందుకు తగ్గట్టుగా కట్టుదిట్ట

మైన ప్రణాళికలు రావాలి. ఉదాహరణకు సంపన్నులు ట్యాక్స్‌లను ఏ రకంగా పెట్టుబడి

మార్గాలుగా మార్చుకుంటున్నారో పరిశీలించవచ్చు. ఆయా పెట్టుబడులతో పన్ను చెల్లింపులను బాగా తగ్గించేసుకుంటారు. కానీ మధ్యతరగతి వర్గాలు పొదుపును, పెట్టుబడిని విస్మరించి గుడ్డిగా పన్నులను చెల్లిస్తూపోతున్నారు. సరైన ప్రణాళికలుంటే ట్యాక్స్‌లనూ ఇన్వెస్ట్‌మెంట్స్ వైపునకు మళ్లించుకోవచ్చన్నది నిపుణుల సలహా. వ్యూహాత్మకంగా వ్యవహరిస్తే విజ యం ఖాయమే. ఇందుకు వెల్త్ మేనేజ్‌మెంట్, ట్రేడ్ ఎక్స్‌పర్ట్స్‌ను సంప్రదించడం తెలివైన పని. అనుభవం లేకుండా ముందుకెళ్తే నష్టాలు ఎదురుకావచ్చు మరి.

### గుర్తుంచుకోండి..

పిల్లల చదువు, పెండ్లిళ్లు, జీవిత-ఆరోగ్య బీమా, ఆరోగ్య సమస్యలు, రిటైర్మెంట్ అనంతర జీవితం అన్నింటినీ దృష్టిలో పెట్టుకొని చక్కని రోడ్‌మ్యాప్‌ను చిన్న వయసులోనే వేసుకుంటే సత్ఫలితాలుంటాయి. ఉద్యోగ జీవితం ప్రారంభమైన దగ్గర్నుంచే పెట్టుబడులకు పెద్దపీట వేయాలి. ఎంత తక్కువ వయసులో బీమాను తీసుకుంటే అంత ఎక్కువ లాభం ఉంటుంది.

## పతనమైన స్టాక్ మార్కెట్లు..! కుప్పకూలిన ఐటీ స్టాక్స్..!



భారతీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ నష్టాల్లో ముగిశాయి. ట్రంప్ కొత్త వీసా విధానం నేపథ్యంలో మార్కెట్లు పతనమయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్1బీ వీసా వన్ టైమ్ ఫీజును సుమారు రూ.88లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. దాంతో ఐటీ దిగ్గజాల స్టాక్స్‌కు ఎదురుదెబ్బ తగిలింది. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. 82,151.07 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో మొదలైంది. ఏ దశలోనూ మళ్లీ మార్కెట్లు కోలుకోలేదు. ముఖ్యంగా ఐటీ షేర్లు భారీగా పతనమయ్యాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (%ుజూ%), ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, కోఫోర్జ్ వంటి ప్రధాన కంపెనీల షేర్లు భారీగా పడిపోయాయి. ఇంట్రాడేలో 82,583.16 పాయింట్ల గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యల్పంగా 81,997.29 పాయింట్ల వరకు పతనమైంది. చివరకు 466.26 పాయింట్లు పతనమై.. 82,159.97 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 124.70 పాయింట్లు తగ్గి 25,202.35 వద్ద ముగిసింది. దాదాపు 1,715 షేర్లు లాభపడగా.. 2,467 షేర్లు పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.7శాతం పడిపోయాయి. ఐటీ ఇండెక్స్ 2.7 శాతం, ఫార్మా 1.2 శాతం పతనం కాగా.. పవర్ ఇండెక్స్ 1.6 శాతం, చమురు, గ్యాస్ ఇండెక్స్ 0.4 శాతం, మెటల్ ఇండెక్స్ 0.4 శాతం పెరిగాయి.

నిఫ్టీలో అత్యధికంగా నష్టపోయిన షేర్లలో టెక్ మహీంద్రా, టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, సిప్లా ఉన్నాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, బజాజ్ ఆటో, ఎటర్నల్, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్ లాభపడ్డాయి. ట్రంప్ పాలసీ విధానంతో అనిశ్చితి నెలకొన్నది. హెచ్1బీ వీసా విధానం కీలకం. భారతీయ ఐటీ కంపెనీలకు యూఎస్ చాలా కీలకం. ఈ కంపెనీలు తమ ఆదాయంలో ఎక్కువ భాగం యూఎస్ మార్కెట్ నుంచే వస్తుంది. కంపెనీలు తమ ఉద్యోగులను యూఎస్ మార్కెట్‌లో ఆన్ సైట్‌లో చేసేందుకు పంపుతుంటాయి. దీనికి హెచ్1బీ వీసాలు అవసరం. ట్రంప్ ఈ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. కంపెనీలే ఈ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. అయితే, కొత్త హెచ్1బీ దరఖాస్తుదారులకు మాత్రమే కొత్త ఫీజు వర్తిస్తుందని.. ఇప్పటికే ఉన్న వీసాదారులకు కాదని వైట్‌హౌస్ స్పష్టం చేసింది. యూఎస్‌లోకి తిరిగి ప్రవేశించేందుకు అదనపు ఫీజులు ఉండవని.. ఇది ఐటీ కంపెనీలకు నష్టాలను పరిమితం చేస్తుంది. కానీ కంపెనీలు ఈ భారాన్ని క్లయింట్లకు బదిలీ చేయగలవా? అనేది అనిశ్చితి ఉన్నది. అయితే, శుక్రవారం భారత మార్కెట్లు ముగిసిన వెంటనే ట్రంప్ కొత్త వీసా విధానాన్ని ప్రకటించారు. ఆ తర్వాత సోమవారం మార్కెట్లు ప్రారంభం కాగానే ఐటీ స్టాక్ భారీగా పతనమయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. ఊహించినట్లుగానే ఐటీ స్టాక్స్ భారీగా పడిపోయాయి.

## స్నో కింగ్డమ్‌లో దసరా దాండియా సంబురాలు



హైదరాబాద్ : దాండియా ఆటలు, బతుకమ్మ సంబురాలు ఒకే సారి చేయ్యలనుకుంటున్నారా%ొ%అది కూడా మంచు సోయగాల్లో ఆడి పాడి సరదాగా గడపాలనుకుంటున్నారా.. అయితే ఈ దసరాకి హైదరాబాద్ రావల్సిందే. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటే విధంగా స్నో కింగ్డమ్(%నాఅశీష ఖఱఅస్త్రసశీఎ%) సిద్ధమైంది. కొండాపూర్ శరత్ సిటీ మాల్ (%గాలవీడి) గష్ట శీశ్రీశీశీతీ% స్నో కింగ్డమ్ మంచు సోయగాల్లో పిల్లలకు సరికొత్త థ్రిల్ అందించేలా ఏర్పాటు చేసింది.

స్నో దాండియా పేరుతో హైదరాబాద్ వాసులకు 11 రోజులు పాటు మంచులో ఆటా- పాటలతో స్నో కింగ్డమ్ అలరిస్తుంది. దుర్గాదేవిని పూజిస్తూ దాండియా నృత్యాలు చేయడం గుజరాత్, రాజస్థానీల ఆచారం. దసరా నవరాత్రుల సమయంలో ఎక్కువగా దాండియా ఆటలే కనిపిస్తాయి. అలాంటి దాండియా మంచులో చేస్తే ఎలా ఉంటుంది? అలాంటి ఉత్సాహాన్ని హైదరాబాద్ వాసులకు అందించేందుకు స్నో కింగ్డమ్ సిద్ధమైంది. ఈ నవరాత్రులల్లో తొమ్మిది రోజులు.. దాండియా ఆట పాటలతో పాటు బతుకమ్మ సంబరాలతో సరికొత్త సోయగాలతో స్నో కింగ్డమ్ అలరించనుంది. దేశ వ్యాప్తంగా జరుపుకుంటున్న దసరా ఉత్సవాలుకు దేశ వ్యాప్తంగా సంస్కతి సంప్రదాయాలకు పెద్దపీట వేస్తు ఈ వేడుకలు నిర్వహిస్తుంది.

కొండాపూర్‌లోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్లో ఈ బతుకమ్మ దాండియా వేడుకలను స్నో కింగ్డమ్ ఏర్పాటు చేసింది. ఇందులో మంచు ప్యాలెస్‌లు, మంచుతో కప్పిన పర్వతాలు, బ్లాక్ సీల్స్, ఓక్ చెట్లు, ఇగ్లూలు, ధ్రువపు ఎలుగుబంట్లు చూపరులను కట్టిపడేస్తున్నాయి. 32 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ స్నోకింగ్డమ్ ఏర్పాటు చేశారు. పెద్దలకు రూ.750, పిల్లలకు రూ.650 రూపాయలుగా టికెట్ ధర నిర్ణయించారు. మంచులో ఆడుకోవడం, టోబో గానింగ్, స్నో స్లైడింగ్, స్నో రాక్ క్లైంబింగ్, స్నో డ్యాన్స్ వంటి కార్యక్రమాలు ఉన్నాయి. దసరా పండుగ పురస్కరించుకొని ఇప్పుడు దాండియాను సైతం జోడించారు. అలాగే మంచులో ఆడుకోవడానికి అవసరమయ్యే సూట్ కూడా వాళ్లే ఇస్తున్నారు. మొత్తంగా మంచులో ఎంజాయ్ చేయడానికి దాండియా ఆడటానికి ఎక్కడికో వెళ్లాల్సిన పనిలేకుండా..మన హైదరాబాద్ లోనే ఏర్పాటైన ఈ స్నోకింగ్ డమ్ మీకు మంచి వినోదాన్ని పంచుతుంది.

దాండియా కేవలం అందరూ కలిసి ఆనందించడానికి ఆడుకొనే ఆటలు మాత్రమే కావని..ఇది ఆరోగ్యపరంగా, ఫిట్ నెస్ పరంగా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని స్నోకింగ్ డమ్ మేనేజింగ్ డైరెక్టర్ పువ్వాడి హారిక తెలిపారు. దాండియా డ్యాన్ ఒత్తిడిని తగ్గిస్తుందని..ఈ దసరా నవరాత్రుల్లో 11 రోజులు..దాండియా ఆడి అలసిపోయి ప్రశాంతంగా నిద్రపోతారన్నారు. దాండియా ఒత్తిడి, ఆందోళన కూడా దూరం చేస్తుందంటున్నారు. అలాగే ఎంతో సరదాగా సాగే ఈ ఆట ఒత్తిడిని దూరం చేయడంతో పాటు మానసికోల్లాసాన్ని కూడా అందిస్తుందని హారిక అన్నారు.

వార్తాతరంగాలు
మంగళవారం 23 సెప్టెంబర్ 2025

# జమ్ములమ్మ కు పట్టు వస్త్రాలు పూల మాలలతో అభరణాలు అలంకరించి అభిషేక పూజ లు నిర్వహించారు



**దేవరకద్ర అమరచింత సెప్టెంబర్ 22 (స్కై న్యూస్):**అమరచింత పట్టణంలో శ్రీ జములమ్మ దేవి ఆలయంలో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా జములమ్మ దేవి అమ్మవారికి 11 రోజులు ప్రత్యేక పూజా కార్యక్రమాలలో భాగంగా ఆలయ కమిటీ అధ్యక్షులు మంగలి నరసింహులు, ఆలయ పూజారులు తెలుగు వాకిటి కమల రవి దంపతులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మొదటిరోజు అభిషేక పూజ కార్యక్రమంలో దోమ రవి సరళ దంపతులు అమ్మవారికి భాజా భజంత్రులతో, పంచామృతాలతో అభిషేక పూజ కార్యక్రమం నిర్వహించి అమ్మవారికి పట్టు వస్త్రాలు పూల మాలలతో ఆభరణాలు అలంకరించి అభిషేక పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు మంగలి నరసింహులు 22వ తేదీ సోమవారం నుంచి 11 రోజులు దసరా పండుగ వరకు ప్రతిరోజు ఉదయం 9 గంటలకు అమ్మవారికి అభిషేక పూజా కార్యక్రమాలు జరుగునని భక్తాదులు అంతా ఈ 11 రోజులు అభిషేక పూజ కార్యక్రమాల సమయంలో అమ్మవారిని దర్శించుకుని జములమ్మ దేవి కృపా కటాక్షాలు పొందగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యామ భాస్కర్, బాలరాజ్ జయరాములు జగనాదం, బాలరాం శీను జ్యోతి నారాయణమ్మ అనూష తదితరులు పాల్గొన్నారు.

## 28వ వార్డు గాంధీనగర్ కాలనీలో మాజీ వార్డు సభ్యుడు చేగూరి వేణుగోపాల్ ఆధ్వర్యంలో వరుసగా నాలుగోసారి దేవి శరన్నవరాత్రులు



**షాద్ నగర్ 22(స్కైన్యూస్** )మున్సిపాలిటీ 28వ వార్డు గాంధీనగర్ కాలనీలోని మున్సిపల్ గ్రౌండ్ లో మాజీ వార్డు సభ్యుడు చేగూరి వేణుగోపాల్ ఆధ్వర్యంలో వరుసగా నాలుగోసారి దేవి శరన్నవరాత్రు ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ప్రతి సంవత్సరం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పలువురు భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వరుసగా నాలుగోసారి దేవి శరన్నవరాత్రులు నిర్వహిస్తున్న చేగూరి వేణుగోపాల్ ను కాలనీవాసులు అభినందించారు. ప్రతిరోజు అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చేగూరి వేణుగోపాల్ తెలిపారు. పూజా కార్యక్రమంలో మలగారి సత్యనారాయణ, మిర్యాణం ప్రదీప్, అంతటి కోటిలింగం గౌడ్, శేరి శ్రీనివాస్ రెడ్డి, అమరలింగేశ్వర ప్రవీణ్, ఏ అభిలాశ్, రెడ్డి రమేష్, ఏ. సాగర్, సాయి, చరణ్, శ్రీకాంత్, మహిళలు చంద్రకళ, వి.రేఖ, ఎస్.మంజుల, హైమా, రెడ్డి శారద, గొంగళ్ల పార్వతమ్మ, కాలనీ వాసులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సాంప్రదాయ నృత్యాలతో శోభాయాత్ర

**నిజరూప అలంకరణలో వాసవి మాత దర్శనం**

**ఆకట్టుకున్న భక్తి గానాల హరి**



**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 22( స్కైన్యూస్)** జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న 55వ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సాయి బాలాజీ సిండికేట్ మరియు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మార్కెట్ యార్డులోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అధ్యక్షులు మాచిపెద్ది శివకుమార్ శోభాయాత్రను ప్రారంభించారు. శివాలయం నుండి ప్రారంభమైన యాత్రలో ఓం శ్రీ రక్ష బృందం కోలాటాలు వాసవి భజన గ్రూపు భజనలతో పాటు కర్ణాటక నుండి వచ్చిన వేషధారణలు ఆకట్టుకున్నాయి. సాంప్రదాయ నిత్యాలతో కొనసాగిన యాత్ర ఆద్యాంతం చూపరులను భక్తులను ఆకట్టుకున్నాయి ఆలయానికి చేరుకున్న శోభాయాత్రకు ఆలయ అర్చకులు జోషి పాండురంగ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజారోహణం గోపూజ గణపతి పూజ అగ్ని ప్రతిష్ట మహాగణపతి చక్కెర పొంగలి తో మహా నైవేద్యం సమర్పించి తీర్థప్రసాదాలు అందించారు. అదేవిధంగా పంచలోహ నవవిధ నవదుర్గ ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహించారు అనంతరం అన్న ప్రసాద వితరణ చేపట్టారు సాయంకాలం ఆలయంలో నిర్వహించిన ప్రదోష పూజ లలితా సహస్ర నామ పారాయణం కుంకుమార్చన అనంతరం పల్లకి సేవ డోలోత్సవం నిర్వహించారు. భక్త గానాల హరి స్త్రీ కంఠ గాయకుడు డాక్టర్ దీక్షితుల సుబ్రహ్మణ్యం చే ప్రవచనాలు ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో సాయి బాలాజీ సిండికేట్ సభ్యులతోపాటు ఉత్సవ కమిటీ పట్టణ ఆర్యవైశ్యులు వివిధ సిండికేట్ మరియు అసోసియేషన్ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు

## మునిసిపాలిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సిపిఐ ధర్నా

**మరుగుదొడ్ల నిర్వహణ పై మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం**

**సిపిఐ ఆధ్వర్యంలో కమీషనర్ కు వినతి పత్రం అందించిన నాయకులు**



**దేవరకద్ర అమరచింత సెప్టెంబర్ 22 (స్కై న్యూస్):**అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఐ మహిళా విభాగం ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా కార్యదర్శి గీతమ్మ సిపిఐ ఏ రవీందర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీకృష్ణ నగర్ తాసిల్దార్ కార్యాలయం మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఉన్న మరుగుదొడ్ల అస్తవ్యస్త నిర్వహణపై మున్సిపల్ అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ గ్రౌండ్లోని నీటి ట్యాంకును ప్రతినెల శుభ్రం చేయాలని పట్టణంలోని అన్ని వార్డులో దోమల నివారణకు వాగించాలని డిమాండ్ చేశారు. పబ్లిక్ టాయిలెట్లను శుభ్రం చేసి వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈ సమస్యల పరిష్కారం దిశగా కమిషనర్ కృషి చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ యూసుఫ్ కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఏ. భాస్కర్ బాలస్వామి శ్యాంసుందర్ రఘు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పలువురు సిపిఐ నాయకులు మహిళలు పాల్గొన్నారు.

# నూతనంగా నియమితులైన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ఘనంగా సన్మానం

**ఘనంగా సన్మానించిన న్యాయవాద బార్ అసోసియేషన్ సభ్యులు**

**బార్ అసోసియేషన్ నుంచి ఇద్దరు నియమితులవ్వడం చాలా సంతోషకరం... న్యాయవాద బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు**



**షాద్నగర్ 22(స్కైన్యూస్):**16వ అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా ఎన్నికైన ఎం. చంద్రశేఖర్ రెడ్డిని, ఫోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమితులైన సబియా సుల్తానా లను న్యాయవాద బార్ అసోసియేషన్ లోకి సాదరంగా ఆహ్వానించి పూల బొకేలు శాలువాలతో న్యాయవాద బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించి సత్కరించి స్వీట్లు పంచి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాదులు, మహిళ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు ప్రసంగిస్తూ జిల్లా కోర్టుకు సంబంధించి రెండు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులకు మన బార్ అసోసియేషన్ తరపున ఎం చంద్రశేఖర్ రెడ్డి, సబియా సుల్తానాలు నియమితులు కావడం పట్ల సంతోషం వ్యక్తం పరుస్తూ, ఇలాంటి పోస్టులు మన న్యాయవాద బార్ అసోసియేషన్ కి రావడం గర్వకారణం అని అన్నారు. న్యాయవాద బార్ అసోసియేషన్ లో ఒక మహిళ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా ఎన్నిక కావడం బార్ అసోసియేషన్ లో ఉన్న మహిళలందరికీ గర్వకారణం అని అన్నారు. సబియా సుల్తానాను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్క మహిళ న్యాయవాది న్యాయవాద వృత్తిలో ముందుకు వచ్చి మరిన్ని పదవులు సాధించాలని అందరూ ఆకాంక్షించారు. కష్టపడ్డ వారికి మంచి ఫలితం దక్కుతుందని పట్టణ న్యాయవాద బార్ అసోసియేషన్ తరపున ఇద్దరూ అదరపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా నియమితులవడం ఇందుకు నిదర్శనం అని సీనియర్ న్యాయవాదులు అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాద బార అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాలరావు, ప్రధాన కార్యదర్శి గుండుబావి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చీపిరి చంద్రశేఖర్ యాదవ్, సహాయ కార్యదర్శి అంతారం నరసింహులు, కోశాధికారి లింగం గౌడ్, లేడీ రిప్రజెంటేటివ్ జయమ్మ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లైన పెబ్బే శ్రీశైలం రూప్ సింగ్, సీనియర్ న్యాయవాదులు రిటైర్డ్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గంతల శివయ్య, రఘునాథ్ శర్మ, కెవిడి చారి, కనకగిరి మోహన్ రావు, రవీంద్ర కుమార్, చెంది మహేందర్ రెడ్డి, వై శ్రీనివాస్ యాదవ్, మొహమ్మద్ అబ్దుల్ కరీం, కంచి రాజగోపాల్, బెన్నూరి చంద్రయ్య, ఇప్పలపల్లి ప్రభాకర్ గౌడ్, దానక్క సంగమేశ్వర్, టి శ్రీనివాసులు, టి ఆంజనేయులు గౌడ్, చెట్ల శంకర్, ఎం ప్రవీణ్ కుమార్, గంధం సురేందర్, కోరే శంకరయ్య, గడ్డమీది రమేష్ కుమార్, ఆర్ సుధాకర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, కావలి శ్రీశైలం, రేవల్లి రామచందర్, కే శ్రీకాంత్ గౌడ్, ఎం నరేంద్రనాథ్, రాఘవేంద్ర చారి, ఖలీల్, లింగారం లక్ష్మయ్య, కాసోజు శివ, సుధాకర్, బాలరాజ్ గౌడ్, రాజు, లక్ష్మణ్, అనిల్, గంజాయి నర్సింలు, హరీష్ గౌడ్, సంతోష్ కుమార్, గణేష్, నరేష్, శ్యాంసుందర్, అరుణ్ కుమార్ మహిళా న్యాయవాదులు శ్వేత,షహనాజ్, సాత్విక, ప్రణయ, సునీత, నిషిత, లావణ్య, మాతా శ్రీ జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో పయనించాలి: రాజ్ కుమార్ రెడ్డి

**నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకున్న భీష్మరాజ్ ఫౌండేషన్ బృందం**





**నారాయణపేట సెప్టెంబర్ 22 (స్కై న్యూస్):**ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో పయనించాలని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలం నిడుగుర్తి గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో నెలకొల్పిన మండపంలో అమ్మవారికి సోమవారం భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి... ఫౌండేషన్ సభ్యులతో కలిసి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండప నిర్వాహకులు, యువకులు శాలువలతో రాజ్ కుమార్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఆంజనేయస్వామి దేవాలయం, సాయిబాబా దేవాలయాల్లో రాజ్ కుమార్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండప నిర్వాహకులు అనంతరెడ్డి, రామచందర్, శ్రీనివాస్ గౌడ్, మదుసూదన్ రెడ్డి, అరవింద్ గౌడ్, శివారెడ్డి, రాములు, రాజు, కోట్ల నర్సింహులు, కృష్ణయ్య, యువకులు వేణురెడ్డి, శివరాంరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వంశీకృష్ణ, శివరామ్, ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, మధుసూదన రెడ్డి, గోపాల్ గౌడ్, నర్సింహనాయుడు, శ్రీనివాస్ రెడ్డి, ఎం.సంతోష్, రాజప్ప గౌడ్, అశోక్ బసుదే, జేకే అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## హెూమ్ గార్డ్స్ సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు - జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు

**హెూమ్ గార్డ్స్ సిబ్బందికి ఉలెన్ జాకెట్స్ రెయిన్ కోట్స్ అందజేత!**




**జోగులాంబ గద్వాల, సెప్టెంబర్ 22 (స్కై న్యూస్):**జిల్లాలో పని చేస్తున్న హెూమ్ గార్డుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని డి.జి.పి. కార్యాలయం నుండి వచ్చిన ఉలెన్ జాకెట్స్ %డ% రెయిన్ కోట్స్ ను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు తన కార్యాలయంలో హెూంగార్డ్ సిబ్బందికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ...జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హెూమ్ గార్డ్స్ పోలీసు శాఖలో అంతర్గత భాగమని, పోలీసులతో పాటే నిరంతరం తమ సేవలను అందిస్తున్నారని అన్నారు. వర్షాకాలంలో,చలికాలంలో హెూమ్ గార్డ్స్ కి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా విధులు నిర్వర్తించేందుకు ఉలెన్ జాకెట్స్ %డ% రెయిన్ కోట్స్ అందజేస్తున్నామని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్లో పోలీసు సిబ్బందితో పాటు విధులు నిర్వహిస్తున్నారని, క్లిష్ట పరిస్థితులలో కూడా వివిధ బందోబస్తు విధుల్లో చాలా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. హెూమ్ గార్డ్స్ అధికారులు,సిబ్బంది ఎవరికైన సమస్యలు ఉంటే నేరుగా తనని సంప్రదించవచ్చని,రాష్ట్ర పోలీస్ శాఖ సిబ్బంది కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.ఆర్ డీఎస్పీ నరేందర్ రావు, ఆర్.టి. వెంకటేష్, ఆర్. ఎస్సై. విజయభాస్కర్ మరియు హెూమ్ గార్డు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా శ్రీవాసవి మాత



**జోగులాంబ గద్వాల సెప్టెంబర్ 22 (స్కై న్యూస్):**అమ్మలగన్నయమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ చాలా పెద్దమ్మ శ్రీ వాసవి మాత నవరాత్రి ఉత్సవాలలో శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మల్దకల్ మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో మొదటి రోజు ప్రత్యేక పూజలు అభిషేకాలు హెూమం ప్రారంభించారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు నాగరాజు పట్టణ అధ్యక్షులు బాదామి శ్రీనివాసులు వ్యవస్థాపకులు మనసాని నాగరాజు సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రమేష్ ఆచారి రవి చైతన్య ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. సాయంత్రం కుంకుమార్చనకు విశేష స్పందన లభించింది.

## సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ కార్యాలయాల ముందు సిపిఐ ధర్నా

**ఎంపీడీవో తహసిల్దార్ లకు వినతిపత్రం సమర్పించిన నాయకులు.**




**దేవరకద్ర, ఆత్మకూర్ సెప్టెంబర్ 22 (స్కై న్యూస్):**ఆత్మకూరు మండలంలోని వివిధ గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అర్హులందరికీ ఇండ్లు ఇండ్లస్థలాలు వృద్ధాప్య పింఛన్లు వితంతు పెన్షన్లు వికలాంగుల పెన్షన్లు ఒంటరి మహిళ పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. సిపిఐ పార్టీ మండల కార్యాలయం నుంచి ఎంపీడీవో ఆఫీస్ తహసిల్దార్ ఆఫీస్ వరకు పేద ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి కె. విజయరాములు సిపిఐ పార్టీ మండల కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో నిజమైన కాంగ్రెస్ పార్టీ పేదలకు ఇల్లు ఇస్తామని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికైనా నిరుపేదలకు ప్రభుత్వం లబ్ధి చేకూరే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. గ్రామ పరిపాలన వ్యవస్థ లేక ఇందిరమ్మ కమిటీలలో అధికార పార్టీ సభ్యులే ఉండి నిజమైన లబ్ధిదారుల ను గుర్తించకుండా అధికార పార్టీకి చెందిన అనుయాయులకే ఇల్లు ఇళ్ల స్థలాలు వచ్చేలా అధికారులపై ఒత్తిడి తెచ్చి నిరుపేదలకు నష్టం చేస్తున్నారని ధ్వజమెత్తారు . ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల సహకార దర్శి మోష రాబర్ట్ బాలకృష్ణ లింగన్న ఖాజాపూర్ లాల్అమ్మద్ సిపిఐ పార్టీ జిల్లా నాయకులు శ్రీహరి అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ తిమ్మప్ప స్వామికి బంగారు పాదాలు వితరణ



**మల్దకల్, సెప్టెంబర్ 22 (స్కై న్యూస్):**ఆది శిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం ధరూర్ మండలం మన్నపురం గ్రామానికి చెందిన ప్రేమ్ కిషన్ రావు కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో తయారు చేయించిన బంగారు పాదాలను స్వామివారికి బహూకరించారు. ఈ సందర్భంగా బంగారు పాదాలను స్వామి ముందు ఉంచి పూజలు నిర్వహించి అలంకరింపజేశారు. అనంతరం మన్యుసూక్త హెూమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో సత్య చంద్రారెడ్డి, పట్వారి అరవిందరావు, అర్చకులు మధుసూదనాచారి రమేష్ రవి దాతను స్వామివారి శేష వస్త్రంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈవో సత్య చంద్రారెడ్డి, శేషదాశ వంశస్థులు ధీరేంద్ర దాస్, ప్రసన్నా చారి, వెంకోబారావు చంద్రశేఖరరావు, బాబురావు మధుసూదన్ రెడ్డి, వెంకోబ రావు మధుసూదన్ రావు ఆలయ అర్చకులు దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ పొలాల మీద రోడ్డు వేయడం సరికాదు

**ట్రిపుల్ ఆర్ మార్కింగ్ మార్చి పాత పద్ధతి ప్రకారమే చర్యలు తీసుకోవాలి.... సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**

**అయ్యవారిపల్లి చించోడు భీమారం ఉప్పరి గడ్డ తండాలో భూ నిర్వాసితులను కలిసిన సిపిఎం పార్టీ నాయకులు**

**చిన్న కారు, సన్న కారు రైతులకు అన్యాయం జరిగితే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం... సిపిఎం పార్టీ నాయకులు**





**షాద్నగర్ 22(స్పైన్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో 8 జిల్లాలు 32 మండలాలు 163 గ్రామాలు గుండా పోతున్న ట్రిబుల్ ఆర్ రీజనల్ రింగ్ రోడ్డు మార్కింగ్ మార్చి పాత పద్ధతి ప్రకారమే నిర్వహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నాడు రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం ఫరూక్నగర్ మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో గ్రామంలో స్థానిక సిపిఎం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో భూ నిర్వాసితులను కలసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో రైతులతో గ్రామసభ నిర్వహించిన తర్వాతనే గ్రామ ప్రజలకు ఆమోదం మేరకు ప్రజా అవసరాలకు అవసరంలేని భూములను ప్రభుత్వం తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పచ్చని పొలాలను తీసుకొని రైతులను ఇబ్బందుల గురిచేయొద్దని ఆయన అన్నారు . అయ్యవారిపల్లి చించోడు భీమారం ఉప్పరి గడ్డ తండా లో ట్రిబుల్ ఆర్ రీజినల్ రింగ్ రోడ్ వస్తున్న నేపథ్యంలో సిపిఎం పార్టీ నాయకులు అయ్యవారిపల్లి ట్రిబుల్ ఆర్ రీజినల్ రోడ్డు వస్తున్న ప్రదేశాన్ని రైతులతో కలిసి సందర్శించారు ఈ సందర్భంగా సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి ఎన్ రాజు కార్యదర్శివర్గ సభ్యులు శ్రీను నాయక్ మాట్లాడుతూ గ్రామంలోని వ్యవసాయ పొలాల మీదుగా నిర్మించతల పెట్టిన రీజినల్ రింగ్ రోడ్డు మార్కింగ్ ను మార్చాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సిపిఎం పార్టీ షాద్నగర్ కమిటీ తరపున సంపూర్ణ మద్దతు ఉంటుందని రైతులు ఆధర్య పడొద్దు అని అండగా ఉంటామని అన్నారు గతంలో చేసిన మార్పింగ్ ప్రకారమే రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని వారు అన్నారు గతంలో 472 సర్వే నంబర్లు సర్వే జరిగింది పాత పద్ధతి ప్రకారం అయితే ఎవరికి ఎలాంటి ఇబ్బంది ఉండదు అదికాకుండా ప్రస్తుతం కొత్తగా సర్వే నంబర్ 486. నుంచి. 499. వరకు మరియు 504..689 వరకు మొత్తం 37 సర్వే నంబర్లు రీజినల్ రింగ్ రోడ్డు వేస్తామని చెప్పడం సరైనది కాదన్నారు , కానీ నేడు వ్యవసాయ పొలాల మీదుగా రహ దారి నిర్మాణం చేపట్టాలని సర్వే నంబర్లను ఎంపిక చేయడం సరికాదన్నారు. గ్రామంలో మొత్తం చిన్న సన్నకారు రైతులే ఎక్కువమంది ఉన్నారని, 300 మంది రైతులు రోడ్డున పడే అవకాశం ఉంది కాబట్టి ఇట్టి మార్పింగ్ పాత పద్ధతి ప్రకారం చేసి రైతులకు అన్యాయం జరగకుండా చేయాలి 300 ఎకరాల భూమి రీజినల్ రింగ్ రోడ్ ద్వారా రైతులు కోల్పోతున్నారు ఎకరాల భూమిని విత్తనాలు ద్వారా రైతులు భూమిని ఒకరికి ఒక ఎకరం భూమి కూడా లేదని, అలాంటప్పుడు గ్రామం మీదుగా రహదారిని ఎలా వేస్తారని ప్రశ్నించారు. షాద్నగర్ నియోజకవర్గం పరిధిలోని . ఫరూక్నగర్ భీమారం చించోడు అయ్యవారిపల్లి ఉప్పరిగడ్డ కేశంపేట్ మండలంలో తొమ్మిది రేకుల నిర్ధావెల్లి కొందుర్గు మండలంలో చెరుకుపల్లి వనంపల్లి తుంపల్లి ఆగిరాల తంగళ్ళపల్లి గంగన్నగూడ. గ్రామాలలో ట్రిపుల్ ఆర్ పాత అలైన్మెంట్ ప్రకారం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అదేవిధంగా ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే మార్పు చేయాలని కోరారు. ఇట్టి సమస్యలను వెంటనే ఉన్నత అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఈ చిన్న సన్న కారుల రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య షాద్నగర్ డివిజన్ కార్యదర్శి ఎన్ రాజు డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు సిపిఎం పార్టీ నాయకులు శ్రీను నాయక్ సాయిబాబు ఈశ్వర్ కుర్మయ్య పద్మారెడ్డి మహమ్మద్ బాబు శ్రీకాంత్ కావలి రాజు గ్రామ రైతులు సుదర్శన్ రెడ్డి . వెంకటయ్య. చంద్రకాంత్. రజనీకాంత్. ఎం సత్యం. పి సాయన్న. పూజారి సత్తయ్య శ్రీధర్ నాయక్. సూర్య నాయక్ భాస్కర్ నాయక్ శ్రీకాంత్ యాదయ్య హరీష్ వెంకటయ్య మాధవి నవీన్ శివ నర్సింలు కృష్ణా సాయన్న జ్యోతి బాబు గోపాల్ నరేష్ శివయ్య సత్యం శ్రీకాంత్ రవీందర్ రెడ్డి రమేష్. చెన్నయ్య కృష్ణయ్య శంకరమ్మ శివ తదితరులు పనులు పాల్గొన్నారు.

## అంగన్వాడి విద్యార్థులకు క్రీడ మైండ్ ఇంప్రూవ్మెంట్ గేమ్స్ టూల్స్ లను మార్కెట్ యార్డ్ చైర్మన్ రహమతుల్లా, రవికాంత్ కర్ని



**దేవరకద్ర ఆత్మకూరు సెప్టెంబర్ 22 (స్పై న్యూస్):** ఆత్మకూరు మున్సిపాలిటీ లో ని 3వ వార్డ్ లో అంగన్వాడీ విద్యార్థులకు క్రీడా, మైండ్ ఇంప్రూవమెంట్ గేమ్స్ టూల్స్ లను అందించిన, మార్కెట్ యార్డ్ చైర్మన్ రహ్మతుల్లాఖ్, రవికాంత్ కర్ని కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రవికాంత్ కర్ని జన్మదిన సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులతో కలిసి పుట్టిన రోజు జర్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయులు, సిబ్బంది కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోండి



**జోగులాంబ గద్వాల ,సెప్టెంబర్ 22 (స్పై న్యూస్):** గద్వాల జిల్లాలోని నిరుద్యోగ యువతకు వివిధ కంపెనీలలో శిక్షణ మరియు ఉపాధి కల్పించుటకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి యం. ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళా ఈనెల 24వ తేదీన కలెక్టరేట్లోని %×బూజ భీ%-30/1 వద్ద జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనదలచిన అభ్యర్థుల వయస్సు 18 నుండి 35 సంవత్సరాలు మధ్య ఉండాలి. విద్యార్హతగా ఎస్.ఎస్.సి., ఇంటర్ లేదా ఏదైనా డిగ్రీ కలిగి ఉండాలని సూచించారు.ఈ మేళాలో పుష్పల్ ఆగ్రోటెక్ లిమిటెడ్, %జడి×, ్రవీఖఖ% వంటి కంపెనీలతో పాటు హైదరాబాద్, కర్నూలు, గద్వాల్ మరియు ఐజ లోని ప్రముఖ సంస్థలు పాల్గొననున్నాయి. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు....

# సబియమ్మా కంగ్రాట్యులేషన్స్..

**సబియా సుల్తానాకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసిన కేశంపేట మండల మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి**






**షాద్నగర్ 22(స్పైన్యూస్):** దివంగత న్యాయవాది తాండ్ర వీరేందర్ రెడ్డి అంటే షాద్నగర్ న్యాయవాద బార్ అసోసియేషన్ సభ్యులకు ఒక ప్రత్యేకమైన అభిమానం, గౌరవం ఉండేది. ఆయన మహిళా న్యాయవాదుల పట్ల చాలా హుందాగా గౌరవంగా ప్రవర్తించే వారిని మహిళా న్యాయవాదులు అంటూ ఉంటారు. జూనియర్ న్యాయవాదులకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు మరియు ప్రోత్సాహం అందించేవారు తాండ్ర వీరేందర్ రెడ్డి. తండ్రికి తగ్గటుగానే కుమారుడు శ్రవణ్ రెడ్డి కోడలు విశాల ఫోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమితులైన మహిళ న్యాయవాది సబియా సుల్తానాను ప్రత్యేకంగా కలుసుకొని శాలువాతో సన్మానించి సత్కరించి, గుర్తుగా ఒక పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సబియా సుల్తానా మాట్లాడుతూ దివంగత సీనియర్ న్యాయవాది తాండ్ర వీరేందర్ రెడ్డి అంటే తనకు ఒక ప్రత్యేకమైన అభిమానమని, న్యాయ రంగంలో నిష్ణాతులైన వీరేందర్ రెడ్డి ఎప్పుడూ మంచి మంచి సలహాలు ఇచ్చే వారిని, ఒక పెద్ద మనిషిగా హుందాతనంగా వ్యవహరిస్తూ అందరి పట్ల గౌరవంగా ఉండే వారిని, తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డిలు తనను సన్మానించడం పట్ల నిజంగా వీరేందర్ రెడ్డి గారే సన్మానించినట్టు ఉందని సంతోషపడ్డారు. ఈ అద్భుత క్షణాలు జీవితంలో మరువలేనివని తనను సన్మానించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు...

## ఆప్తులను కోల్పోయిన పలువురిని పరామర్శించిన మాజీ మంత్రి



**మిడ్జిల్ సెప్టెంబర్, 22(స్పైన్యూస్ )**మండల బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల అధ్యక్షులు మంద భీంరాజ్ తండ్రి లాలయ్య అనారోగ్యంతో మృతి చెందారు.లాలయ్య అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ మంత్రివర్యులు డా.సి.లక్ష్మారెడ్డి, భీంరాజ్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మసిగుండ్లపల్లి గ్రామానికి చెందిన గోదా ప్రసాద్,బురమోని యాదయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి పరామర్శించారు.

## విద్యా నిధికి చేయూత ఇవ్వండి : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**విద్యా నిధికి ఐదు లక్షల విరాళం ఇచ్చిన ప్రముఖ న్యాయవాది ప్రతాప్ కుమార్**



**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 22(స్పైన్యూస్)** నగరంలో అన్ని రంగాల్లో ఉన్న ప్రముఖులు విద్యా నిధికి విరివిగా విరాళాలు ఇవ్వాలని గౌరవ మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కోరారు. మహబూబ్ నగర్ నగరానికి చెందిన ప్రముఖ న్యాయవాది ప్రతాప్ కుమార్ గారు విద్యా నిధికి 5 లక్షల రూపాయల చెక్కు ను గౌరవ ఎమ్మెల్యే సమక్షంలో, జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయేందిర బోయి కి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. విద్యా నిధికి విరాళం ఇచ్చిన ప్రముఖ న్యాయవాది ప్రతాప్ కుమార్ ను గౌరవ ఎమ్మెల్యే గారు ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా నిధికి వచ్చే ప్రతి పైసా కూడా విద్యాభివృద్ధికే ఖర్చు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మహబూబ్ నగర్ లో విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి చాలా గొప్పదని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎమ్మెల్యే గారు ఎంతో కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. విద్యా నిధికి ఐదు లక్షల రూపాయల విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


# సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు చేయరాదు

**జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్**




**నారాయణపేట సెప్టెంబర్ 22 (స్పై న్యూస్)** నారాయణపేట జిల్లా పరిధిలో సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం మరియు ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధమైన పోస్టులు పెట్టేవారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ... పండగల నేపథ్యంలో మరియు రాజకీయంగాను, కుల, మత, ప్రాంతీయంగాను ప్రజల భద్రతకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్న వాటిని సామాజిక మాధ్యమాలలో షేర్ చేసిన చట్టప్రకారం తీవ్రమైన చర్యలు ఉంటాయని తెలిపారు.సామాజిక మాధ్యమాలు అయిన ఫేస్బుక్, ట్విట్టర్, ఇంస్టాగ్రామ్, వాట్సాప్ గ్రూపులలో ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా, ఒక వర్గానికి కించపరిచే విధంగా ఉన్న, తమకు తెలియని వీడియోలు, ఫోటోలు పోస్టులు చేసిన, వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసిన ఆ గ్రూపు అడ్మిన్ నీ బాధ్యుడిగా చేస్తూ, ఫార్వర్డ్ చేసిన వారిపైన కేసులు నమోదు చేయబడుతాయి అని తెలిపారు. సామాజిక మధ్యమాలను మంచి పనులకు తప్ప వేరే రకంగా వినియోగించే వాళ్లపైన ప్రత్యేకంగా నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు.. జిల్లాలో ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడే వారిని అనుక్షణం పోలీసులు గమనిస్తూ ఉండాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది కావున ఈ తరహా నేరాలకు పాల్పడే వారిని వెంటనే పట్టుకొని అట్టి వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. పోలీసులు నిరంతరం 24/7 పరిశీలిస్తుంటారని తెలిపారు. సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు చేసిన, ఫార్వర్డ్ చేసిన జాగ్రత్తగా గమనించి చేయాలని ఎస్పీ సూచించారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు రూ.10వేల చెక్కు అందజేత కె.రాజ్ కుమార్ రెడ్డి



**నారాయణపేట సెప్టెంబర్ 22 (స్పై న్యూస్):** ఆపదలో ఉన్న పేదలకు చేయూతనిచ్చేందుకు తమ ఫౌండేషన్ ఎల్లవేళలా కృషి చేస్తుందని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి అన్నారు. నారాయణపేట పట్టణానికి చెందిన సానియాబేగం గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ విషయాన్ని రాజ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకురాగా, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేల చెక్కును సోమవారం నారాయణపేటలో అందజేశారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ పేదరికం కారణంగా వైద్యం చేయించుకోలేని ఎంతో మందికి ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. దీంతోపాటు విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణను పెంపొందించేందుకు తమ ఫౌండేషన్ ఎనలేని కృషి చేస్తుందని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తనకు భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డికి సమస్య వివరించిన వెంటనే రూ.10వేలను అందజేయడం సంతోషంగా ఉందని బాధితురాలు తెలిపారు. భవిష్యత్తులో పేదలకు ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవలందించాలని కోరారు. రాజ్ కుమార్ రెడ్డి వెంట విద్యార్థి నాయకులు ఫయాజ్ ఖురేషి, ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, మధుసూదన రెడ్డి, గోపాల్ గౌడ్, నర్సింహనాయుడు, శ్రీనివాస్ రెడ్డి, ఎం.సంతోష్, రాజప్ప గౌడ్, అశోక్ బసుదే, జేకే అనిల్, రాజు ఉన్నారు.

## కబడ్డీ క్రీడ పరిశీలించిన నాయకులు



**జోగులాంబ గద్వాల, సెప్టెంబర్ 22 (స్పై న్యూస్):** జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ స్వర్ణరెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న సబ్ జూనియర్ కబడి క్యాంపును జిల్లా బిజెపి అధ్యక్షుడు రామాంజనేయులు సందర్శించి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ కోచ్ ల సీనియర్ క్రీడాకారుల సూచనలు సలహాలు తీసుకొని క్రమశిక్షణతో ఆడి అలాగే కబడ్డీ క్రీడాకారులకు తమ వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని మేరకు ఈనెల 25 నుంచి 28 వరకు నిజాంబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లాను మొదటి స్థానం విజయం సాధించి గద్వాల జిల్లాకు మంచి పేరు తేవాలని కోరుకుంటూ కబడ్డీ క్రీడాకారులకు పాలు అరటి పండ్లు గుడ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ కబడ్డీ నరసింహా ట్రెజరర్ చందు ఈసీ మెంబర్ జిమ్ పాషా భగత్ సేన సభ్యులు గంట పరేష్ బాబు కోచ్ లు బుజ్జిబాబు శివశంకర్ క్రీడాకారులు పాల్గొనడం జరిగింది.

## అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని 7 వార్డులో ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ



**దేవరకద్ర అమరచింత సెప్టెంబర్ 22 (స్పై న్యూస్):** ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు శీలాన్ గౌడ్, వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి అయూబ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ అమరచింత మండల అధ్యక్షుడు కేజీ మహేందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ అమరచింత పట్టణ అధ్యక్షుడు ఎస్ .ఎం .అరుణ్ కుమార్, ఆత్మకూర్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గృహ నిర్మాణాలు పాల్గొన్నారు.

# పాపం..మాజీ డీఎస్పీ నళిని

హైదరాబాద్ సెప్టెంబర్ 22:తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన డీఎస్పీ నళిని గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. స్వరాష్ట్రం కసం తన ఉద్యోగాన్ని సైతం వదులుకుంది. ఉద్యమంలో పాల్గొన్నందుకు నాటి ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. తాజాగా నళిని ఆరోగ్యానికి సంబంధించిన విషయం అందరినీ షాక్ కు గురిచేసింది. చావు బతుకుల మధ్య నళిని కొట్టుమిట్టాడుతోంది. ఈ క్రమంలో తన అనారోగ్యంపై ఫేస్ బుక్ లో పోస్ట్ చేసింది. తెలుగు రాష్ట్ర ప్రజలకు డీఎస్పీ నళిని బహిరంగ లేఖ ( వీలునామా/ మరణ వాంగ్మూలం)రాసింది.ఒక అధికారిణిగా, ఉద్యమకారిణిగా, రాజకీయవేత్తగా, ఆయుర్వేద ఆరోగ్య సేవికగా, ఆధ్యాత్మిక వేత్తగా సాగిన నా జీవితం ముగియబోతోంది. నాఆరోగ్య పరిస్థితి నెల రోజులుగా సీరియస్ గా ఉంది.ప్రస్తుతం క్రిటికల్ పొజిషన్ లో ఉన్నాను. మూడు(3)రోజుల నుండి నిద్ర లేదు. రాత్రంతా మహా మృత్యుంజయ మంత్రాన్ని జపిస్తూ గడుపుతున్నాను. ఎనిమిది (8)ఏండ్ల క్రితం సోకిన రుమటైడ్ ఆర్థ్రేటీస్ అనే విలక్షణ కీళ్ల జబ్బు రెండు నెలలుగా టైఫాయిడ్ , డెంగ్యూ, చికెన్ గున్యా వైరస్ల వల్ల తీవ్ర స్థాయికి చేరింది. కనకణం పేలిపోతున్నట్లు, ఏ కీలుకా కీలు విరిచేసినట్లు నొప్పి. తట్టుకోలేక పోతున్నాను.2018 లో ఈ జబ్బు ప్రారంభం అయినప్పుడు ఇలాంటి స్థితి యే ఏర్పడ్డపుడు,మొండి పట్టుదలతో ఏదో సాధించాలనే తపనతో హరిద్వార్ వెళ్ళి రాందేవ్ బాబా పంచకర్మ సెంటర్ లో నెలల తరబడి ఉంటూ నన్ను నేను బాగుచేసుకున్నాను. కానీ ఇప్పుడు నాకు అంత దూరం పోయేంత ఓపిక లేదు. నిరామయంలో చేరేంత డబ్బు లేదు. 25 ఏండ్ల క్రితమే నా శరీరం నాన్ స్టెరాయిడల్యాంటీ ఇన్ఫ్లమేటరీ డ్రగ్స్ కు సెన్సిటివ్ గా మారిపోయింది. నేను ఫార్మసిస్టు ను కూడా. కాబట్టి అలోపతి మందులకు ఎన్ని సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయో నాకు బాగా తెలుసు. కనుక 30 లోపు ఉండాల్సిన RA ఫ్యాక్టర్ అత్యధికంగా 900 కు చేరినా స్టెరాయిడ్స్ వాడకుండా ఆయుర్వేదమే వాడుతూ, యోగ,ధ్యానం, వేదాధ్యయనం, యజ్ఞముల ద్వారా మామూలు



మనిషిగా మీ అందరి ముందు కనిపించాను. కానీ గత కొన్ని నెలలుగా మళ్ళీ నాలో స్ట్రెస్ పెరుగుతూ వస్తుంది. దాని ప్రభావమే రకరకాల ఆరోగ్య రుగ్మతలు చుట్టుముట్టాయి. ఇంగ్లీష్ మందులను వాడక తప్పని పరిస్థితి.వాటి సైడ్ ఎఫెక్ట్స్ నా పరిస్థితిని ప్రమాద స్థాయి కి చేర్చాయి.నా గతమంతా వ్యధ భరితం. తెలంగాణ ఉద్యమ పోరాటం వల్ల నా నిలువెల్లా గాయాలే అయ్యాయి. రాజీనామా ద్వారా నాటి ప్రభుత్వం పన్నిన పద్మవ్యూహం లోంచి బయట పడితే, డిపార్ట్మెంట్ నా వెన్నులో సస్పెన్షన్ అనే బల్లాన్ని కసితీరా దింపింది. సహాయం చేసేవాడు కనిపించక, నొప్పిని భరిస్తూనే 12 ఏళ్ల అజ్ఞాతవాసాన్ని అనుభవించాను. మహర్షి దయానందుని దయవల్ల ఒక చక్కని ఆధ్యాత్మిక మార్గాన్ని కనుగొని, అందులో విశేషమైన కృషి చేస్తూ, యజ్ఞ బ్రహ్మగా వివైపిఎస్ ( వేద యజ్ఞ పరిరక్షణ సమితి)సంస్థాపకురాలుగా ఎదిగి, హిందీ అభిమానులను కూడా సంపాదించుకొని,నా దారిని రహదారిగా పూల బాటగా మలచుకున్నాను. నళిని మళ్ళీ వికసించింది.ఇలాంటి తరుణంలో నేటి %జవీ% అధికారంలోకి రాగానే నా ఫైల్ ను ఎందుకో తెరిచారు. నాకేదో సహాయం చేస్తానని ప్రకటన చేశారు. వారిని కలిసి నా మనసులో మాట చెప్పాను. సస్పెన్షన్ పై విచారణ చేయించి ఇన్నేండ్లు ఇవ్వకుండా ఎగ్గొట్టిన సబ్సిస్టెన్స్ అల్లోవెన్స్ లెక్కకట్టి( సుమారు 2 కోట్లు) ఇవ్వండి అని అడుగుతూ 16 పేజీల స్వీయ లిఖిత రిపోర్ట్ ను ఇచ్చాను. వీలైతే వేద విద్యా కేంద్ర స్థాపనకు గ్రాంట్ కూడా ఇమ్మని అడిగాను.( రెండోది వారి పార్టీ పాలసీ కి విరుద్ధం. నేను హిందూ కాకపోయి ఉంటే వెంటనే గ్రాంట్ శాంక్షన్ అయి ఉండేది). 6 నెలల తర్వాత నా పిటిషన్ పొజిషన్ కనుక్కుంటే చెత్త బుట్ట పాలైంది అని తెలిసింది. నా ఆఫీస్ కాపీ ని మళ్ళీ స్కాన్ చేసి పంపాను. దానిపై ఇప్పటి వరకు స్పందన లేదు.మీడియా మిత్రులకు విజ్ఞప్తి. నేను చస్తే ఎవరూ సస్పెండెడ్ ఆఫీసర్ అని రాయకండి.రిజైన్డ్ ఆఫీసర్,కవయిత్రి ,యజ్ఞ బ్రహ్మ అని నన్ను సంభోదించండి. నా శరీరానికి జరగాల్సిన అంతిమ సంస్కారం వైదికంగా జరగాలి . బ్రతుకుండగా నన్ను తెలంగాణ పోరాట విషయంలో ఏ నాయకుడు సన్మానించలేదు. నేను చనిపోయాక అంటే పోస్టుమస్ అవార్డులు, రివార్డులు ఇవ్వడానికి బయలుదేరే రాష్ట్ర నాయకులకు ఒక వినతి.బ్రతుకుండగా నన్ను పట్టించుకొని మీరు రాజకీయ లబ్ధి కోసం నా పేరును వాడుకోవద్దు.ఒకవేళ నా ఈ ప్రస్తుత దయనీయ స్థితి మీలో ఎవరో ఒకరి ద్వారా కేంద్ర ప్రభుత్వ దృష్టికి చేరితే ,నాకు సరైన , ఖరీదైన వైద్యం అందితే నేను ప్రాణాపాయ స్థితి నుండి బయట పడతాను. లేదంటే . ..ఇంకా 3,4 పుస్తకాలు రచించాలని ,100 వీఐపీ యజ్ఞాలు పూర్తి చేయాలని, ఆధ్యాత్మిక కేంద్రం స్థాపించి విద్యార్థులకు శిబిరాలు నిర్వహించి సనాతన ధర్మాన్ని బోధించి వారిని ధర్మ పరిరక్షకులుగా తీర్చిదిద్దాలని, మోక్ష సాధన తీవ్రతరం చేయాలని %ె% ఇలాంటి నా కోరికలు ఈ జన్మలో తీరేలా లేవు. నా పేరు పై ఉన్న ఒక్కగానొక్క ఇంటి స్థలం వివైపిఎస్ కు చెందుతుంది. బ్రతుకుండగా దేశ ప్రధాని ని కలవలేక పోయాను. వారు కరుణామయులు. నా మరణానంతరం వారు నా లక్ష్య సాధన కోసం ఏమైనా ఇవ్వాలి అనుకుంటే మా వేదామృతం ట్రస్ట్ కు ఇవ్వవలసిందిగా మనవి. నా జీవితపు అంతిమ లక్ష్యమైన మోక్ష సాధనను మళ్ళీ జన్మలో కొనసాగిస్తాను అని పేర్కొంది.

# కోఠి ఈఎన్టీ లో భారీగా మురుగునీరు....

**ఒకవైపు మురుగు.... మరోవైపు దుర్గంధం**

**దుర్వాసనలతో కంపుకొడుతున్న ఆసుపత్రి**

**తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు, వైద్యసిబ్బంది**

**హైదరాబాద్:**రోగులకు వైద్యసేవలు అందించాల్సిన ఈఎన్టీ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో మురుగు పరుగులు పెడుతుంది. దీంతో మురుగునీటి ద్వారా దుర్వాసనలు ఆసుపత్రి వార్డులకు వ్యాపిస్తుండటంతో రోగులు ముక్కు మూసుకుని చికిత్సలు పొంద ల్సిన దుస్థితి నెలకొంది. ఇక వార్డుల్లో చికిత్సలు పొందుతున్న రోగులకు వైద్యం అందించే వైద్యులు, సిబ్బంది పరిస్థితి సైతం మరింత దారుణంగా మారింది. ముక్కుకు మాస్కులు పెట్టుకుని, దుర్వాసనలు పీలుస్తూనే వైద్యసేవలు అందించాల్సి వస్తుంది. ఇక అత్యవసరంగా ఈఎన్టీ ఆసుపత్రి క్యాజువాల్టీకి వచ్చే రోగుల పరిస్థితి మరీ దారుణం. మురుగు నీటిలోంచి నడుచుకుంటూ వెళ్లాల్సిరావడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో అవస్థలు పడుతూనే చికిత్సలు చేయించుకుంటున్నారు. అసలే వైద్య నిపుణుల కొరత కారణంగా సకాలంలో వైద్యం అందక ఒకవైపు రోగులు అవస్థలు పడుతుంటే... అగ్నికి ఆజ్యం పోసినట్లుగా ఆరోగ్యాన్ని ప్రసాదించాల్సిన ఈఎన్టీ ఆసుపత్రి మురుగుతో దుర్గంధంగా మారి, తమ వారికి ఎక్కడ కొత్త రోగాలను అంటగడుతుందోనని రోగి సహాయకులు భయాందోళనలకు గురవుతున్నారు.

**పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు....**

ఈఎన్టి ఆసుపత్రి ప్రాంగణంలో నాలా డ్రైనేజీ పొంగిపొర్లుతూ ,ఏరులై ప్రవహిస్తున్నా జిహెచ్ఎంసి అధికారులు తమకేమీ పట్టనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆసుపత్రి ప్రాంగణమంతా దుర్వాసనలు వెదజల్లుతూ రోగులు, వారి సహాయకులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ ఆచర్య తెలిపారు. ఆసుపత్రి దుర్గంధంగా మారినప్పటికీ పాలక వర్గం పట్టించుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తుందన్నరూ. ఆసియా ఖండంలోనే అతి పెద్ద ఆసుపత్రిగా ఖ్యాతిగాంచిన కోఠిలోని ప్రభుత్వ చెవి, గొంతు, ముక్కు (ఈఎన్టీ) ఆసుపత్రిలో వైద్యం కోసం ముక్కు మూసుకుని చికిత్సలు చేయించుకోవాల్సిన దయనీయ పరిస్థితి నెలకొందని చెప్పారు. రెండు వరాల నుండి ఈఎన్టీ ఆసుపత్రి ప్రాంగణంలో డ్రైనేజీ పొంగి పొర్లుతూ ఆసుపత్రి క్యాంటీన్ నుంచి మెయిన్ గేటు మీదుగా క్యాజువాల్టీ వరకు మురుగునీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆసుపత్రి ప్రాంగణమంతా దుర్గంధ పూరితంగా మారి, కంపు కొడుతుందన్నారు. నెల రోజుల నుంచి సంబంధిత అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడంలేదని సూపరింటెండెంట్ ఆవేదన వ్యక్తం చేశారు. జిహెచ్ఎంసి కమిషనర్ కు హైడ్రా కమిషనర్ కు డిఎంఈకి పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మురుగు సమస్య పరిష్కరించాలని కోరారు. వార్డుల్లోకి దుర్వాసన వ్యాపిస్తుండటంతో భోజనం కూడా చేయాలని అనిపించడం లేదని రోగి సహాయకులు వాపోతు న్నారు.

# క్యూఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్ విధానం ద్వారా సమస్యలను తెలుసుకుంటున్నాం

**- యుద్ధ ప్రాతిపదికన సమస్యలను పరిష్కరిస్తున్నాం**

**- ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికార యంత్రాంగం విధులు నిర్వర్తిస్తోంది**

**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



ఇంద్రకీలాద్రి పై భక్తుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం కోసం ఏర్పాటుచేసిన క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్ బ్యాక్ విధానం ద్వారా వచ్చే భక్తుల అభిప్రాయాలను... సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో తొలిరోజు అయిన సోమవారం ఆయన వినాయకుని గుడి ప్రారంభం నుంచి చిన్న రాజగోపురం వరకు కాలినడకన సామాన్య భక్తుల క్యూలైన్ ద్వారా నడిచి వచ్చి భక్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పసి పిల్లలకు పాల లభ్యత, మంచినీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు వంటి అంశాలను పరిశీలించారు. 15 నిమిషాలలో తాను నడక దారిన చిన రాజగోపురం చేరుకున్నానన్నారు. సాధారణ భక్తుల సంతృప్తికర దర్శనం కోసం జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్లు బాగున్నాయని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఉదయం ఏడున్నర గంటలకు ప్రారంభమైన దర్శనం మధ్యాహ్నానికి 20,000 మంది పైగా దర్శనం చేసుకున్నారని తెలిపారు. భక్తులు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు పడకుండా చాలా ఆహ్లాదకర వాతావరణంలో, ఆధ్యాత్మిక వాతావరణంలో దర్శనం చేసుకుంటున్నారన్నారు. అదే సమయంలో విఐపి దర్శనాల కోసం ప్రత్యేకంగా కేటాయించిన సమయంలో మాత్రమే ప్రముఖులు కూడా వస్తూ సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు.రానున్న రోజుల్లో ఇదే రీతిన సామాన్య భక్తుల సంతృప్తికర దర్శనమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం సేవలందించాలని ఆదేశించారు.

**కలెక్టర్ విస్తృత తనిఖీలు**

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీ షా సోమవారం తొలిరోజు వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు భక్తులకు చేసిన ఏర్పాట్లు ఎలా ఉన్నాయో వారి నుంచే అడిగి తెలుసుకున్నారు. వినాయక టెంపుల్, విఎంసి పాయింట్, కేశఖండనశాల, సీతమ్మ వారి పాదాలు, పున్నమి ఘాట్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వైద్య శిబిరాలలో చేసిన ఏర్పాట్లు కూడా తనిఖీ చేశారు.

# తాళం వేసి పండక్కి ఊరికి వెళ్తున్నారా ఇల్లు జర భద్రం

**పోలీసుల సూచనలను పాటించి మీ ఇల్లును భద్రంగా ఉంచుకోండి: తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్**

**తాండూర్:**తాళం వేసి పండక్కి ఊరికి వెళ్తున్నారా ఇల్లును జర భద్రంగా కాపాడుకోవాలని తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ పేర్కొన్నారు.దసరా పండుగను పురస్కరించుకొని ఎస్సై కిరణ్ కుమార్ ప్రజాక్రాంతితో మాట్లాడుతూ స్వగ్రామాన్ని వదిలి, జీవనోపాధి కోసం గ్రామాలల్లో వుండేవారు దసరా పండగను కుటుంబ సభ్యులు బంధువుల సమక్షంలో పండగ జరుపుకోవడానికి, ఇంటికి తాళం వేసి తమ స్వగ్రామాలకు వెలతుంటారని, పండగ జరుపుకుని తిరిగి ఆనందం గా ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగుల గొట్టి, ఇంట్లో దొంగలు పడి, ఇంట్లో దాచుకున్న సొమ్ములు, బంగారునగలుదోచుకుని పోవడం.ఆనందం ఆవిరై పోయి ఇంటి యజమానులు తీవ్ర ఆందళనకు గురి కావడం జరుగుతుంటుందన్నారు. పండక్కి తమ ఊర్లకు వెళ్ళే ప్రతి ఒక్కరు అన్ని జాగ్రత్తలు పాటించాలని పోలీస్ శాఖ తరఫున సూచిస్తున్నామన్నారు.పండుగకి ఊరికి వెళ్లాలనుకునేవారు సాధ్యమైనంతవరకు ఇల్లు ఖాళీ చేసి వెళ్ళకుండా, ఇంటి వద్ద ఎవరో ఒకరు ఉండేలా చూసుకోవాలని, ఒకవేళ ఇంటివద్ద ఎవరిని ఉంచే పరిస్థితి లేకపోతే, పక్క ఇంటివారినైనా తమ ఇంటి వైపు ఒక కన్ను వేసి ఉంచమని చెప్పాలన్నారు. ఊరికి



వెళ్లేముందు ఇంటిలో ఎక్కువ మొత్తంలో నగదు, రూపాయలు, బంగారు ఆభరణములు ఉంచకుండా జాగ్రత్త వహించాలని ఆయన తెలిపారు. వీలైతే బ్యాంకు లాకర్ లో నగదును, బంగారు ఆభరణములను దాచుకుని వెళ్లాలని సూచించారు. బ్యాంక్ లాకర్ లేని వారు నమ్మకం ఉన్న బంధువులు లేదా స్నేహితుల వద్ద దాచుకోవాలన్నారు. పండుగల వేళ బస్ స్టేషన్లు కిక్కిరిసి ఉండటం సహజమని, ఆ సమయంలో బస్సు ఎక్కే క్రమంలో దొంగలు మీ పక్కన తోసుకుంటూ వెళ్లి మీ పాకెట్ లో ఉన్న డబ్బులు, మొబైల్ ఫోన్లు కొట్టివేయడం, మహిళల మెడలో నుండి బంగారు గొలుసులు తెంపుకొని పారిపోవడం చేస్తుంటారని కావున బస్సు ఎక్కే సమయంలో మిమ్మల్ని తోసుకుంటూ వెళ్లే వారి పై దృష్టి పెట్టాలన్నారు. కొంతమంది తమ విలువైన బంగారు ఆభరణాలు, నగదు ఉన్న బ్యాగ్, పర్సును, సంచులు, సూట్ కేస్ లను బస్సు సీట్ లో ఉంచి, నీళ్ల బాటిల్ కొనుక్కోవడానికి, వాష్ రూమ్ కి వెళ్లడానికి లేదా టీ తాగి రావడానికి బస్సు సీట్ లో బ్యాగును వదిలి వెళ్తుంటారని, బస్సు సీటు బ్యాంకు లాకర్ కాదనే విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. సీటుపై ఆశ మొదటికే మోసం తెచ్చే అవకాశము ఉంటుందని కావున అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి పండుగకు పోలీస్ లు పలు సూచనలు ఇచ్చినప్పటికీనీ, కొంతమంది నిమ్మకు నీరెత్తినట్లు నిర్లక్ష్యం వహించి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోక పోవడం వల్ల పలుమార్లు దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. పోలీసుల సూచనలను పాటించి మీ ఇల్లును భద్రంగాఉంచుకోవాలని ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు.

# సంఘవికాసంతోనే దేశాభివృద్ధి...

**విశ్వ శాంతికి భారతీయ విలువలే ఆధారం**

**ఆర్ ఎస్ ఎస్ విభాగ్ సహసంఘచాలక్ డాక్టర్ రమణాచారి**



**కరీంనగర్:**సంఘవికాసంతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్ఎస్ఎస్ విభాగ్ సహసంఘచాలక్ డాక్టర్ చక్రవర్తుల రమణాచారి అన్నారు. కరీంనగర్లోని స్థానిక శిశు మందిర్ లో వారం రోజులపాటు జరుగుతున్న శిక్షావర్గ ప్రారంభ ఉపన్యాస కార్యక్రమంలో డాక్టర్ రమణాచారి మాట్లాడారు. దేశాన్ని మాతృభూమిగా ప్రేమించే స్వయంసేవకులలో అనుశాసనం, దేశభక్తి, సేవాభావం వంటి గుణాల నిర్మాణం ఆర్ఎస్ఎస్ శాఖలో నిర్మాణం జరుగుతుందని వివరించారు. 1925 నుండి సంఘ శాఖల ద్వారా వ్యక్తి నిర్మాణము జరుగుతుందని ఆయన తెలిపారు. శరీరంలోని ప్రతి కణం శరీర ధారుఢ్యానికి ఏ విధంగా పనిచేస్తాయో, దేశంలోని సామాన్య వ్యక్తులు కూడా దేశ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని అన్నారు. భారతదేశ పరమ వైభవం ద్వారానే విశ్వ కళ్యాణం, విశ్వశాంతి సాధ్యపడుతుందని చెప్పారు. శిక్షణకు వచ్చిన స్వయంసేవకులు గ్రామీణ క్షేత్రాలలో సంఘ శాఖల నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవాహ సత్యనారాయణ , మల్లోజుల కిషన్ రావు, శిక్షణకు వచ్చిన స్వయం సేవకులు, తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో ఈ పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ అనేది ఒక భాగోద్వేగం

**మాజీమంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్దిపేట :**రైతుల జీవితాల్లో గుణాత్మకమైన మార్పు వస్తుంది . ఈ ఫ్యాక్టరీ రావడానికి కష్టపడింది, చెమట చిందించింది బీఆర్ఎస్ పార్టీ. విత్తనం నాటింది బిఆర్ఎస్ కానీ ఆ పండ్లను తినడానికి బయలుదేరింది కాంగ్రెస్.రేవంత్ రెడ్డి రిబ్బన్ కత్తిరించడానికి కత్తెర జేబులో పెట్టుకొని బయలుదేరిండు.గాలిలో తేమశాతం లేదని 2018లో పామాయిల్ సాగు జరగదని తేల్చి చెప్పిన కేంద్రం.2021లో ఇదే ప్రాంతం గాలిలో తేమశాతం పెరిగి పామాయిల్ సాగుకు అనువైన ప్రాంతం అయింది.ఒకనాడు కరువు ప్రాంతం నేడు పామాయిల్ సాగుబడికి అనుకూలంగా మారింది. మళ్లీ కెసిఆర్ ప్రభుత్వం వస్తుంది. ప్రతి జిల్లాకు పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తారు.సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో నూతనంగా నిర్మించిన పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభమైన నేపథ్యంలో ఫ్యాక్టరీని సందర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లు కొత్త ప్రభాకర్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ లు యాదవ రెడ్డి, దేశపతి శ్రీనివాస్ బి ఆర్ ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.**

**నాకైతే** చాలా ఆనందంగా ఉంది. ఈ ప్లాంట్ కల సాకారం అవడం అనేది గొప్ప విజయం.అందరి దృష్టిలో ఇది ఫ్యాక్టరీ కావచ్చు కానీ మన దృష్టిలో ఇది ఒక ఎమోషన్.వేలాదిమంది రైతుల జీవితంలో ఒక గుణాత్మకమైన మార్పు తీసుకువచ్చే, దశ దిశను మార్చే ఫ్యాక్టరీ ఇది.2004లో నేను కొత్తగా ఎమ్మెల్యే అయినప్పుడు ఇదే నంగునూరు నర్మెట్ట నుండి ఒక ఫోన్ వచ్చింది.నా పక్క పొంటి పొలమోడు బోరేస్తున్నడు. ఆ బోరు వేయకుండా ఆపండి అని ఫోన్ వచ్చింది.ఈ ప్రాంతము కరువు ప్రాంతంగా ఉండేది. నంగునూరును కూడా కరువు మండలంగా ప్రకటించారు ఎక్కడైతే కరువు ప్రాంతాలుగా ప్రకటిస్తారో అక్కడ తాహసీల్దార్ అనుమతి తీసుకొని బోర్ వెయ్యాలి. ఎవరైనా బోర్ ఏస్తే కలెక్టర్ కు చెప్పి బోర్ బండిని



ఆపించిన రోజులు ఉండేవి. తెలంగాణలో, సిద్దిపేటలో, నంగునూరులో బోరు బండ్లు మాయమై పోయాయి.కెసిఆర్ చేపట్టిన సాగునీటి పనులు, కాళేశ్వరం అయితేనేమి పాలమూరు రంగారెడ్డి, సీతారామ, దిండి ఎత్తిపోతల పథకమైతేనేమి, చెరువులు ఆయితేనేమి, చెక్ డ్యాములు ఆతేనేమి ఈ రాష్ట్రం సస్య శ్యామలమై భూగర్భ జలాలు 6 మీటర్లు పెరిగినాయి.అశ్వరావుపేట, సత్తుపల్లి సముద్రతీరానికి 100 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి కాబట్టి గాలిలో తేమశాతం ఉంటుంది. కాబట్టి అక్కడ మాత్రమే పామాయిల్ పండేది.కేసీఆర్ చేపట్టిన ప్రాజెక్టుల వల్ల పాలమూరు గాని, కాళేశ్వరం గాని, సీతారామ గాని వాటి ఫలితంగా తెలంగాణ ప్రాంతమంతా పామాయిల్ పంట సాగుకు అనుకూలంగా మారింది.ఖమ్మం జిల్లా పర్యటనకు పోయినప్పుడు ఆశ్చర్యపోయాను. అక్కడ ఉండే రైతులు సంపూర్ణమైన రైతులుగా ఉన్నారు.కోతుల బాధ లేదు. చీడ పట్టే బాధ లేదు. ఒక్కసారి పెడితే 30 ఏళ్ల వరకు నెలనెల జీతం పడినట్టు ఆదాయం వస్తుంది.చిన్నకోడూరు మండలంలో కంప్యూటర్ సైన్స్ చదివిన వ్యక్తి నెలకు 60,000 ఐటీ ఉద్యోగం వదిలి పామ్ ఆయిల్ సాగు చేస్తున్నారు.మంచి ఆదాయం ఉంది అని సంతోషం వ్యక్తం చేశాడు.ఐఐఓఆర్, ఇండియన్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ రీసెర్చ్ వారు చెప్పితే తప్ప ఇక్కడ పామాయిల్ సాగు చేయలేమని నాకు చెప్పారు.సిద్దిపేటకు పామాయిల్ పంట తీసుకొద్దాం అని ప్రయత్నం చేసిన తొలినాళ్లలో 2018లో ఇక్కడ ఆయిల్ ఫామ్ సాగు ఉండదు అని చెప్పి వెళ్ళిపోయారు.గాలిలో తేమశాతం తక్కువ ఉంది ఇక్కడ పామాయిల్ సాగు జరగదు అని తేల్చి చెప్పారు. తర్వాత 2019లో అనంతగిరి రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగరుతోపాటు చెరువులు, చెక్ డ్యాముల్లో నీళ్లు నింపుకున్నాం.2021లో పరిశోధన చేసిన తర్వాత మళ్లీ గాలిలో తేమ శాతం పెరిగింది ఇక్కడ పామాయిల్ సాగు చేసుకోవచ్చు అని ప్రకటించారు.కేసీఆర్ కలల ప్రాజెక్టు కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఈ ప్రాంతంలో ఆయిల్ ఫాం సాగు అవుతున్నది.రైతుల జీవితాల్లో వెలుగులు వచ్చిందంటే కారణం కాళేశ్వరం.బోరు బండ్లు మాయమైనాయి అంటే కారణం కాళేశ్వరం.వరి వండుతుంది కానీ ఎకరానికి 30,000 కంటే ఎక్కువ మిగలదు.ఇప్పుడు రేవంత్ రెడ్డి పుణ్యమాని ఎరువులు దొరకక వరి కష్టమైంది.కానీ ఆయిల్ ఫామ్ సాగు లాభసాటిగా ప్రతినెల జీతం పడ్డట్టు రైతుకు ఆదాయం వస్తుంది.2022లో జూన్ 5 నాడు నంగునూరు మండల్ రామచంద్రాపూర్ గ్రామంలో మడుగు ఎల్లారెడ్డి అనే రైతు పొలంలో మొదటి పామాయిల్ మొక్క నాటాను.ఒక్కొక్క రైతును గుర్తించి ఒక్కొక్క ఎకరం పెట్టించి ఇక్కడ వరకు వచ్చాను.అందుకే ఏదో భాగోద్వేగం.. అందుకే ఇది మా కల.చుట్టుపక్కల ఐదు జిల్లాల రైతులకు ఈ ఫ్యాక్టరీ వరప్రదాయిని కాబోతున్నది.విత్తనం నాటింది బీఆర్ఎస్ కానీ పండ్లు తినడానికి మాత్రం బయలుదేరింది కాంగ్రెస్ వాళ్లు.ఈ ఫ్యాక్టరీ రావడానికి వెనుక కష్టం ఎవరిది? తంట ఎవరిది? చెమట చుక్కలు చిందించింది ఎవరు అనేది ప్రజలకు తెలుసు.2022 ఏప్రిల్ నాడు ఆనాటి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి చేతుల మీద శంకుస్థాపన చేసింది మన ప్రభుత్వం.

# జీ ఓ 5 ను వెంటనే రద్దు చెయ్యాలి :రాష్ట్ర కాపు జేఏసీ

## బీసీ రిజర్వేషన్ బలిజ కాపు వర్గాలకు అమలు పరచాలి

## దశల వారి ఉద్యమం -రిలే దీక్షలు. మండలస్థాయి నుండి ఆందోళనలు

## త్వరలో రాష్ట్ర కాపు జేఏసీ పక్షాన ఆమరణ దీక్ష చేస్తా.. అధ్యక్షులు చందు జనార్దన్

**కర్నూలు -సెప్టెంబర్ 22(స్కైన్యూస్)** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీ ఓ 5 ను వెంటనే రద్దు చేయాలనీ గిరి బలిజ లో బలిజ ను తొలగించాలని రాష్ట్ర కాపు జేఏసీ డిమాండ్ చేసింది. రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్దన్ రాయలసీమ పర్యటన లో భాగంగా కర్నూలు బలిజ సంఘ నాయకులు సోమవారం కర్నూలు పట్టణం లో ఏర్పాటు చేసిన సమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చందు జనార్దన్ మాట్లాడుతూ దొమ్మరులను కూటమి ప్రభుత్వం గౌరవించడాన్ని బలిజ వర్గాలు స్వాగత్తిస్తాయి కానీ, గిరి బలిజ పేరిట జీ ఓ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తామని అన్నారు. శ్రీకృష్ణ దేవరాయల వారి వంశం గా ఉన్న బలిజల్లో ఇతర కులాన్ని



కలపడం బలిజలపై కూటమి ప్రభుత్వ దాడిగా బలిజలు భావిస్తారని విమర్శంచారు. తక్షణం జీ ఓ ను రద్దు చేసి గిరి బలిజ లో బలిజను తొలగించాలని రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్దన్ కోరారు.గత ఎన్నికల్లో రాయలసీమ లో బలిజలకు కూటమి నాయత్వం అన్యాయం చేసిందని ప్రభుత్వం ఏర్పడ్డాక నేటికీ రాజకీయ భాద్యతల్లో కానీ నామినేటెడ్ పదవుల్లో కానీ అవకాశం ఇవ్వలేదని ఇవ్వాల్సిందే నని చందు జనార్దన్ డిమాండ్ చేసారు. జనాభా దమాషా ప్రకారం 25 శాతం ఉన్న బలిజ లకు దమాషా ప్రకారం అవకాశాలు ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగులకు ప్రధాన్యత గల స్థానాలు పోస్టింగ్ లు ఇవ్వాలని కోరారు.

# పిల్లల మర్రి లో బతుకమ్మ వేడుకలు

## తెలంగాణ ఆత్మ గౌరవం, వారసత్వ సంపద కు ప్రతీక బతుకమ్మ:ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస రెడ్డి

## మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన కలెక్టర్ విజయేందిర బోయి









**మహబూబ్ నగర్, సెప్టెంబర్ 22(స్కైన్యూస్ )** తెలంగాణ ఆత్మ గౌరవం,వారసత్వ సంపద,తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కి ప్రతీక బతుకమ్మ పండుగ అని మహబూబ్ నగర్ శాసన సభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు తీరొక్క పూలతో తొమ్మిది రోజులపాటు పూజలందుకొనే బతుకమ్మ దీవెనలతో రాష్ట్రంలో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేలా, తెలంగాణ సుభిక్షంగా ఉండేలా గౌరమ్మ తల్లి ఆశీర్వదించాలని ఆయన కోరారు. సోమవారం సాయంత్రం మహబూబ్ నగర్ నగరం లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం పిల్లల మర్రి లో నిర్వహించిన రెండవ రోజు అటుకుల బతుకమ్మ సంబరాల్లో జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయేందిర బోయి తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకకు హాజరైె మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున బతుకమ్మ సంబరాలు చారిత్రాత్మక ప్రదేశంలో కనీవినీ ఎరుగని రీతిలో ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. బతుకమ్మ అంటేనే తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ ఆత్మగౌరవం, ఉద్యమస్ఫూర్తి, మహిళా శక్తి అని ఆయన చెప్పారు. బతుకమ్మ మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని, మహిళలను సంఘటితం చేస్తుందన్నారు. బతుకమ్మ-నవరాత్రుల పూజలు ఫలించి, ప్రజలందరి కోరికలు తీరాలని ఆయన ఆకాంక్షించారు. మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగా మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, మహిళా శక్తి క్యాంటీన్ లు, అంతే కాకుండా సోలార్ పవర్ ప్లాంట్ లను సైతం మహిళలకు అప్పగిస్తున్నామన్నారు. వేలాది గా తరలివచ్చిన అక్కాచెల్లెళ్ళు సంతోషంగా బతుకమ్మ పండుగ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ పూలను పూజించే పండుగ, ప్రకృతిని ఆరాధించే ,మహిళలు ఐక్యంగా నిర్వహించుకునే పండుగ అన్నారు .తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ 9 రోజుల పాటు చారిత్రక,పర్యాటక ప్రదేశాల్లో వివిధ జిల్లాలో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సోమవారం మహబూబ్ నగర్ జిల్లా పిల్లల మర్రి పర్యాటక కేంద్రం లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.బతుకమ్మ పండుగ చెడుపైన మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఆమె అభివర్ణించారు . జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ,ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి,మెడికల్ కలశాల, పబ్లిక్ హెల్త్,పశు సంవర్ధక శాఖ,రెసిడెన్షియల్ పాఠశాలలు ,కళాశాలలు,డి.ఆర్.డి.ఓ,మున్సిపల్ శాఖ,మహిళా శిశు సంక్షేమ శాఖ, ముఖ్య ప్రణాళిక శాఖ అధికారి కార్యాలయం శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నట్లు తెలిపారు.జిల్లాలో బతుకమ్మ సంబరాలు ఘనం గా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలను పెట్టి బతుకమ్మ పాటలతో సందడి చేశారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన కలెక్టర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మహిళలతో కలిసి బతుకమ్మ పాటలకు లయబద్ధంగా బతుకమ్మ ఆడుతూ మహిళలను ఉత్సాహ పరిచారు.మహిళలకు బతుకమ్మ శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ శ్రీమతి అనితా మధుసూదన్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్,జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి,వినోద్ కుమార్ ,మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి,జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని జరీనా బేగం,డి.ఆర్.డి. ఓ నర్సింహులు,జిల్లా పర్యాటక అధికారి,డి.పి.ఆర్. ఓ శ్రీనివాస్,పురావస్తు శాఖ ఏ.డి.నాగ లక్ష్మి, అదనపు పి.డి.శారద తదితరులు పాల్గొన్నారు

# రాజీవ్ పార్క్ అభివృద్ది కి 3 కోట్ల నిధులు మంజూరు చేయించిన జగ్గారెడ్డి, నిర్మల

## కన్సల్టెన్సీ, డిజైన్ అండ్ ఆర్కిటెక్ట్ ప్రతినిధులతో కలిసి రాజీవ్ పార్క్ ను పరిశీలించిన జగ్గారెడ్డి, నిర్మల

## పదేళ్ల పాటు సౌకర్యాలు లేకుండా నిరుపయోగంగా ఉన్న రాజీవ్ పార్క్

## నెల రోజుల్లో అన్ని సౌకర్యాలతో సంగారెడ్డి ప్రజలకు అందుబాటులో కి రాజీవ్ పార్క్

## వచ్చే నెలలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మళ్లీ రాజీవ్ పార్క్ ప్రారంభోత్సవం

**సంగా రెడ్డి సెప్టెంబర్ 22:** అండ్ ఆర్కి టెక్ట్ , కన్సల్టేషన్ ప్రతినిధుల తో రాజీవ్ పార్క్ ను విజిట్ చేసిన జగ్గారెడ్డి , నిర్మల... ఈ అందర్భంగా జగ్గ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ పార్క్ అభివృద్ది కి 3 కోట్లు మంజూరు అయ్యాయి....2004 ఎమ్మెల్యే అయిన తర్వాత 2005 లో బొబ్బిలి కుంట కు అనుకుని ఉన్న స్థలం లో రాజీవ్ పార్క్ కు శంకుస్థాపన చేయడం జరిగిందని,ముఖ్యమంత్రులు రాజశేఖర్ రెడ్డి , రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి ల హయాం లో పనులు జరిగి పూర్తయ్యాయిన్నారు. సమైక్య రాష్ట్రం లో పదేళ్ల పాటు ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు ఈ పార్క్ లో మ్యూజికల్ ఫౌంటేన్, చిల్డ్రన్ పార్క్, ప్లే ఏరియా ఏర్పాటు చేశాను.2014 నుండి 2018 వరకు పార్క్ కుంటుబడి పోయింది... చాలా మంది ఈ విషయం లో కాంప్లైంట్ చేసినప్పటికీ, ప్రభుత్వం మనది కాదు, ఎమ్మెల్యే గా లేను కాబట్టి ఏమి చేయలేకపోయాను.... నేను మొన్న ఎన్నికల్లో ఓడిపోయినా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాబట్టి నిధులు తీసుకువస్తున్ననన్నరు నియోజకవర్గం లో పనులు జరగడం కోసం ప్రోటోకాల్ ఉండాలి అందుకే నిర్మల కు కార్పొరేషన్ పదవి ఇస్తున్నా అని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పారు. ఈమధ్య కాలంలో మున్సిపల్ అడ్మనిస్టేషన్ డైరెక్టర్ అండ్ కమిషనర్ శ్రీదేవి నీ కలిశాను.... ఆమెకు రాజీవ్ పార్క్ కోసం 15 కోట్ల రూపాయల ప్రతిపాదనలు ఇవ్వడం జరిగింది.... ఆమె అత్యవసర పనులు కోసం 3 కోట్లు ఇస్తా అనడం తో అందుకు తగ్గ ప్రతిపాదనలు సిద్దం చేయడం జరిగింది...3 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి... 3 కోట్ల తో ఏ ఏ పనులు చేయాలో కన్సల్టెంట్, అర్చిటెక్ట్ ప్రతినిధులకు సూచించిన జగ్గారెడ్డి.... పార్క్ లో పెరిగిన గడ్డి నీ తొలగించి లాండ్ స్కేప్ చేయండి.... ఉన్న చెట్ల ను తొలగించకుండా పనులు జరగాలన ఆదేశించారు.. కొత్త గ్రాస్, చిల్డ్రన్ పార్క్, లేటెస్ట్ గా ఏమి చేయొ చ్చో చూడండి.... కింద టైల్స్ కాకుండా , మందం ఉన్న తాండూర్ బండలు వేయండి. షో కోసం కాకుండా మన్నిక ఉండాలనీ , లైటింగ్ కూడా షో కోసం కాకుండా మన్నికైన వాం లైటింగ్ ఏర్పాటు చేయండి... పార్క్ లో ఎక్కువ వెలుతురు ఉండేలా హై మాస్ట్ లైట్స్, దగ్గర దగ్గర గా లైటింగ్ ఏర్పాటు చేయాలి.... ఓల్టేజ్ ఎక్కువ గా ఉన్న లైట్స్ వాడండి.... వర్షం నీరు పార్క్ లో నిలవకుండా ఉండాలి, వెంట వెంటనే బయటకు వెళ్ళాలి.... చిల్డ్రన్ పార్క్ లో ఒక ఫీట్ మేర ఫైన్ సాండ్ ఏర్పాటు చేయాలి.... ఎంట్రెన్స్ లో రౌండ్ ఫౌంటేన్ ఉండాలి, అవి కూడా మన్నిక అయినవి , మంచి లేటెస్ట్ లైటింగ్ తో ఏర్పాటు చేయాలి.... మ్యూజికల్ ఫౌంటెన్ సైతం ఇప్పుడున్న లేటెస్ట్ డిజైన్ తో ఏర్పాటు చేయండి..... జెంట్స్, లేడీస్ కు సెపరేట్ గా 6 వాష్ రూం లు ఏర్పాటు చేయండి.... రాజీవ్ పార్క్ చుట్టూ పది ఫీట్ల మేర ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి..... పార్క్ కు కొత్త ఆర్చ్ ఏర్పాటు చేయండి.... కొత్త జిమ్ పరికరాలు ఏర్పాటు చేయండి, జిమ్ ఏర్పాటు చేసే దగ్గ ర పర్మినెంట్ ఫ్లోర్ ఏర్పాటు చేయాలి.... వాచ్మెన్ రూం ఏర్పాటు చేయండి... పార్క్ లో సేద తీరేందుకు లేటెస్ట్ స్టోన్ బెంచ్ ఏర్పాటు చేయండని చుచించారు.కొత్త గా 160 కేవీ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాల నీ ఎలక్ట్రిసిటీ అధికారులకు సూచన... అక్టోబర్ నెలలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన వుంటుంది. ఆయన చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయిస్తాం, అక్టోబర్ 25 లో గా పనులు పూర్తి కావాలి.... యుద్ధ ప్రాతిపదికన పొద్దున, రాత్రి రెండు పూటలా పనులు జరగాలి.... ముఖ్యమంత్రి తో పాటు మంత్రి దామోదర్, ఇంచార్జ్ మంత్రి వివేక్ లు హాజరవుతారు.... సంగారెడ్డి ప్రజలకు రాజీవ్ పార్క్ అందుబాటు లో లేక, సరైన సౌకర్యాలు లేక పది సంవత్సరాలు దాటి పోయింది..... ప్రజలకు అన్ని సౌకర్యాలతో రాజీవ్ పార్క్ అందు బాటులో కి రావాలిపిల్లలు ఎంజాయ్ చేసేలా ఫౌంటేన్ ఉండాలి, సాయంత్రం 5 గంటల నుండి 10 గంటల వరకు ఫౌంటేన్ లు వర్క్ మోడ్ లో ఉండాలి.... పాత మ్యూజికల్ ఫౌంటెన్ స్థానం లో మొత్తం కొత్త గా ఏర్పాటు చేయండిపిల్లల కోసం కొత్త గా మ్యాజిక్ పౌంటెన్ ఏర్పాటు చేయాలని కన్సల్టెంట్ ప్రతినిధుల కు సూచనఈనెల 30 న అర్చిటెక్ట్స్ డిజైన్ ఫైనల్ చేసేందుకు హైదరాబాద్ లో కన్సల్టెంట్ ఆఫీస్ లో సమావేశం కావాలని నిర్ణయించారు.

# ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించిన దివ్యాంగులు

**సదరం క్యాంప్ ఏర్పాటు అభినందనీయం**

**రంగారెడ్డి జిల్లా ఎన్పీ ఆర్డీ అధ్యక్షుడు ఆశన్న గారి భుజంగారెడ్డి**

**దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా.**

**త్వరలో సంబంధిత శాఖలతో సమావేశం ఏర్పాటు**

**ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ హామీ**

**షాద్నగర్ 22(స్కైన్యూస్):**దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. వచ్చే నెలలో సదరం క్యాంపు ఏర్పాటు నిర్ణయాన్ని వ్యక్తం చేస్తూ దివ్యాంగులు ఎమ్మెల్యే శంకర్ కు శాలువ పూల మాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... మీరు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం వికలాంగుల చైర్మన్ ముత్తినేని వీరయ్య, రాష్ట్ర ప్రభుత్వ డెరైక్టర్ దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి శైలజ సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో చర్చించుకునే విధంగా సౌకర్యం కల్పిస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా గత రెండు నెలల క్రితం ఉప పరికరాలు అందజేస్తామని అ లింకో సంస్థ అర్హులైన దివ్యాంగుల నుండి 150 కి పైగా ఫిర్యాదులు స్వీకరించారు. 50 రోజులలో అందిస్తామని చెప్పారు. కానీ నేటికీ అందించలేకపోయారు. దాదాపు 70 రోజులు గడుస్తున్న నేటికీ అందించకపోవడంతో వికలాంగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉప పరికరాలు వేగవంతంగా అందేలా కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆశన్న గారి భుజంగారెడ్డి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఆర్థిక రుణాలు, ఇందిరమ్మ ఇళ్లలో మొదటి ప్రాధాన్యత దివ్యాంగులకు కల్పించాలని, అంతోదయ కార్డులు, ఉచిత బస్సు సౌకర్యం, తదితర అంశాలను వినతి పత్రంలో పొందుపరిచారం. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు మధునాల యాదయ్య, నెహ్రూ , దిర్శిణం శంకర్, కాంగ్రెస్ నేత కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు..

# మోడీ జీవితం ఆదర్శప్రాయం ఎం పి - డీకే అరుణ



**సేవా పక్షోత్సవాలలో భాగంగా ప్రధాని మోడీ ఫోటో ఎగ్జిబిషన్ ను సందర్శించిన ఎంపీ Dk . అరుణ**

**హైదరాబాద్, సెప్టెంబర్ 22(స్కైన్యూస** హైదరాబాద్ లో బీజేపీ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో సేవా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ప్రధాని మోడీ జీవిత విశేషాలపై పై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ సోమవారం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ ఎంపీ డీకే. అరుణ సందర్శించారు.ఎమ్మెల్సీ కొమురయ్య, పార్టీ ఇతర ముఖ్య నాయకులతో కలిసి ఎగ్జిబిషన్ లో కలియదిరిగి, మోడీ జీవిత చరిత్ర ఘట్టాలను ఎంపీ డీకే. అరుణ చూశారు ప్రపంచంలోనే ఎన్ డి ఎ ఆదర్శపాలన, అమలు చేస్తున్న పథకాలు, మన ప్రధాని మోడీ పని తీరు, వారి జీవిత విశేషాలు తెలిసేలా ఎగ్జిబిషన్ చాలా బాగుందని ఆమే అన్నారు - రాష్ట్ర ప్రజలు, యువతి, యువకులు ఈ ఎగ్జిబిషన్ ను సందర్శించి మోడీ జీవిత విశేషాలు తెలుసుకోవాలని అన్నారు

# కురువ సంఘం నూతన కమిటీ అధ్యక్షునిగా బిక్షపతి ఎన్నిక

**ఎన్నికైన కమిటీని సన్మానించిన ఎమ్మెల్సీ నాగర కుంట నవీన్ రెడ్డి**



**షాద్ నగర్ 22(స్కైన్యూస్ )**పట్టణంలోని ఫరుక్ నగర్లో నూతనంగా ఎన్నికైన కురువ సంఘం కమిటీని సన్మానించారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.కురువ సంఘం నూతన అధ్యక్షునిగా పర్వతాపురం బిక్షపతి,ఉపాధ్యక్షలు గా గోపాల్,మహేష్,ప్రధాన కార్యదర్శి గా లక్ష్మి నరసింహ,సలహాదారులుగా దూల నర్సిములు లను శాలువాతో సన్మానించారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ కురువ సంఘం అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పిల్లి శారద శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137